అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 21 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక




సంపుటి : 5 సంచిక : 23 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

# నయా పైసా ఇవ్వలే

## కేంద్ర బీజేపీ సర్కారుపై కేసీఆర్ మండిపాటు

- ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీనే మేలు
- కేంద్రం మనకు అనుకూల సర్కారు కాదని వ్యాఖ్య
- నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణమే తొలి ప్రాధాన్యత
- కంటివెలుగు కొనసాగిస్తూనే...ఈఎన్‌టీపై ప్రత్యేక దృష్టి
- విడతలవారీగా రుణమాఫీ
- లాటరీ ద్వారానే ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక
- గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపిన సీఎం కేసీఆర్


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక వివిధ సమస్యలపై 500 వినతిపత్రాలు సమర్పించామని, అయినప్పటికీ నయా పైసా రాష్ట్రానికి ఇవ్వలేదని శాసనసభలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు విమర్శించారు. మంత్రులతోపాటు తాను కూడా ఎన్నోసార్లు ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులను కలిశామని, అయినా ఎటువంటి ఫలితం లేదని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్నది తమకు అనుకూలమైన సర్కారు కాదని చెప్పారు. ప్రధాని వద్దకు ఎప్పుడు వెళ్లినా ఆయుష్మాన్ భారత్‌లో చేరాలని కోరతారని, మన రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి అంతకంటే మంచి స్కీమ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టారని దాన్నే అమలు చేస్తామని, ఆయుష్మాన్‌భారత్‌లో చేరబోమని చెప్పినట్టు సభకు ...9లో

### మా గోస వినేదెప్పుడు సారూ..



#### ప్రమాణాలు, గవర్నర్‌కు ధన్యవాదాలతో సరి

#### ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణలో రెండవ శాసనసభ ఏర్పడి నెలరోజులైంది. పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు కాలేదు. ఇటు అసెంబ్లీ సమావేశాలు షురూ అయ్యాయనుకునేలోపు ముగిశాయి. శాసనసభలో సభ్యుల ప్రమాణాలు, గవర్నర్ ప్రసంగంతో నాలుగురోజుల పాటు జరిగిన సమావేశాలు ముగిసిపోయాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజాసమస్యలపై దృష్టిపెడుతుందని తెలంగాణ ప్రజలు అనుకున్నారు. అసెంబ్లీలో హామీల ప్రస్తావన వస్తుందని ఎదురుచూశారు. కానీ వాటి జోలికెళ్లలేదు. పంచాయతీ ఎన్నికలు వచ్చాయి కదా అందుకే నాలుగురోజులు సమావేశాలు పెట్టామని అధికారపార్టీ అంటున్నది. వాస్తవానికి కొత్త పాలకవర్గం ఏర్పడి నెలరోజులైంది. అయినా ఇంత ఆలస్యంగా ఎందుకు సమావేశాలు జరిపారు. మా సమస్యలపై టీఆర్ఎస్ సర్కార్ ఎప్పుడు అసెంబ్లీలో చర్చిస్తుంది..అని సగటు జీవి సర్కార్‌ను అడుగుతున్న ప్రశ్న.

## 36 జెట్లకు..
## 50 శాతానికి పైగా చెల్లింపులు

### 34,000 కోట్లు ఫ్రాన్స్‌కు.. త్వరలోనే మరో 13,000 కోట్లు

ఈ 'డీల్ ' వెనుక 30,000 కోట్ల స్కాం ఉందంటూ ఓవైపు ప్రతిపక్షాల నుంచి విమర్శల దాడి, మరోవైపున కోర్టు కేసులు, ఆరోపణలు వచ్చినా ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న రాఫెల్ ఒప్పందంపై మోడీ సర్కార్ మొండిగా ముందుకు పోతున్నట్టు అధికార వర్గాల సమాచారం..



**న్యూఢిల్లీ:** రాఫెల్ యుద్ధ విమానాల కోసం భారత ప్రభుత్వం ఇప్పటికే 50 శాతానికిపైగా ఫ్రాన్స్‌కు చెల్లించినట్టు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. 36 రాఫెల్ జెట్లను రూ.59,000 కోట్లకు ఫ్రాన్స్ కంపెనీ నుంచి కొనుగోలు చేయడానికి ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2016 సెప్టెంబర్‌లో సంతకాలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంలో భాగంగా దశలవారీగా ఫ్రాన్స్ కంపెనీకి రూ.34,000 కోట్లు ముట్టజెప్పినట్టు భారత రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది మరో విడత రూ.13,000 కోట్లు చెల్లించనున్నట్టు తెలిపాయి. ఒప్పందం కుదిరిన కొన్ని రోజులకే మొదటి విడత 15 శాతం చెల్లించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందంలో భాగంగా రాఫెల్ 36 జెట్లు ఈ ఏడాది నవంబర్ నుంచి 2022 ఏప్రిల్ వరకల్లా భారత్‌కు అందనున్నాయి. అయితే, అవి పూర్తిస్థాయిలో ...9లో

## మండుతున్న ఇంధనం

### దేశవ్యాప్తంగా 21-31 పైసలు పెంపు



**న్యూఢిల్లీ :** ఇంధన ధరలు ఎగబాకుతునే ఉన్నాయి. ఇకపై క్రమంగా ప్రతీరోజూ ఇంధన ధరలు పెరిగే సూచన కనిపిస్తోంది. వరుసగా నాలుగోరోజు ఆదివారం దేశవ్యాప్తంగా ఇంధన ధరలు 21-31పైసల మధ్య పెరిగింది. శనివారంతో పోల్చితే హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ 24పైసలు పెరిగి రూ.75.27పైసలకు చేరుకుంది. లీటర్ డీజిల్ ధర 31పైసలు పెరిగి 71.15పైసలకు ...9లో

## మిషన్ భగీరథకు లీకు

### 60 అడుగుల ఎత్తుకు ఎగిసిన జలధార

- నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రధానరహదారిపై..


వివరాలు 9లో

## నేడు తొలి పోరు

- 3,701 పంచాయతీలకు ఎన్నికలు
- ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
- సాయంత్రానికి ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల సమరం ప్రారంభమైంది. సోమవారం తొలి పోరు జరగనున్నది.. మొదటి విడతలో భాగంగా 4,479 పంచాయతీలు, 39,822 వార్డులకు పోలింగ్ జరగాల్సి ఉన్నది. కానీ ఇందులో 769 సర్పంచ్, 10,654 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 9 పంచాయతీలు, 192 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. ఏకగ్రీవ సర్పంచ్, వార్డు స్థానాలు పోగా తొలి విడతలో 3,701 సర్పంచ్, 28,976 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు జరుగనున్నాయి. సజావుగా ఎన్నికలు జరిగేలా రాష్ట్ర ఎన్నికల సంఘం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి శనివారం బ్యాలెట్ పత్రాలు, బాక్సులను చేరవేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద భారీ ...9లో

### కాదని ప్రచారం చేస్తే..
## కాళ్లూ చేతులు విరుగుతయ్

### దళిత సర్పంచ్ అభ్యర్థిపై పెత్తందార్ల దౌర్జన్యం

- ఎన్నికల్లో ప్రచారం చేయొద్దని హుకుం
- వికారాబాద్ జిల్లా తిమ్మాపూర్‌లో దారుణం

నవతెలంగాణ–వికారాబాద్ ప్రతినిధి



'మేమే అధికారంలో ఉన్నాం. మేం చెప్పిందే ఇక్కడ వేదం. పంచాయతీ ఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థినే గెలిపించు కుంటాం. కాదని ప్రచారం చేస్తే కాళ్లూ చేతులు విరు గుతాయి' ఇదీ వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం తిమ్మాపూర్ గ్రామ దళిత సర్పంచ్ అభ్యర్థికి పెత్తందారులు చేసిన అల్టిమేటం. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మర్పల్లి మండలం తిమ్మా పూర్ గ్రామ పంచాయతీ ఎస్సీ రిజర్వ్ స్థానం. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ...9లో

### దళిత రైతు దీక్షపై
## పెట్రోబాంబ్ దాడి

### బీహార్‌లో రెచ్చిపోయిన ల్యాండ్ మాఫియా

- ఇద్దరు మహిళల పరిస్థితి విషమం



**పాట్నా:** బీహార్‌లో అవినీతి అధికారి అండ చూసుకొని ల్యాండ్ మాఫియా రెచ్చిపోయింది. కొన్నేండ్లుగా తాము నివసిస్తున్న భూమిపై తమకు హక్కును కల్పించాలని కోరుతూ నిరాహార దీక్షకు దిగిన దళిత రైతులపై వారు పెట్రో బాంబ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతామర్హి జిల్లాలోని రున్నీసైద్‌పూర్ గ్రామంలో 10.7 ఎకరాల్లో భూమిలేని 316 కుటుంబాలు 2003 నుంచి నివసిస్తున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా బతికే వీరిలో అధికం దళితులే ఉన్నారు. అయితే తాము నివసిస్తున్న భూమిపై తమకు హక్కు కల్పించేలా న్యాయపత్రాలను అందించాలన్నది వారి కోరిక. దీంతో వారంతా స్థానిక సామాజిక కార్యకర్త ...10లో






### ఐక్యతా విగ్రహం సాక్షిగా..
### గుజరాత్‌లో గిరిజనులపై విరిగిన లాఠీ

పోలీసుల దౌర్జన్యం

వివరాలు 2లో



### సరైన ఆహారంతో.. కోటికి పైగా
## మరణాలను ఆపొచ్చు

**బ్రిటన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ టిం లాంగ్**

లండన్: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. కాబట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనకు చాలా అవసరం. అయితే దీనికి సరైన డైట్ పాటించాలి. ఈ విషయాన్నే డాక్టర్లు చెప్తారు. అయితే ఈ విధంగా పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు వంటివి రెట్టింపు చేస్తూ.. మాంసాహారం, చక్కెర వంటివి సగానికి తగ్గించిన సరైన ఆహారాన్ని తీసుకుంటే ఏటా కోటి పదిలక్షలకు పైగా మరణాలను నిరోధించవచ్చుట..! . అలాగే ఈ కారణంతో పరోక్షంగా గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ తగ్గి, అధిక భూభాగం, నీరు, జీవవైవిధ్యం పరిరక్షించబడుతుందట. ఈ ఆసక్తికర విషయాన్ని శాస్త్రవేత్తలు ఇటీవల వెల్లడించారు. మన తినే ఆహారం, దానిని ఎలా పొందుతామనే రెండు అంశాలు ప్రజల ఆరోగ్యం, భూమి భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన లండన్‌లోని బ్రిటన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ టిం లాంగ్ తెలిపారు.

### యువత భుజం భుజం
## కలిపితేనే అభివృద్ధి

### యువత అంటే మహిళ కూడా అని మరువొద్దు : గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్


గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గవర్నర్ నరసింహన్

వివరాలు 9లో

# మోడీ వర్సెస్ ఆల్

## ఈ ప్రచారంలో వాస్తవమెంత?



**న్యూఢిల్లీ :** గతేడాది మే నుంచి ఒకే ఒక్క హెడ్‌లైన్ మీడియాలో ప్రధానంగా చర్చకు వస్తుననది. అదే 'మోడీ వర్సెస్ ఆల్'. ఇక్కడ మోడీకి ఇతర ప్రతిపక్షాలకి మధ్యనే పోటీ అన్నట్టు మీడియా కోడై కూస్తున్నప్పటికీ వాస్తవం అలా లేదని చెప్పడానికి పలు ఉదాహరణలు కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉత్పన్నమవుతున్నది. కేవలం నరేంద్ర మోడీని దింపడానికే మొత్తంగా ఇతర పార్టీలన్నీ కలిసి ఎందుకు ప్రయత్నించాల్సి వస్తోంది? అన్నది ప్రశ్నగా వున్నది. మోడీ వంద రోజుల్లో వంద ర్యాలీలు అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మనం చాలా తరచుగా 'మోడీ వర్సెస్ ఆల్' అనే మాటను ఆయన నుంచే కాదు.. మీడియా నుంచి ఎక్కువసార్లు వినాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో అసలు ఇందులో వున్న వాస్తవమెంతో పరిశీలిద్దాం. శనివారం కోల్‌కతాలో జరిగిన ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీ, ఇంకా ఇటువంటి సంఘటనలు చూసినపుడు బీజేపీకి వ్యతిరేకంగా ఉమ్మడి ఫ్రంట్ ఏర్పడుతున్నదనే ఒక భావన కలుగుతున్నది. అయితే, ఇక్కడ రెండు వాస్తవాలను మనం విస్మరిస్తున్నాం. ఒకటి భారత పార్లమెంటరీ వ్యవస్థలో జాతీయ ఎన్నికల ఫలితం అంటే దేశవ్యాప్తంగా రెండు పార్టీల మధ్య లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ జరగదు, రాష్ట్రాల స్థాయిలో జరిగే పోటీల ఫలితాల సమాహారమే జాతీయస్థాయి ఎన్నికల ఫలితంగా ఆవిర్భవిస్తుంది. జర్నలిస్టు నరేంద్ర నాథ్ మిశ్రా తన ట్వీట్ల ద్వారా లేవనెత్తిన ఈ అంశంపై ది వైర్ దృష్టి సారించింది. ప్రతి రాష్ట్రంలోనూ ప్రాంతీయ రాజకీయ సమీకరణాలను పరిశీలించింది. బీజేపీకి వ్యతిరేకంగా మొత్తం ప్రతిపక్షమంతా ఒక తాటిపైకి వచ్చిందన్న భావనను పరీక్షించింది. వాస్తవానికి బయటకు ప్రచారం జరుగుతున్నది ఒకటైతే వాస్తవం అందుకు విరుద్ధంగా వున్నదని ఈ పరిశీలనలో వెల్లడైంది. బీహార్ రాష్ట్రంలో మొత్తంగా 40లోక్‌సభా స్థానాలు వున్నాయి. ఇక్కడ ఎన్డీఏ మిత్రపక్షాలైన జనతాదళ్(యునైటెడ్), లోక్‌జనశక్తి పార్టీలతో కలిసి పోటీ చేస్తున్నట్టు బీజేపీ ప్రకటించింది. జేడీ(యూ)బీజేపీలు చెరో 17సీట్లకు పోటీ ...9లో

## 'రికార్డు' జల్లికట్టులో అపశృతి

- పుదుకొట్టైలో ఇద్దరు ప్రేక్షకులు మృతి, 13మంది ఆటగాళ్లకు గాయాలు
- తమిళనాడు సీఎం, డిప్యూటీ సీఎం పాల్గొన్న కార్యక్రమంలో ఘటన



ఫైల్

**చెన్నై:** వెయ్యి ఎద్దులు, లక్షమంది వీక్షకులతో గిన్నిస్ రికార్డు నెలకొల్పేందుకు తమిళనాడులో పుదుకొట్టైలోని విరాలిమలైలో మెగా జల్లికట్టును నిర్వహణకు అంతా సిద్ధమైంది. విరాలిమలైలో ఆతదివారం నిర్వహించిన ఈ మెగా జల్లికట్టులో అపశృతి చోటుచేసుకుంది. ఎద్దు దాడిలో ఇద్దరు ప్రేక్షకులు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినప్పటికీ ఈ సీజన్ జల్లికట్టులో మొదటి మరణం ఇక్కడే సంభవించింది. మృతులను తిరుచిరాపల్లి జిల్లాకు చెందిన సతీశ్(35), పుదుకొట్టై జిల్లాకు చెందిన రాము(32)లుగా గుర్తించారు. కాగా, ఈ మెగా జల్లికట్టులో దాదాపు 20మందికిపైగా ఆటగాళ్లు గాయపడ్డారు. ఈ జల్లికట్టును రాష్ట్ర సీఎం పళనిస్వామి ప్రారంభించారు. సీఎం, ఉపముఖ్యమంత్రి పనీర్‌సెల్వం సహా పలువురు మంత్రులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆరోగ్య శాఖ మంత్రి సి విజయభాస్కర్ ఈ ఈవెంట్‌ను పర్యవేక్షిస్తున్నారు.

## ముంబయి శాస్త్రవేత్త అరుదైన పరిశోధన

- ల్యాబ్‌లో 3-4 మిలియన్ల డిగ్రీ సెల్సీయస్ ఉష్ణోగ్రత సృష్టి

**ముంబయి :** నక్షత్రాలపైకి వ్యోమగాముల్ని పంపలేము. నక్షత్రానికి సమీపంగా కనీసం వ్యోమనౌక వెళ్లే పరిస్థితి లేదు. అలాంటప్పుడు నక్షత్రం కేంద్రంలో జరిగే ప్రక్రియలు ఎలా తెలుస్తాయి? అన్న ఆలోచన ముంబయిలోని 'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్'(టీఐఎఫ్ఆర్)కు చెందిన భౌతిక శాస్త్రవేత్త రవీంద్రకుమార్‌కు వచ్చింది. దీంతో అరేబియా సముద్రానికి అభిముఖంగా ముంబయిలోని టీఐఎఫ్ఆర్ కేంద్రంలో ప్రపంచంలోనే అత్యంత అరుదైన సైన్స్ ల్యాబ్‌ను నిర్మించారు.

అత్యంత తీవ్రమైన ఉష్ణోగ్రతల్లో పదార్థ లక్షణాల్ని అధ్యయనం చేయటం కోసం శాస్త్రవేత్త రవీంద్రకుమార్ ఇక్కడ అహర్నిశలు కృషి చేస్తున్నారు. నక్షత్ర కేంద్రకాల్లో ఉండే 30-40 లక్షల డిగ్రీ సెల్సీయస్ ఉష్ణోగ్రతను కృత్రిమంగా సృష్టించారు. ఈ పరిస్థితుల్లో 'పదార్థ లక్షణాల మార్పు'ను అధ్యయనం చేస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా కేన్సర్ చికిత్స, అయస్కాంతత్వం నిల్వ, సెక్యూరిటీ స్కానర్స్, కేంద్రక సంలీనం...వంటి అంశాలపై మరింత సమాచారం దొరుకుతుందని శాస్త్రవేత్త రవీంద్రకుమార్ చెబుతున్నారు.

ఈ పరిశోధన నిమిత్తం టీఐఎఫ్ఆర్ రూ.15కోట్లు వ్యయం చేసి చాలా అరుదైన ల్యాబ్ పరికరాల్ని విదేశాల నుంచి తెప్పించింది. తీక్షణమైన లేజర్ కిరణాలను ప్రసరించపజేయటం ద్వారా అత్యధిక ఉష్ణోగ్రత ఏర్పడేట్టు చేశారు. శుద్ధమైన ఇంధనాల్ని తయారుచేసుకోవటం ఆధునిక మానవుడి ముందున్న సవాల్. ఈ సవాల్‌ను ఎదుర్కోవటంలో ప్రస్తుత పరిశోధన దోహదం చేస్తుందనీ, నక్షత్ర కేంద్రాల్లో జరిగే ప్రక్రియలు మరింతగా అవగతమవుతాయనీ సమాచారం.

# ఐక్యతా విగ్రహం సాక్షిగా..

- గుజరాత్‌లో గిరిజనులపై విరిగిన లాఠీ
- పోలీసుల దౌర్జన్యం

**అహ్మదాబాద్:** మోడీ సొంతరాష్ట్రం గుజరాత్‌లో గిరిజనులపై పోలీసులు రెచ్చిపోయారు. నర్మదా నదీ తీరంలోని పటేల్ ఐక్యతా విగ్రహం వద్ద హర్యానా భవన్‌కు వ్యతిరేకంగా నిరసనకు దిగిన వారిపై పోలీసులు లాఠీ ఝుళిపించారు. కేవదీయలోని ఐక్యతా విగ్రహాన్ని ప్రధాని మోడీ గతేడాది అక్టోబరులో ఆవిష్కరించిన విషయం తెలిసిందే. అయితే ఆప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం కేవదీయ వద్ద భవనాలను నిర్మించుకోవడానికి పలు రాష్ట్రాలు అంగీకరించాయి. ఇందులో భాగంగా కేవదీయా ప్రాంతంలో రాష్ట్ర భవనాన్ని నిర్మించడం కోసం శంకుస్థాపన కార్యక్రమానికి హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ అక్కడకు వచ్చారు. దీంతో పోలీసులకు అక్కడ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కేవదీయ వద్ద పలు రాష్ట్రాల భవన నిర్మాణాలను ఆది నుంచీ అక్కడి గిరిజనులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఐక్యతా విగ్రహం, నర్మదా డ్యాం, రాష్ట్రాల భవనాలు వంటి ప్రాజెక్టుల్లో తమ భూములు కోల్పోయామని వాటిని తిరిగి తమకే ఇవ్వాలనేది గిరిజనులు డిమాండ్. అలాగే కోల్పోయిన భూముల విషయంలో ఇప్పటి వరకు వారికి తగిన పరిహారం కూడా దక్కలేదు. శంకుస్థాపన కార్యక్రమం ముగిసిన తర్వాత హర్యానా సీఎం అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం .. స్థానిక గిరిజనులు ముఖ్యంగా కేవదీయా, గరుదేశ్వర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. దీంతో రెచ్చిపోయిన పోలీసులు.. నిరసనకారులను చెదరగొట్ట డానికి వారిపై లాఠీలను ఝుళిపించారు. పోలీసుల లాఠీచార్జీతో నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారింది. అనంతరం 33మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ హక్కులను కాలరాస్తూ బలవంతంగా తమనుంచి భూములను గుంజుకున్న బీజేపీ ప్రభుత్వ తీరుపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# రక్షణ పరిశ్రమలో సమ్మె సైరన్

మోడీ విధానాలకు వ్యతిరేకంగా..

- డిఫెన్స్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్ణయం
- పాల్గొననున్న నాలుగులక్షల మంది ఉద్యోగులు

**న్యూఢిల్లీ:** రక్షణరంగంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 23నుంచి రక్షణరంగ ఉద్యోగ సమాఖ్యలు మూడు రోజులు సమ్మెకు దిగనున్నాయి. డిఫెన్స్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, పెన్షన్ వంటి డిమాండ్‌లను పరిష్కారించాలంటూ ఆలిండియా డిఫెన్స్ ఫెడరేషన్(ఏఐడీఎఫ్), ఇండియన్ నేషనల్ డిఫెన్స్ వర్కర్స్ ఫెడరేషన్(ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్), భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్(బీపీఎంఎస్)లు సంయుక్తంగా ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈనెల 25వరకు జరిగే సమ్మెలో దాదాపు నాలుగు లక్షల మంది రక్షణరంగ ఉద్యోగులు పాల్గొననున్నారు. రక్షణరంగ పరిశ్రమ ఉత్పత్తులను ప్రయివేటుపరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఏఐడీఎఫ్ తప్పుబట్టింది. రక్షణరంగ పరిరశ్రమ తీవ్ర విపత్తులో ఉన్నదని హెచ్చరించింది. కేంద్రం.. అంబానీలు, అదానీలు వంటి కార్పొరేట్ల చేతికి వ్యూహాత్మక రక్షణ రంగాన్ని కట్టబెడుతూ వారికి మద్దతుపలకడాన్ని సమాఖ్యలు ప్రశ్నించాయి. ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా భావించి తీసుకొచ్చిన మేకిన్ ఇండియా రక్షణరంగంలో చారిత్రాత్మక తప్పిదమని, దీనితో దాదాపు 85వేల మంది ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మాదిందని కేంద్రంపై ఆరోపించాయి. సైనికులకు, ఆర్మీ వర్క్‌షాప్‌లకు, పలువిభాగాలకు తాజా పాలను సరఫరా చేసే మిలిటరీ ఫాంలను మూసివేయడం, ఆర్మీ బేస్ వర్క్ షాప్‌లను జీవోసీఓ మోడల్ పేరుతో ప్రయివేటుపరం చేయడం పట్ల కేంద్రం తీరుపై ఉద్యోగులు తప్పుబట్టారు. అలాగే నేషనల్ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్)ను రద్దు చేసి సీసీఎస్ రూల్స్ 1972 కింద గ్యారెంటెడ్ పెన్షన్‌ను పునరుద్దరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

**కేంద్ర విధానాలతో దేశ రక్షణరంగం బలహీనం: తపన్‌సేన్, రాజ్యసభ ఎంపీ**

కేంద్ర ప్రభుత్వ ప్రమాదకర, తప్పుడు విధానాలతో దేశంలోని 50 రక్షణ కర్మాగారాలు తిరిగి పనికిరాకుండా పోయాయని సీఐటీయూ జనరల్ సెక్రెటరీ, రాజ్యసభ ఎంపీ తపన్ సేన్ అన్నారు. దేశ రక్షణ రంగాన్ని మోడీ ప్రభుత్వం క్రమక్రమంగా బలహీన పరుస్తోందని తెలిపారు. మోడీ ప్రభుత్వంలోని రాఫెల్ స్కాంతో దేశ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమి టెడ్(హెచ్ఏఎల్) భారీ



నష్టాల ను చవిచూసిందని తపన్‌సేన్ ఆరోపించారు. పౌర ఉద్యోగులు చేపట్టే సమ్మె వారి డిమాండ్ల పరిష్కారం కోసమే కాదని, ఇది దేశ ప్రయోజనాల కోసమని అన్నారు.

### సీఐటీయూ సంపూర్ణ మద్దతు

పౌర ఉద్యోగుల మూడురోజుల సమ్మెకు సీఐటీయూ తన సంపూర్ణ మద్దతు పలికింది. దేశవ్యాప్తంగా ఉన్న ఈ మూడు సంఘాల ఉద్యోగులకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఓ ప్రకటనను విడుదల చేసింది. కేంద్రం తీసుకున్న నిర్ణయం కారణంగా ఇప్పటికే దేశీయ ఆయుధ కర్మాగారాల్లో ఉత్పత్తి సగానికి తగ్గిందని, ఇది వాటి మూసివేతకు, అమ్మకానికి దారి తీస్తున్నదని సీఐటీయూ ఆందోళన వ్యక్తం చేసింది. అనేక రక్షణ కొనుగోలు ఒప్పందాలను విదేశీ కంపెనీలతో ఆదరబాదరాగా కుదర్చుకోవడం వంటి కారణాలతో రక్షణ రంగంలో భారీ కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయని, దీనితో దేశ ఖజానాకు నష్టం వాటిల్లుతోందని సీఐటీయూ ఆరోపించింది.

## యూపీ రైతుకు 'పశువుల' సమస్య

- పంట పొలాలపై 'వదిలేసిన పశువుల' దాడులు
- ప్రభావం చూపిన గోవధ, గోపరిరక్షణ



**న్యూఢిల్లీ :** రామ్‌నాథ్ పటేల్ (47) ఉత్తరప్రదేశ్ ఈశాన్య ప్రాంతంలో ఒక సామాన్యరైతు. అతనికి తన పిల్లలెంత ప్రాణపదమో...పశువులన్నా అంతే ప్రాణపదం. తన వద్ద ఉన్న ఆవుల్ని, గేదెల్ని, దూడల్ని చాలా ప్రేమగా పెంచుతున్నాడు. అయితే ఇటీవల వేరే గ్రామానికి చెందిన పశువుల మంద అతని పంట పొలాలపై దాడులు చేసి నాశనం చేశాయి. పంటసాగు కోసం పడిన శ్రమంతా వృధాగా మారింది. దీంతో అతడికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఇది యూపీలో రామ్‌నాథ్ పటేల్ ఒక్కడి అనుభవం కాదు. అనేక వందల గ్రామాల్లో వేలాదిమంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం అక్కడ గోరక్షణ దాడులు, గోవధను నిషేధించటం, వధశాలలపై నిషేధం...వంటి పరిణామాలు.

యూపీలో పాలివ్వలేని, ఒట్టిపోయిన పశువుల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. వీటి పోషణ రైతులకు భారంగా మారింది. అటు..సంతల్లో వాటిని అమ్మే పరిస్థితి లేదు. చాలా గ్రామాల్లో పశువుల సంతలే లేకుండా పోయాయి. దీంతో వీటి సంఖ్య పెరిగి రైతాంగానికి పెద్ద సమస్యగా మారాయి. గ్రామాల్లో కోతకొచ్చిన పంటలపై వదిలేసిన పశువుల దాడులు పెరిగాయి. బుందేల్‌ఖండ్‌లో మాహుల్ అనేగ్రామంలో రైతులు వంతుల వారీగా రాత్రి సమయాల్లో పంటపొలాల వద్ద కాపలా కాస్తున్నారు.

రాష్ట్ర రైతాంగం గతకొన్ని సంవత్సరాలుగా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటోంది. దీంతో వారంతా తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. దీనికి తోడు ఇప్పుడు 'యోగి ఆదిత్యనాథ్' సర్కార్ విధానాలు వారి కష్టాల్ని మరింత పెంచాయి. గోవధ నిషేధం, గోపరిరక్షణ దళాల దాడులు...రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. పాఠశాల భవనాల్లోకి, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, బస్టాపుల్లో తలదాచుకుంటున్న పశువుల ఫొటోలు చూపుతూ మీడియాలో పెద్ద ఎత్తున వార్తాకథనాలు వచ్చాయి. తప్పిపోయిన, వదిలేసిన పశువుల్ని హాస్పిటల్స్‌లో, పాఠశాలల్లో బంధించి రైతులు నిరసన తెలిపిన ఘటనలపై కూడా వార్తలు వస్తున్నాయి. తప్పిపోయిన పశువులు వీధుల్లో పరిగెత్తుతూ పిల్లల్ని గాయపర్చిన ఘటనలు సైతం పెరిగాయి.

అంతర్జాతీయం

## గ్రీస్‌పార్లమెంట్ ముందు అల్లర్లు



**ఏథెన్స్:** గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో ఆందోళనలు ఉధృతమయ్యాయి. గ్రీక్-మెకడోనియా మధ్య పేరు మార్పిడికి సంబంధించి కుదిరిన ఒప్పందాన్ని నిరసిస్తూ ఆందోళనకారులు ఆదివారం భారీ ర్యాలీ తీశారు. గ్రీస్ పార్లమెంట్ ఎదుట పోలీసులకు, నిరసనకారులకు మధ్య అల్లర్లు చెలరేగాయి. పార్లమెంట్ భవనంలోకి చొచ్చుకొని వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రదర్శించారు. దీంతో, రెచ్చిపోయిన ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు, బాటిల్లు రువ్వారు. కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలో 10 మంది పోలీసులు గాయపడ్డారు. పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు గ్రీస్ ప్రభుత్వం ప్రకటించింది.

## చిలీలో భూకంపం

- రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 6.7గా నమోదు
- ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

**శాంటియాగో:** చిలీలో శనివారం రాత్రి భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 6.7గా నమోదైం దని యూఎస్ జియోలజికల్ సర్వే అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా ఇద్దరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ఆస్తి నష్టానికి సంబంధించిన సమాచారం తెలియరాలేదు. చిలీలోని కోక్యూంబోకు 15 కిలోమీటర్ల దూరంలో 53 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు అధికారులు తెలిపారు. దీంతో కొక్యూంబో తీరంలో నివసించే వారు వెంటనే ఇండ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. అటకామ, శాంటియాగో, కోక్వింబో నగరాల్లో భూకంప ప్రభావం కన్పించింది. 2015సెప్టెంబర్18న కోక్వింబో నగరంలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 8.3గా నమోదైంది. భూకంపం కారణంగా 11 మంది మృతిచెందారు.

## ఫ్రాన్స్‌లో అగ్నిప్రమాదం

- ఇద్దరు మృతి, 22 మందికి గాయాలు

**పారిస్ :** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ఓ రిసార్టులోని భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...పారిస్‌లోని కోర్చెవెలల్ రిసార్టులో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రిసార్టులోని మూడు భవనాల్లో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకొని ఇద్దరు మృతిచెందారు. 22 మంది గాయపడ్డారు. మరికొందరు మంటల్లో చిక్కుకొని ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశాయి. మంటల్లో చిక్కుకున్న ఓ వ్యక్తి భవనంపై నుంచి కిందకు దూకుతున్న సీసీటీవీ ఫుటేజ్ సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో రిసార్టులో 60 మంది ఉన్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్టు పోలీస్ అధికారులు తెలిపారు.


# షట్‌డౌన్ తెరదించే దిశగా...

- డ్రీమర్స్ మరో మూడేండ్లపాటు వర్క్‌పర్మిట్లు



**వాషింగ్టన్ :** షట్‌డౌన్‌ను తెరదించే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు ప్రారంభించారు. దాదాపు నెల రోజులుగా అమెరికా ప్రభుత్వం మూతపడి ఉన్న నేపథ్యంలో ఆ పరిస్థితికి తెరదించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో సరిహద్దు వెంట గోడ కట్టి తీరాలన్న తన పంతాన్ని నెగ్గించుకొనేలా ఆయన రాజీ ప్రతిపాదనలను ప్రస్తావించారు. బాల్యదశలో అక్రమంగా సరిహద్దు దాటి అమెరికాలోకి ప్రవేశించిన వారు(డ్రీమర్స్), యుద్ధాల కారణంగా వివిధ దేశాల నుంచి వచ్చిన వారికి తాత్కాలిక ఉపశమనం కల్పిస్తామని ఆయన తాజాగా ప్రకటించారు. ప్రస్తుతం అమెరికాలో 7 లక్షల మంది డ్రీమర్లకు పౌరసత్వం మినహా, పని చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఉంది. వీరితోపాటు వివిధ దేశాల నుంచి వచ్చిన మరో 3 లక్షల మంది ఇతర అక్రమ వలసదారులు సైతం ఈ పాలసీ కిందే ఉపశమనం పొందుతున్నారు. డ్రీమర్స్ అండ్ టెంపరరీ ప్రొటెక్షన్ స్టేటస్ (టీపీఎస్) కింద రక్షణ పొందుతున్న వారికి మరో మూడేండ్ల పాటు వీసాలను పొడిగిస్తామని ట్రంప్ తాజాగా ప్రతిపాదించారు. అమెరికాలోకి చట్టబద్ధంగా వచ్చే వలసదారుల విషయంలో దేశానికి గర్వించదగ్గ చరిత్ర ఉందని, కానీ చాలా కాలంగా వలస విధానంలో లోటు పాట్లు ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఎన్నికల్లో తాను ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకొనేందుకు ఒక మార్గం కాకపోతే మరో దారిలో వెళ్తానని వ్యాఖ్యానించారు. నాలుగు వారాల ప్రభుత్వ ప్రతిష్టంభనకు తెరదించేలా ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. మెక్సికో సరిహద్దు వెంబడి గోడ కట్టేందుకు 5.7 బిలియన్ డాలర్లను ట్రంప్ కోరుతున్న సంగతి తెలిసిందే. దీన్ని డెమోక్రాటిక్ సీనియర్ నేతలు విబేధించడంతో ఆర్థిక బిల్లులు ఆమోదం పొందక ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ట్రంప్ తాజాగా చేసిన ప్రకటనను ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ కొట్టి పారేశారు. ట్రంప్ గతంలో చేసిన ప్రతిపాదనలన్నీ కూడా ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఇవి సరైన విశ్వాసాన్ని కలగజేసేలా లేవని అభిప్రాయపడ్డారు. కాగా,అ మెరికాలో నాలుగు వారాల నుంచి పాలన స్తంభించింది. 8లక్షల మంది ఉద్యోగులు జీతాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు.

## కాంగోలో శాంతియుత ప్రదర్శనలు



**కిన్షసా :** కాంగో అధ్యక్ష ఎన్నికల ఫలితాలను నిరసిస్తూ శాంతియుత ప్రదర్శనలు చేపట్టాలని ప్రతిపక్ష నేత మార్టిన్ ఫయూలు తన పార్టీనేతలకు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. అధ్యక్ష ఎన్నికల ఓట్ల లెక్కింపులో భారీస్థాయిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపిస్తున్నారు. ఓట్ల లెక్కింపు మరోసారి చేపట్టేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు కోర్టు నిరాకరించడంతో సోమవారం శాంతియుత నిరసన ప్రదర్శనలు చేపట్టాలని మార్టిన్ పిలుపునిచ్చారు. కాగా, గతేడాది 30న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఫెలిక్స్ షిసేకెడి గెలుపొందినట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. మరో 10రోజుల్లో ఆయన ప్రమాణం చేయనున్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు చైనా ముస్తాబు



**బీజింగ్ :** వసంతోత్సవ వేడుకలకు చైనా సిద్ధమవుతోంది. చైనా నూతన సంవత్సరం ఫిబ్రవరి 5న ప్రారంభం కానుంది. ఈ కొత్త సంవత్సర వేడుకల కోసం లక్షలాది మంది చైనీయులు తమ కుటుంబాలతో కలిసి స్వస్థలాకు వెళ్తారు. జనవరి21 నుండి మార్చి 1వ తేదీ వరకు సాగే ఈ సంబరాల్లో పాల్గొనే ప్రజల కోసం, ఆ రద్దీని తట్టుకునేందుకు రవాణా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రయాణికుల రద్దీ 0.6శాతం పెరుగుతుందని అంచనా వేశారు. రైల్వే ట్రిప్పుల్లో 8.3శాతం, విమానాల ట్రిప్పుల్లో 12శాతం పెరుగుదల ఉంటుందని భావిస్తున్నారు. విమాన రద్దీని తట్టుకునేందుకు షాంఘై అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా 10 పెద్ద విమానాశ్రయాల్లో దేశీయ విమానాల రాకపోకలను పెంచాలని, విస్తరించాలని పౌర విమానయాన అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా 5,32,000 విమానాల రాకపోకలను సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ 4860 రైలు సర్వీసులను కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో వుంచుకుని కొన్ని రైల్వే స్టేషన్లు టిక్కెట్ లేకుండా ప్రయాణాలను అనుమతిస్తున్నాయి.

## లిబియా తీరంలో పడవ బోల్తా : 170 మంది గల్లంతు



**ట్రిపోలి:** మధ్యధరా సముద్రంలో వలసదారులతో ప్రయాణిస్తున్న రెండు పడవలు మునిగిపోవడంతో దాదాపు 170 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారంతా మృతిచెంది ఉంటారని అధికారులు భావిస్తున్నారు. లిబియా తీరంలో శనివారం ఒక పడవ మునిగిపోయినట్టు ఇటలీ నావికాదళం వెల్లడించింది. ఆ పడవలో దాదాపు 117 మందికిపైగా ఉన్నట్టు వారు అంచనా వేశారు. వీరిలో 10 మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు, ఒక శిశువు కూడా ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ పడవ లిబియాలోని గారాబుల్లి రేవు నుంచి ప్రయాణం మొదలు పెట్టిన 10 గంటల తర్వాత మునిగి పోయిందని అంతర్జాతీయ శరణార్థి సంస్థ ప్రతినిధి ఫ్లావియో డీ గియాకోమో వెల్లడించారు. ఈ పడవలో మొత్తం 120 మంది ఉన్నట్టు పేర్కొన్నారు. మరో పడవ మొరాకో నుంచి బయల్దేరి మధ్యధరా సముద్రానికి పశ్చిమాన అలబోరన్ సముద్రంలో మునిగిపోయింది. ఈ పడవలో 53 మంది ఉన్నారు. ఈ పడవ నుంచి ప్రాణాలతో బయటపడిన ఒక వ్యక్తిని తీరప్రాంతంలో అధికారులు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఇవి కాకుండా లిబియాలోని జువార తీరంలో మరో పడవ మునగడంతో తాము 47 మందిని రక్షించినట్టు ఛారిటీ సీ వాచ్ సంస్థ వెల్లడించింది. ఇటలీ నావికాదళం మధ్యదరా సముద్రంలో సహాయక చర్యలు చేపడుతున్నది. అంతర్జాతీయ శరణార్థి సంస్థ తెలిపిన వివరాల ప్రకారం...మధ్యదరా సముద్రంలో ఈ ఏడాది జరిగిన పడవ ప్రమాదాల్లో 83 మంది మృతిచెందారు. పరిమితికి మించి ప్రయాణీకులు పడవల్లో ప్రయాణం చేయడంతోనే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపింది.

## మాలిలో ఉగ్రదాడి

**బామకో:**మాలిలో ఐరాస శాంతి పరిరక్షక స్థావరంపై భీకర దాడి జరిగింది. ఉత్తర మాలిలోని అగ్వెల్హోక్ స్థావరంపై ఆదివారం ఉదయం జరిగిన దాడిలో 8 మంది చాడియన్ ఐరాస శాంతి పరిరక్షకులు మృతిచెందగా, మరో 19య మంది గాయపడినట్టు అధికారులు తెలిపారు. ఐఎస్ సభ్యులే ఈ దాడికి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...అల్జీరియా సరిహద్దుల్లో కిడాల్‌కు ఉత్తరంగా సుమారు 200 కిలోమీటర్ల దూరంలో అగ్వెల్హోక్ స్థావరం ఉంది. ఈ దాడికి పాల్పడినవారిలో కొందరు మిలిటెంట్లు మృతిచెందినట్టు మాలిలోని ఓ దౌత్యవేత్త తెలిపారు.2012లో ఐఎస్ ఉత్తర మాలిని స్వాధీనం చేసుకుంది. అనంతరం ఇక్కడ ఐక్య రాజ్య సమితి శాంతి పరిరక్షక దళాన్ని మోహరించారు. దాదాపు 13వేల మంది సైనికులు ఈ ప్రాంతంలో మోహరించారు.మిలిటెంట్లను ఫ్రెంచ్ దళాలు 2013లో తరిమేశాయి. 2015లో బమాకో ప్రభుత్వానికి, మిలిటెంట్లకు మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ ఐఎస్ హింసాత్మక ఘటనలు కొనసాగిస్తూనే ఉన్నది.

# పొలాల్ని మింగుతున్న గ్రీన్‌కారిడార్

## జగిత్యాల జిల్లా పొలాస నుంచి పెగడపల్లి వరకు...

**22 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం**

- 932 ఎకరాల భూమి సేకరణకు సన్నద్ధం
- రైతులకు సమాచారం ఇవ్వకుండానే సర్వే


ఫైల్

**నవతెలంగాణ-పెద్దపల్లిప్రతినిధి**

అవన్నీ పచ్చని పంటపొలాలు.. ఏడాదికి రెండు పంటలిచ్చే భూములు. అవసరానికి ఎప్పుడమ్ముకున్నా ఎకరాకు రూ.25లక్షలపైనే వస్తుంది. అంతటి విలువైన భూములను నిజామాబాద్ టు వరంగల్ నాలుగులైన్ల రహదారి 'గ్రీన్‌కారిడార్' మింగబోతోంది. గతంలో భూసేకరణ కొలిక్కిరాకపోవడంతో మూలనపడ్డ ప్రాజెక్టును దారి మళ్లించి పచ్చటి పొలాలమీదుగా వేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో భూసేకరణ జరిపేందుకు అధికారులు రంగంలోకి దిగగా 'భూమిలిచ్చేది లేదు' అంటూ రైతాంగం పోరుకు సిద్ధమవుతోంది.

నిజామాబాద్ టు వరంగల్ నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం ఏండ్లుగా నానుతోంది. ఈ 563 రూటు జాతీయ రహదారిని రూ.3300కోట్లతో విస్తరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. కొండగట్టు వద్ద ఫ్లైఓవర్, గంగాధర, కొత్తపల్లి వద్ద బైపాస్‌రోడ్డు నిర్మిస్తూ నాలుగు వరుసల రహదారిని నిర్మించాలనుకున్నారు. అందుకు 2017 జనవరిలో భూసేకరణకు ప్రభుత్వం ప్రకటనా జారీ చేసింది. రోడ్డుకిరువైపులా 'మిషన్‌భగీరథ' పైపులైన్ నిర్మాణం సాగుతుండగా రోడ్డుకు ఒకవైపే భూమి సేకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఓ కొలిక్కి రాలేదు. దీంతో జాతీయ రహదారి సంస్థ ఈ విస్తరణ పనులను విరమించుకుంది.

**దారిమళ్లిన జాతీయ రహదారి..**

జగిత్యాల మీదుగా కరీంనగర్ వరకు భూసేకరణ కష్టతరం కావడంతో అధికారులు 'గ్రీన్‌కారిడార్' పేరుతో జాతీయరహదారి రూటు మార్చారు. జగిత్యాల జిల్లా కేంద్రం సరిహద్దులో ఉన్న పొలాస నుంచి పెగడపల్లి మండలం మీదుగా రోడ్డుకు ఇరువైపులా 70 మీటర్ల వెడల్పుతో 22 కిలోమీటర్ల రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జగిత్యాల జిల్లాలో 592, కరీంనగర్ జిల్లాలో 340 ఎకరాలు కలిపి 932 ఎకరాల భూమి సేకరించి పనులు వేగవంతం చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లకూ జాతీయ రహదారి సంస్థ నుంచి లేఖలు అందాయి.

**సమాచారం ఇవ్వకుండా హద్దురాళ్లు**

జగిత్యాల కలెక్టర్ ఆదేశాల మేరకు వారం క్రితం పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు సర్వే పనులు మొదలు పెట్టారు. పెగడపల్లి మండలం మద్దులపల్లి, ఆరెవల్లి, బతికేపల్లి, నందగిరి చెందిన పంటభూముల్లో సర్వే చేస్తూ మార్కింగ్ చేశారు. గుర్తులు పెడుతూ హద్దురాళ్లూ పాతుతున్నారు. కనీస సమాచారం ఇవ్వకుండానే సర్వే చేయడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వే ప్రకారం చూస్తే ఒక్కో రైతు నుంచి ఎకరం నుండి 5 ఎకరాల చొప్పున సుమారు 120 మందికి చెందిన 200 ఎకరాల పొలాలు పోతున్నాయి. ఈ క్రమంలో మద్దులపల్లికి చెందిన రైతులు నాలుగు రోజుల క్రితం సర్వే పనులను అడ్డుకున్నారు. సారవంతమైన భూములు ఇవ్వబోమని ఆర్డీఓకూ విన్నవించారు. 'ఎంత చెడి అమ్ముకున్నా.. ఎకరా రూ.25లక్షలకుపైనే వచ్చే భూములను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇచ్చేది లేదు' అంటూ తేల్చి చెబుతున్నారు.

**'గ్రీన్‌కారిడార్' రూటు ఇదే..**

నిజామాబాద్ జిల్లా జగదల్‌పూర్ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ వచ్చే ఈ నాలుగు లైన్ల రహదారి జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మీదుగా పొలాస నుంచి లక్ష్మిపూర్, ధర్మారం శివారు, గొల్లపల్లి మండలం తిర్మలాపూర్, ఇబ్రహీంనగర్, రాఘవపట్నం, వెంగళాపూర్, లింగాపూర్ వరకు సాగుతుంది. అటు నుంచి పెగడపల్లి మండల కేంద్రం నుంచి బతికేపల్లి, ఆరవెల్లి, నామాపూర్, మద్దులపల్లి, లింగాపూర్, నందగిరి మీదుగా నర్సింహులపల్లి శివారు నుండి చొప్పదండి మండల గుమ్లాపూర్, రుక్మాపూర్ వరకు వస్తుంది. అటు నుంచి కరీంనగర్ మండలం జూబ్లీనగర్, ఎలబోత్తారం, ముగ్దుంపూర్ పొలిమేరను తాకుతూ మానేరు నది మీదుగా మానకొండూరు మండలాన్ని కలుపుతుంది.

ఇలా సాగే ఈ రోడ్డు నిర్మాణానికి 'గ్రీన్‌కారిడార్' పేర అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

**లాక్కోవడం అన్యాయం**



గ్రీన్‌కారిడార్ పేరుతో మా విలువైన పంట భూములను తీసుకోవడం అన్యాయం. నా ఐదెకరాల పొలంలో ఏకంగా 4 ఎకరాల్లో హద్దురాళ్లు పాతారు. ఒక్కో ఎకరా ఇక్కడ రూ.25లక్షలపైనే పలుకుతోంది.

- రాజన్నల గట్టయ్య, మద్దులపల్లి, పెగడపల్లి మండలం

**సమాచారం లేకుండానే పనులు**



నాకున్న 5 ఎకరాల్లో పొలం వేశాను. సమాచారం ఇవ్వకుండానే నా పొలంలో హద్దురాళ్లు పాతారు. విషయం తెలుసుకొని అధికారులు నిలిపివేశాం. ఆర్‌డీవోకు విన్నవించాం

- బద్దం తిరుపతి రెడ్డి, మద్దులపల్లి

**గుర్తులు పెట్టిన విషయమే చెప్పలేదు**



ఐదెకరాల్లో వరి నాటేశాం. మా పొలం మీద నుంచే 'గ్రీన్‌కారిడార్' పోతోంది. మాకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండానే పొలంలో గుర్తులు పెట్టారు.

- బుత్కూరి కనక రాజు, రాఘవపట్నం, గొల్లపల్లి మండలం

## మోడీ ఆర్థిక విధానాలతో దేశానికి నష్టం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, కార్యదర్శి మల్లికార్జున్



**నవతెలంగాణ-గజ్వేల్**

ప్రధాని నరేంద్ర మోడీ అవలంభిస్తున్న ఆర్థిక విధానాలతో దేశానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడానికి స్టాండింగ్ ఆర్డర్స్‌తో మార్పులకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టిందన్నారు. దీనిలో 75 శాతం కార్మికులకు చట్టాలు వర్తించాలన్నారు. 2017 నిమ్ పేరుతో స్కీంను తీసుకొచ్చారనీ, ఈ స్కీంతో పర్మినెంట్ కార్మికులను తొలగించి, వారి స్థానంలో నిమ్ కార్మికులను నియమించుకుంటారనీ, వారికి ఎలాంటి చట్టాలూ వర్తించవనీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం లేదన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో లక్షల ఉద్యోగాలు పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. కార్మికులు సమ్మెలో పాల్గొంటే ఈ నెల 8వ తేదీన పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి కార్మిక చట్టాల సవరణకు పూనుకున్నారని చెప్పారు. గత నెలలో ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించిందనీ అలాగే తెలంగాణలోనూ వేతనాలు పెంచాలనీ డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక పరిశ్రమల్లో సీఐటీయూ గెలుపొందుతుందనీ, మహింద్ర, ఎమ్‌ఆర్‌ఎఫ్‌లో కార్మికులు అక్కున చేర్చుకుంటున్నారనీ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రేవంత్‌కుమార్, ఎల్లయ్య, ఆర్‌బీఎల్ యూనియన్ నాయకులు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బండ్ల స్వామి పాల్గొన్నారు.

## గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం లేదు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



**నవతెలంగాణ-మిర్యాలగూడ**

అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఎన్నికల మ్యానిఫెస్టో చదివినట్టు ఉందనీ, ఎలాంటి కొత్తదనమూ లేదనీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు అసెంబ్లీలో గవర్నర్ చదివి వినిపించారని విమర్శించారు. గ్రామాలభివృద్ధి పేరుతో వేలంపాట ద్వారా సర్పంచ్ పదవిని దక్కించుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో రూ.20 నుంచి రూ.50 లక్షలు, చిన్న చిన్న తండాల్లో రూ.5 నుంచి రూ.10 లక్షల వరకూ వేలంపాటలు పాడారని తెలిపారు. డబ్బు ఖర్చు చేసి గెలిచిన వారు మళ్లీ సంపాదించే లక్ష్యంతో పని చేస్తారనీ, అలాంటి వారిని ఈ ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలనీ పిలుపునిచ్చారు. ఏదో ఆశించి పార్టీలు మారిన వారు కమ్యూనిస్టులు కాదనీ, గడ్డుకాలంలోనూ అండగా ఉండి ప్రజా ఉద్యమాలు చేసిన వారే నిజమైన కమ్యూనిస్టులనీ అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, నాయకులు మహ్మద్‌బిన్‌సయీద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

**మండలిలో ప్రకటించిన స్వామిగౌడ్**

- యాదవరెడ్డి, భూపతిరెడ్డి, రాములు నాయక్‌లపై చర్య



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

శాసనమండలి సభ్యులు కె యాదవరెడ్డి, ఆర్ భూపతిరెడ్డి, సబావత్ రాములు నాయక్‌లపై అనర్హత వేటు పడింది. ఈ మేరకు శాసనమండలి చైర్మెన్ కె స్వామిగౌడ్ ఆదివారం మండలిలో ప్రకటించారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల సమయంలో కె యాదవరెడ్డి, ఆర్ భూపతిరెడ్డి, రాములు నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో టీఆర్‌ఎస్‌ఎల్పీ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు ఆ ముగ్గురు ఎమ్మెల్సీలపై పార్టీ ఫిరాయింపు చట్టం కింద చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్‌ను కలిసి గతంలోనే ఫిర్యాదు చేశారు. దీన్ని పరిశీలించిన అనంతరం ఆ ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేసినట్టు చెప్పారు. ఆ ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేసినట్టు శాసనమండలి బులెటిన్ విడుదల చేసిన సంగతి విదితమే.

## చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు రండి

- సీఎంను ఆహ్వానించిన ఎమ్మెల్యే చిరుమర్తి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

నల్లగొండ జిల్లాలోని శ్రీ రామలింగేశ్వర స్వామి (చెర్వుగట్టు) బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 12న ప్రారంభం కానున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ తన ఆహ్వానం మేరకు సీఎం సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. గుట్టపైన స్థలాన్ని విస్తరించాల్సి ఉందని, ప్రస్తుతం గుట్టపైకి వెళ్లడానికి ఘాట్‌రోడ్ ఉన్నదని, కిందకి దిగడానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్నందున మౌలిక సదుపాయాల్లో భాగంగా భవన సముదాయం (సత్రాలు) నిర్మించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. గుట్ట కింద పార్కింగ్ కోసం స్థలం సేకరించాలని సూచించారు. నిత్యం ప్రమాదాలకు గురవుతున్నందున జాతీయ రహదారి చిట్యాల హైవే జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని సీఎంకు వివరించినట్టు చెప్పారు. నకిరేకల్ నుంచి నల్లగొండకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, నార్కెట్‌పల్లి నుంచి అద్దంకి వెళ్లే సర్వీసు రోడ్డును కూడా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం దృష్టికి తీసుకొచ్చినట్టు చెప్పారు.

**మంత్రివర్గ విస్తరణ జాప్యంపై సమాధానం చెప్పాలి : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

ఎన్నికలు పూర్తయి నెల రోజులు కావస్తున్నా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతుందో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలపై అక్కడి ముఖ్యమంత్రులు సంతకాలు కూడా చేశారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పటిలోగా నెరవేరుస్తారో స్పష్టం చేయాలన్నారు. ముందస్తు ఎన్నికలకు ఎందుకు పోవాల్సి వచ్చిందో కూడా ప్రజలకు తెలియజేయాలని కోరారు. గవర్నర్ ప్రసంగం సాదాసీదాగా ఉన్నదన్నారు. టీఆర్‌ఎస్ వాళ్లు రాసి ఇచ్చిన కరపత్రంలా ఉన్నదని విమర్శించారు.

**తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి**

తెలంగాణలో ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు విమర్శించడం మానేసి, సలహాలు, సూచనలు చేయాలని కోరారు. మిషన్ కాకతీయ పథక ద్వారా చేపల పరిశ్రమకు ఊతమిచ్చామన్నారు. పట్టణీకరణ, పారిశ్రామీకరణ పెరిగిందన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి పింఛన్ల పెంపు వర్తింపు

**మండలిలో హోంమంత్రి మహమూద్ అలీ**

- గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం
- శాసనమండలి నిరవధిక వాయిదా



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో అర్హులైన వారికి అందించే ఆసరా పింఛన్లను ఏప్రిల్ 1వ తేదీ నుంచి వర్తింపచేస్తామని హోంమంత్రి మహమూద్ అలీ ప్రకటించారు. శాసనమండలి సమావేశం ఆదివారం జరిగింది. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను బోడకుంటి వెంకటేశ్వర్లు బలపరిచారు. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై 18 మంది సభ్యులు ప్రసగించారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని చైర్మెన్ కె స్వామిగౌడ్ ప్రకటించారు. మహమూద్ అలీ మాట్లాడుతూ ఆసరా పింఛన్లను రూ.వెయ్యి నుంచి రూ.2,016కు, వికలాంగుల పింఛన్లు రూ.1,500 నుంచి రూ.3,016కు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. వృద్ధాప్య పింఛన్ పొందే అర్హత వయోపరిమితిని సడలిస్తామనీ, 57 ఏండ్లు నిండిన వారందరికీ పెంచిన పింఛన్లు అందిస్తామని వివరించారు. 2014లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడినపుడు అంతా అయోమయంగా ఉందన్నారు. కరెంటు కోతలు, వ్యవసాయ సంక్షోభం ఇలా అనేక సమస్యలున్నాయని చెప్పారు. పరిశ్రమలకు పవర్‌హాలిడే ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు. అనతికాలంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సమస్యలను అధిగమించారని అన్నారు. నాలుగున్నరేండ్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రాతిపదికన పాలన సాగిందన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదనీ, చేతల ప్రభుత్వమనీ చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గణేష్ ఉత్సవాలు, బక్రీద్, బోనాల సమయంలో ఉత్కంఠ ఉండేదని చెప్పారు. కొన్ని సార్లు కర్ఫ్యూ విధించాల్సి వచ్చేదన్నారు. కానీ తెలంగాణలో ఆ పరిస్థితే రాలేదని అన్నారు. తెలంగాణ వస్తే నక్సలైట్ల సమస్య ఉంటుందనీ, శాంతిభద్రత సమస్య తీవ్రంగా ఉంటుందనీ నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చాక తప్పని రుజువైందన్నారు. పోలీసులకు అత్యాధునిక వాహనాలు, ఆయుధాలు ఇచ్చామని చెప్పారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం వల్ల నేరాలు తగ్గాయని అన్నారు. హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందనీ, ఏటా రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామనీ వివరించారు. ఎస్టీలకు 10 శాతం, ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచేందుకు కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. యూజీసీ విధించిన నిబంధనల వల్ల విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో చేరే అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాష్ట్రంలో 1.12 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వాటిలో 34 వేల ఉద్యోగాలు ఇప్పటి వరకు భర్తీ చేశామన్నారు. మిగిలిన 78 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉందనీ అన్నారు. మల్టీలెవెల్ మార్కెటింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని అన్నారు. ఇరిగేషన్, విద్య, ఆరోగ్యం, ఇతర రంగాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని చైర్మెన్ స్వామిగౌడ్ ప్రకటించారు. శాసనమండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

## చంద్రబాబే మళ్లీ సీఎం : జగ్గారెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబునాయుడు మరో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే పి.జగ్గారెడ్డి చెప్పారు. చంద్రబాబు సీఎం అయితేనే ఏపీకి మంచిదన్నారు. ఆయన విజన్ కలిగిన నాయకుడని .. అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధి వెనుక చంద్రబాబు ఘనత ఉందని స్పష్టం చేశారు. ఏపీలో టీడీపీ, తెలంగాణలో కాంగ్రెస్ బతికితేనే ప్రజలకు మంచిదన్నారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ కాంగ్రెస్ ఇచ్చిందని తెలిపారు. అప్పుడు హోదా అడగని కేసీఆర్, ఇప్పుడు అడగడం ఏంటని ప్రశ్నించారు. మెదక్ నుంచి రాహుల్ పోటీ చేయాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కేసీఆర్ పోటీ చేసినా రాహుల్ బంపర్ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## న్యాయం కోసమే కోర్టుకెళ్తున్నాం

**కేసీఆర్ ఎన్నికల ప్రసంగాలు మక్కీకి మక్కీ: మండలిలో గవర్నర్ ప్రసంగంపై షబ్బీర్‌అలీ**

- డబుల్ బెడ్రూం ఇండ్లు 6 శాతమే పూర్తి
- ఎంబీసీలు ఎవరో జాబితా ప్రకటించాలి
- బీసీ రిజర్వేషన్లు తగ్గింపు అన్యాయం



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ముందస్తు ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రసంగాలు మక్కీకి మక్కీ గవర్నర్ నరసింహన్ చెప్పారని శాసన మండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్‌అలీ ఎద్దేవా చేశారు. న్యాయం జరగాలంటే కోర్టుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీలు టీఆర్‌ఎస్‌లో విలీనం అయ్యారని ప్రకటిస్తే కోర్టులను ఆశ్రయించకుండా న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. కానీ టీఆర్‌ఎస్ సభ్యులు కోర్టుకు వెళ్లకూడదని అంటున్నారని గుర్తు చేశారు. పాత పథకాలే తప్ప కొత్త విషయాలేవీ ప్రకటించలేదన్నారు. ఆదివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ 1969లో తెలంగాణ ఉద్యమం, మలిదశ ఉద్యమం జరిగిందనీ, ఎంతో మంది త్యాగాలు చేశారనీ, అమరులయ్యారనీ అన్నారు. కానీ గవర్నర్ ప్రసంగంలో కేసీఆర్ పేరు మాత్రమే పేర్కొనడం సమంజసం కాదన్నారు. అమరుల త్యాగాలు, తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ సేవలను రికార్డుల్లో చేర్చాలనీ కోరారు. సంక్షేమ పథకాలకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కానీ వాటిని 30 శాతం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. మైనార్టీలకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించిందనీ, ఇప్పటివరకు రూ.500 కోట్లు ఖర్చు చేసిందనీ అన్నారు. ఇంకా రెండు నెలలే మిగిలి ఉందని ఎప్పుడు ఖర్చు చేస్తారని చెప్పారు. వంద శాతం నిధులు ఖర్చు చేస్తామనీ, లేదంటే క్యారీ ఫార్వర్డ్ చేస్తామనీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వ్యవసాయంలో ఆశించిన ప్రగతి సాధించలేదని చెప్పారు. ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారనీ, రూ.వెయ్యి కోట్లు కేటాయించారనీ అన్నారు. అయినా ఎంబీసీలు ఎవరో జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**జిల్లా కోర్టులు ఏర్పాటు చేయాలి : రామచంద్రరావు**



రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలు 31 జిల్లాలకు పెరిగాయని బీజేపీ సభ్యుడు ఎన్ రామచంద్రరావు అన్నారు. త్వరలోనే నారాయణపేట, ములుగు జిల్లాలు ఏర్పాటవుతాయని చెప్పారు. అన్ని జిల్లాల్లోనూ జిల్లా కోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. గురుకులాలు ప్రారంభిస్తున్నా అందులో ఉపాధ్యాయులను పూర్తిగా నియమించారా?అని ప్రశ్నించారు. గురుకులాలకు భవనాల్లేవని అన్నారు. ఓయూలో 750 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. మిగతా విశ్వవిద్యాలయాలదీ అదే పరిస్థితి ఉందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో తెలంగాణ ఎందుకు చేరడం లేదని అడిగారు.

**రైతు బంధు దేశానికే రోల్‌మోడల్ : పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



రైతుబంధు పథకం దేశానికే రోల్‌మోడల్ అని టీఆర్‌ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ తెలంగాణలో తప్ప దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రైతు బీమా ద్వారా మరణించిన కుటుంబాలకు ఎంతో భరోసా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ నిపుణుడిగా, సాగునీటి పారుదల ఇంజినీర్‌గా, సామాజిక ఇంజినీర్‌గా ఖ్యాతి గడించారని అన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. టీఆర్‌ఎస్ సభ్యులు బోడకుంటి వెంకటేశ్వర్లు ఈ తీర్మానాన్ని బలపరిచారు. ఎంఐఎం సభ్యులు జాఫ్రీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ సభ్యులు నారదాసు లక్ష్మణరావు, మహమ్మద్ సలీం, ఎంఎస్ ప్రభాకర్‌రావు, గంగాధర్‌గౌడ్, ఫారూఖ్ హుస్సేన్, ఆకుల లలిత, ఎలిమినేటి కృష్ణారెడ్డి, పురాణం సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, ఫరీదుద్దీన్, డి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందన్నారు. రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డబుల్‌బెడ్రూం ఇండ్ల పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు కోర్టులకు వెళ్లి ప్రాజెక్టులను అడ్డుకోవద్దని కోరారు.

**తప్పులు ఎత్తిచూపుతాం : పొంగులేటి**



ఈ ప్రభుత్వం చేసే మంచిని స్వాగతిస్తామనీ, తప్పు లుంటే ఎత్తిచూపుతామనీ కాంగ్రెస్ సభ్యులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. రుణమాఫీకి రూ.20 వేల కోట్లు, రైతు బంధుకు రూ.15 వేల కోట్ల చొప్పున మొత్తం రూ.35 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా కావాలని ప్రస్తావించలేదన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి అంశాల గురించి లేదన్నారు. విద్యావైద్యంలో ప్రయివేటు సంస్థల దోపిడీ పెరిగిపోయిందని చెప్పారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో విపరీతంగా ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. దీనిపై నిఘా పెంచాలని కోరారు. ఎకనామిక్ ఇంటలిజెన్స్ యూనిట్‌ను ప్రత్యేకంగా ప్రారంభించాలని సూచించారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## పట్టుబడిన బంగారం బిస్కెట్లు

- 'గల్ఫ్ గోల్డ్' బిస్కెట్ల పట్టివేత

**నవతెలంగాణ శంషాబాద్**

శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఓ ప్రయాణికుడి నుంచి 1996.70 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఆర్ఐ అధికారుల వివరాల ప్రకారం.. ఉదయం నాలుగు గంటలకు ఇండోర్ నుంచి విమానం 6ఈ-648లో ఓ ప్రయాణికుడు శంషాబాద్‌కు చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు ఎయిర్‌పోర్టులో మాటువేసి ఆ వ్యక్తి లగేజీని తనిఖీ చేశారు. అందులో గల్ఫ్ గోల్డ్ అని ముద్రించిన రెండు బంగారం బిస్కెట్లు నాలుగు భాగాలుగా విరగొట్టి ఉన్నాయి. గమనించిన అధికారులు వెంటనే బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. దాని విలువ రూ.66.27 లక్షలు ఉంటుందని తెలిపారు. అధికారులు ఉన్నారని గమనించిన మరో ప్రయాణికుడు తిరిగి అదే విమానంలో వెళ్లిపోయినట్టు తెలిసింది. పట్టుబడ్డ నిందితుని ఆధార్‌కార్డు, ఇతర వివరాలను తనిఖీ చేయగా అవన్నీ నకిలీవని తేలాయి.

## నేటి నుంచి సీఎం సహస్ర మహా చండీయాగం



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం నుంచి సహస్ర మహా చండీయాగం నిర్వహించ నున్నారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఉదయం 11 గంటలకు ఈ యాగం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మెన్‌లను ఆహ్వానించారు. ఈనెల 25 వరకు ఈ యాగం కొనసాగనుంది.

# పరిమళాన్ని వెదజల్లే నల్లచామంతి

చిత్తలూరిగారి కవిత్వం నేను మొట్టమొదట వాట్సాప్‌లో చదవడం మొదలుపెట్టాక ఆ శైలి, తాజాదనం నన్ను బాగా ఆకట్టుకున్నాయి. తన చుట్టూ పరచుకున్న ప్రపంచంలోని దృశ్యాలన్నిటినీ వాక్యాలలో కళ్ళకు కట్టినట్టు చూపించడం ఆయనకు కొట్టిన పిండి. అవలీలగా మనలను ఆ ప్రదేశాలలోని సన్నివేశాలకు తీసుకుపోగల సత్తా ఆయనకు ఉంది. ఈ కవిగారు 'అక్కడకు వెడితే చాలు' వాళ్ళంతా పావురాలై వాలిపోతారు అంటూ తన విద్యార్థుల కోసం పదాలను పేర్చినా, అందమైన గులాబీల పైన వర్షం కురుస్తోందంటూ సౌకుమార్యంగా చెబుతూ ఆసిడ్ దాడులను గట్టిగా ఖండించినా ఈయనకే చెల్లింది. పనులు చేసి అరిగిన తన 'అమ్మ చేతులపై' సున్నితంగా కవిత్వపు పావురమై వాలిన ఈయన వాటిని వర్ణించిన తీరు ప్రశంసనీయం.

సుమారుగా ప్రతీరోజూ ఒక సరికొత్త కవితై జన్మించే చిత్తలూరిగారు నిత్యం కవిత్వాన్ని శ్వాసిస్తారని ఆయనను అనుసరించే వారికెవరికైనా అర్థమవుతుంది. 'బచాపోష్'లంటూ ఆఫ్గన్ ఆడపిల్లలను ఈడేరే వరకూ మగవారిలా పెంచి, ఆనక వారిని ఇంట్లో ఎవరి కళ్ళబడకుండా బంధించినపుడు వారిలోని మానసిక సంఘర్షణను కవిత ద్వారా చెప్పడం చాలా బావుంది. తెలంగాణలో జన్మించిన ఈయన తన పుట్టుక మూలాలను, అక్కడున్న



శ్రమజీవన సౌందర్యాన్ని ప్రతీ అక్షరంలో పొదిగి ఆవిష్కరించారు. చెమట చుక్కలను, వాటి వెనుక దాగిన కన్నీటి సముద్రాలనూ తన ప్రతీమాటలో చెబుతూనే ఉన్నారు. నిజమే 'ఒక మొక్కను పెంచుకున్నా బాగుండేది' ఇంత కష్టపడి చదువు 'కొన్నపుడు' చివరికి అసహాయ దశలో అక్కరకు రాని కన్నబిడ్డలెందుకు అంటూ ఈయన చెప్పినది అక్షరసత్యం. మృదువైన వాక్యాలతోనే తన గొంతెత్తి బిగ్గరగా నిలదీసే ఈయన, మనలను ఎక్కడికెళ్ళినా వెంటాడుతూనే ఉంటారు. 'ఫ్లెక్సీ నవ్వుల వెనుక' గల బతుకు తెరువును కోల్పోయిన దు:ఖం "వారి బతుకుబొమ్మను గీయడానికి పనికిరాక రంగులు ఒలికిపోతున్నాయి, ఒకసారి వెళ్ళి అతడిని చూసి రావాలని" అన్నారు ఈ కవి. అతికొద్దిమంది కవులలో ఉన్న తడి చిత్తలూరిగారి కవిత్వంలో అణువణువులో గోచరిస్తుంది. అవలీలగా ప్రతీ సందర్భాన్నీ చిక్కని కవిత్వంగా మలచి మన చేత తృప్తిగా తాగించడం ఈయనకు చాలా ఇష్టం.

తరగతి గది 'అలా ఉండకూడదు' అంటూ "పక్షుల కలకలంతో జాతికి జవజీవాలిచ్చే ఆరోగ్యమైన పచ్చని చెట్టులాంటి గది కావాలి" అంటూ తరగతిగది ఎలా ఉండాలో కూడా ఆయన సెలవిచ్చారు. "సుద్దముక్కలా అరిగిపోయే అతడు బోధించడాన్నే ప్రేమిస్తాడు" అంటూ అతడి గురించి లోతుగా చెప్పిన చిత్తలూరి గారు తనే పాఠాలు బోధించే మాష్టారు కావడం విశేషం. అందుకే అంత బాగా చెప్పగలిగారేమో అని పాఠకులకు అనిపించక మానదు. తనను కన్న శ్రమజీవనమ్మ కోసం "అమ్మ ప్రేమ ముందు ఆకాశం చిన్నది" అంటూ, నాన్న వెడుతూ వెడుతూ తనను అమ్మకే అప్పగించి వెళ్ళారని తండ్రిలేని బాధను మనకు ఒక కవితలో పంచారు. దేవుడు కూడా మరణిస్తాడని, చదువు దీపమై వెలిగితే మూఢనమ్మకాలు తొలగి వెలుగు వైపు అడుగులేస్తామని అందంగా వివరించారు. మట్టిపూల మరణంలో "మా తాత కూడా అదే చేసాడు, తన కోసం ఒక తాడును తయారు చేసి మెడకు అలంకారం చేసుకున్నాడు" అంటూ దేశానికి అన్నం పెట్టే రైతులు అప్పుల బాధ తాళలేక ఎలా ఉరికొయ్య వైపు అడుగులు వేస్తున్నారో వివరించారు. నాకోసారి జ్వరమొస్తే బాగుండునంటూ తనను వదిలేసి స్వర్గనికేగిన అమ్మానాన్నల అనంతమైన ప్రేమను కవితలో స్మరిస్తుంటే చదువరుల కనులలో తడూరక మానదు.

టెక్నాలజీ ఎలా మనలోకి చొచ్చుకుని వచ్చి మనసుల నడుమ పూలవంతెన వంటి ఉత్తరాన్ని కనుమరుగు చేసిందో చెబుతూ ఆవేదనను వెళ్ళగక్కారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నిటి గురించో ప్రస్తావిస్తూనే ఉండాలి. ప్రతీ కవిత మన జీవితాల చుట్టూ అల్లుకున్న దు:ఖపోతలను, సమస్యలూ చర్చిస్తూ మనలోకి మనం తొంగి చూసుకునే అవకాశం కల్పిస్తూ.. మొదటి నుండి చివర వరకూ ఆసాంతం నిలబెట్టి చదివిస్తుందనడంలో సందేహమే లేదు. మట్టిని, మట్టిమనుషులనే కాక ఈ సమాజాన్ని, తన చుట్టూ ఉన్న వారిని అమితంగా ప్రేమిస్తూనే తప్పు చేస్తే ఘాటుగా నిలదీసే ఈ కవి "అమ్మలా ఎదురొచ్చే ఆమె కోసం" కవిత్వ పరిమళాన్ని వెదజల్లే నల్లచామంతిగా పూసారు. ఈ కవితా సంకలనాన్ని తాకినపుడల్లా ఆ సువాసన హృదయపు లోతుల్లోకి ప్రవహిస్తూ మంచి అనుభూతిని శాశ్వతంగా మనలో మిగులుస్తుందనడంలో సందేహమే లేదు.

**- పద్మావతి రాంభక్త, 9966307777**

# ఇతివృత్త వైవిధ్యం- ఆకర్షించే కథన కౌశలం



**సమస్యలకు మూలాలు మన సమాజ గమనంలో, మనం అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాల్లో, బతుకులో చెలరేగే సంక్షోభాల్లో ఉన్నాయి. అయితే కారణాలతో సరిపుచ్చలేం. తక్షణం కొంత సాంత్వన కావాలి. మానవీయ స్పర్శ అవసరం. మనిషిని మనిషి పట్టించుకోవాలన్న ఎరుక తప్పనిసరి. ఎవరూ ఎవరికీ కాని స్థితి నుంచి బయటపడే ఉపాయం ఆలోచించాలి. ఈవిధమైన ఆలోచనలకు ప్రోది చేసే శక్తి ఎల్.ఆర్.స్వామి కథలకు ఉంది.**

అనువాదకునిగా పేరొందిన ఎల్.ఆర్.స్వామి గారిలో మంచి కథకుడు ఉన్నారు. తమిళం మాతృభాష, మలయాళం చదివిన భాష, పట్టుబట్టి నేర్చుకొన్నది తెలుగు భాష. ఇవిగాక ఆంగ్లం, హిందీ భాషలతో, సాహిత్యంతో సంపర్కం వున్న సృజనశీలి స్వామి గారు. కథకునిగా వారి సాహిత్య ప్రయాణం మొదలయింది. మరీ ముఖ్యంగా విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో తెలుగులో కథ రాసి తన ప్రావీణ్యాన్ని చూపారు. అనుకోకుండా తెలుగులో రచనలు మొదలు పెట్టిన వారు సొంత రచనలతోనూ, అనువాదాలతోనూ తమ సృజనాత్మక ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఇదివరలో అయిదు కథా సంపుటాలు వెలువరించిన వారు ఇప్పుడు మరో కథా సంపుటితో పాఠకుల ముందుకు వచ్చారు.

వైవిధ్యమైన వారి జీవితానుభవాలు, విలక్షణమైన అధ్యయనరీతులు రచయితగా వారి ప్రయాణంలో విశిష్టమైన కోణాల ఆవిష్కరణకు దోహదపడ్డాయి. ఈ సంపుటిలోని పదిహేను కథలు అరుదయిన ఇతివృత్తాలతో పాఠకుల్ని దిగ్భ్రమకు లోను చేస్తాయి. మానవ ప్రవర్తనలోని భిన్నపార్శ్వాల్ని చిత్రించాయి. పరిస్థితుల ప్రాబల్యంలో చిక్కుపడిన మనుషుల జీవితాల్లో వచ్చే మలుపుల్ని రూపు కట్టించాయి. అప్పటివరకు తాము నమ్మిన సూత్రాలకీ, నమ్మకాలకీ భిన్నంగా మరోతీరున బతకడం అనివార్యమైన పరిస్థితులు ఎలా ఏర్పడతాయో ఈ కథల ద్వారా తెలియజెప్పారు.




సాధారణంగా మనుషుల్లో సహేతుక దృష్టి, సంయమనశీలత అరుదు. మనుషులంతా ఒక తీవ్రత నుంచి మరో తీవ్రతకు వెళుతుంటారు. మనుషులు ఏదో ఆశించి తమ జీవితాన్ని, తమ కాలాన్ని వెచ్చిస్తారు. చివరకు అందుకు భిన్నమైన పరిణామాల పర్యవసానం చూసి చిత్రపోతారు. ఈ కోవకు చెందినవే 'పంతులు గారి మేడ', 'సూర్యచంద్రులు', 'మనసు చూడతరమా', 'పున్నామ నరకం' వంటి కథల ఇతివృత్తాలు. సనాతనునిగా జీవించి, తన పిల్లల్ని కూడా అలాగే పెంచిన నాగరాజు, కూతురు ఒక దళితుడితో వెళ్ళిపోవడంతో ఆత్మహత్య చేసుకుంటాడు. కానీ నాగరాజు భార్య మాత్రం కూతుర్ని అక్కున చేర్చుకుంటుంది. ఎవరి నమ్మకాలు వారివి, ఎవరి జీవనవిధానం వారిదనే భావనతో తన జీవిత ప్రయాణం సాగిస్తుంది. ఎవరూ ఇతరుల మీద తమ నమ్మకాలు రుద్దలేరనే సంగతి ఈ కథ చదివితే బోధపడుతుంది.

ఒక సగటు మధ్యతరగతి ఉద్యోగి శర్మ. తన భార్యాబిడ్డలు నిలువనీడ లేకుండా ఇబ్బంది పడకూడదని రూపాయి రూపాయి కూడబెట్టి ఇల్లు కడతాడు. అందుకోసం తనకు ఇష్టమైన కాఫీ, టీలు మానుకుంటాడు. విందు వినోదాలకి దూరంగా ఉంటాడు. ఇల్లు కట్టిన కొంతకాలానికి చనిపోతాడు. అతను చనిపోయిన రెండు నెలలకు పెన్షన్ పత్రాల మీద సంతకాలు పెట్టించడానికి వెళ్ళిన శర్మ స్నేహితునితో ఆ ఇల్లు అమ్మేయాలనుకుంటున్నట్టు చెబుతుంది భార్య. ఆశ్చర్యపోతాడు అతడు. కానీ నిజం ఇలానే ఉంటుంది. మనుషులు తాము ఎవరి కోసమో బతుకుతున్నామనుకుంటారు. కానీ వారే అతనంటే పట్టనట్టుగా ఉంటారు. ఈ నిజాన్ని 'సూర్యచంద్రులు' కథలో అందంగా వ్యక్తం చేశారు స్వామి గారు.

కేరళలో ఆడపిల్లల్ని పెంచలేక చిన్నతనంలోనే పెళ్ళి పేరుతో అమ్మేసుకున్న పేద బ్రాహ్మల దైన్యాన్ని వ్యక్తం చేసిన కథ 'మనసు చూడతరమా'. మలయాళీ, తెలుగు ప్రాంతాల వాతావరణాన్ని రూపు కట్టించారు. ఒకనాటి పాలక్కాడ్ బ్రాహ్మల దైన్యాన్ని రికార్డు చేశారు. ఇలాంటి కథల ద్వారానే సాంస్కృతిక, సామాజిక చరిత్ర రికార్డు అవుతుంది. ఆర్థికపరమైన వేదన మనుషుల్ని భాషకీ, ప్రాంతానికీ, సంస్కృతికీ దూరంగా కొత్త ప్రదేశాలకు విసిరికొడుతుందని ఈ కథ చదివితే అవగతమవుతుంది.

◆◆◆

ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలు ఛిద్రమవుతున్నాయి. తాము, తమ ప్రయోజనాలే ముఖ్యమని భావించే ధోరణి పెచ్చరిల్లింది. అందుకే కన్నతల్లిని కూడా అనాథ అని చెప్పి అనాథాశ్రమంలో చేర్చిన ఒక కొడుకు కథ 'సిరి'లో చూస్తాం. తల్లి జబ్బుతో ఇబ్బంది పడితే పట్టించుకోని కొడుకు, తాము పెంచుకునే కుక్కకు జబ్బు చేస్తే అల్లాడిపోతాడు. అది తప్పిపోతే విపరీతంగా ఆరాటపడతాడు. చివరకు అది తన తల్లిని చేర్చిన అనాథాశ్రమంలో క్షేమంగా ఉందని ఊరడిల్లుతాడు. మనిషి కన్నా కుక్క బతుకే మేలని తలపోసే స్థితికి లోను చేసే కథ ఇది.

మనుషుల పట్ల వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ఎంత నిర్లక్ష్యంగా ఉంటాయో మరో కథలో చెప్పారు. కార్మికులకు భద్రతా సదుపాయాలు కల్పించాలని ప్రశ్నించిన శర్మ అనే నిపుణుడయిన ఉద్యోగిని చాకచక్యంగా తొలగించిన ఒక కంపెనీ కుటిలనీతిని 'కొత్త జబ్బులకు కొత్తమందులు' కథలో చిత్రీకరించారు. రచయితకు తన ఉద్యోగ జీవితపుటనుభవాలు, కంపెనీల వ్యవహారసరళిపై ఉన్న అవగాహన ఇలాంటి కథలు రాయడానికి ఉపకరించాయి.

◆◆◆

ఇది పోటీ ప్రపంచం. పరుగులు పెట్టడమే జీవితమై పోయింది. తాము పరుగులు తీయడమే కాదు, పిల్లల్ని పరుగులు పెట్టిస్తున్నారు. పసిప్రాయం దాటని పిల్లల్ని రేయింబవళ్ళు చదువుల పేరుతో రుబ్బుతున్నారు. ఉజ్వల భవిష్యత్తు పేరిట ఆడిపాడాల్సిన బాల్యాన్ని నియంత్రిస్తున్నారు. క్రమశిక్షణ పేరిట పిల్లల్ని ర్యాంకుల కోసం, మార్కుల కోసం హాస్టళ్ళలో వదిలేసి హింస పెడుతున్నారు. ఇది వారి లేత మనసుల్ని ఎంతటి ఒత్తిడికి లోను చేస్తుందో 'పునర్జన్మ' కథలో చిత్రించారు.

బతుకంతా ఇలా పోటీ పడుతూ పరుగులు పెట్టాల్సి రావడంలోని కనిపించని హింస 'గుర్రాలు' కథలో ప్రతీకాత్మకంగా చెప్పారు. పరుగెత్తే శక్తి వున్నంతవరకే గుర్రాన్ని బాగా చూసుకుంటారు. ముసలిదయి కూలబడే పరిస్థితి వస్తే కాల్చేస్తారు. ఇంట్లో వయసుమళ్ళిన వాళ్ళ పట్ల కూడా ఇదే వ్యవహారధోరణి చూస్తున్నాం. భౌతికంగా చంపేయకపోయినా, వృద్ధుల పట్ల చూపే నిర్లక్ష్యం అంతకన్నా ఘోరంగా వుంది. వయసయి పోయాక వాళ్ళు ఉన్నా పోయినా ఒకటే అన్న ధోరణి పాతుకుపోవడమే ఇవాళ్టి విషాదం.

దేని కోసమో, ఎందుకోసమో తెలియని పరుగులాటలో కాలాన్ని దొర్లించే మనుషులు పలకరించే మనిషి లేక, మనసులోని మాట చెప్పుకోడానికి ఎవరూ లేక ఎంతగా తల్లడిల్లుతారో, హిస్టిరిక్‌గా మారుతారో 'మాట' కథలో దృశ్యమానం చేశారు. పలకరించే దిక్కు లేకపోవడం, మంచీచెడూ పంచుకునే వారు కొరవడటం ఉద్యోగ జీవితంలోనూ సమస్యలకు దారితీస్తుంది. ఆత్మీయత, ఆప్యాయతలతో కూడిన పలకరింపుల ద్వారానే మనుషుల్లో జీవనోత్సాహం పెంచడం సాధ్యమని తెలియజెప్పడం ఈ కథ సారాంశం.

ఇలాంటి సమస్యలకు మూలాలు మన సమాజ గమనంలో, మనం అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాల్లో, బతుకులో చెలరేగే సంక్షోభాల్లో ఉన్నాయి. అయితే కారణాలతో సరిపుచ్చలేం. తక్షణం కొంత సాంత్వన కావాలి. మానవీయ స్పర్శ అవసరం. మనిషిని మనిషి పట్టించుకోవాలన్న ఎరుక తప్పనిసరి. ఎవరూ ఎవరికీ కాని స్థితి నుంచి బయటపడే ఉపాయం ఆలోచించాలి. ఈవిధమైన ఆలోచనలకు ప్రోది చేసే శక్తి ఎల్.ఆర్.స్వామి కథలకు ఉంది. ఆధునిక జీవితం అనేకానేక సంక్లిష్టతలమయం. బతుకులో వైరుధ్యాలు అనేకం. కొన్నిసార్లు దేనికీ లోటు లేదనిపించినా బతుకు మీద నిరాసక్తత ఏర్పడుతుంది. ఎందుకు బతకాలో తెలియక సతమతమవుతారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ తనకు తానుగా జీవితానికి ఒక అర్థాన్ని, పరమార్థాన్ని కల్పించుకోడం మనుషుల బాధ్యత అని 'వాన వెలిసింది' కథ చదివితే తెలుస్తుంది.

ఈవిధంగా ప్రతి కథ మన ఆలోచనల్లో, మానసిక ప్రపంచంలో ఒక కదలికని తీసుకువచ్చే రీతిన చిత్రితమైంది. ఏదో సందేశం ఇవ్వాలన్న ధోరణి లేదు. అసంకల్పితంగానే ఆలోచింపజేసే కథాకథనం సహజంగా చేకూరింది. కొన్ని కథల్లోని మలుపులు దిగ్భ్రమకు లోను చేస్తే, మరికొన్ని కథలు ఆర్ద్రతతో అభివ్యక్తమయ్యాయి. పాత్రల క్రమ పరిణామ వికాసాన్ని సంయమనంతో చిత్రించిన విధానం ఆకర్షణీయంగా వుండి మనసున నిలిచిపోతాయి. ఒకే ఒక్క సంఘటన కథకు ఆధారం. కానీ ఆ సంఘటన ఎన్ని మలుపులకీ, మరెన్ని పార్శ్వాలకీ దారితీస్తుందో తన కథాకౌశలంతో చిత్రించడం రచయితగా ఎల్.ఆర్.స్వామి గారి సాఫల్యానికి నిదర్శనం.

**- గుడిపాటి**

## ఛాయా ఆహ్వానం

ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆఫ్సర్ 'సాహిల్ వస్తాడు' మరికొన్ని కథలు పుస్తక సభ హైదరాబాద్ స్టడీ సర్కిల్ దోమలగూడలో జరుగుతుంది.

## కౌముది ఫైండేషన్ తొలి కానుక

కౌముది ఫౌండేషన్, తెలంగాణ సాహితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఖమ్మంలో 'కౌముది జీవితం – సాహిత్యం' పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, నందిని సిధారెడ్డి, ఖాదర్ మొహియుద్దీన్, అల్లం నారాయణ, జూలూరి గౌరీశంకర్, యాకూబ్, బన్న ఐలయ్య, శిలాలోలిత తదితరులు పాల్గొంటారు.

## పుస్తక ఆవిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అఖిల భారతీయ సాహిత్య పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో డా॥ కూర్మాచలం శంకరస్వామి రచించిన 'అంతర్గీత' ఆధ్యాత్మిక వ్యాస సంపుటి ఆవిష్కరణ ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు రవీంద్రభారతి సమావేశమందిరంలో జరుగుతుంది. డా॥కె.వి. రమణాచారి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాద కృష్ణమూర్తి, డా॥అమ్మంగి వేణుగోపాల్, అశ్వాపురం వేణుమాధవ్, గోవిందం వేణుగోపాలస్వామి, కందుకూరిశ్రీరాములు, ఆచార్య జ్యోతిరాణి, పర్యాద సరళ, పుల్లగూర్ల సాయిరెడ్డి, త్రిదండపాణి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొంటారు.

**- డా॥కూర్మాచలం శంకరస్వామి, 7702435110**

## కథలపోటీ 2019

హ్యూస్టన్ అమెరికాలోని అర్చన ఫైన్ ఆర్ట్స్ సంస్థ, శారద సత్యనారాయణ మెమోరియల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'కథలపోటీ 2019' నిర్వహిస్తున్నారు. నవరసాల్లో ఏదో ఒక అంశం మీద యూనీకోడ్‌లో టైప్ చేసి, వర్డ్ డాక్యుమెంట్‌లో మాత్రమే 4 పేజీలలో కథను రాసి, మెయిల్ ద్వారా మార్చి 31వ తేదీలోపు పంపాలి. చిరునామా: rachanalu2019@gmail.com.

**- జ్యోతి వలబోజు, నిర్వాహకురాలు**

## ఉగాది బాలల కథల పోటీ

సహజ సాంస్కృతిక సంస్థ విజయనగరం వారు బాలల కథల పోటీకి కథలను ఆహ్వానిస్తున్నారు. కథలు పిల్లలకు ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఆలోచనలను రేకెత్తించే విధంగానూ; బంధాలు, కరుణ, దయ కలిగి ఉండేలా కథలు మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి. కథల నిడివి చేతివ్రాతలో మూడు పేజీలు, డిటిపిలో రెండు పేజీలు మించరాదు. కథలను పోస్టు ద్వారా గాని కొరియర్ ద్వారా గాని మాత్రమే పంపాలి. కథలు ఫిబ్రవరి 20 తేదీలోపు అధ్యక్షులు, సహజ సాంస్కృతిక సంస్థ, 24–8–1, సమీరా రెసిడెన్సి, లింగ దారి పేట, రాజ్యలక్ష్మి థియేటర్ దారి, విజయనగరం 535002 చిరునామాకు పంపాలి.

**- ఎన్.కె.బాబు, ప్రెసిడెంట్ (సహజ)**

## జగన్నాథశర్మకు లక్ష్మీనారాయణ జైనీ పురస్కారం

జగన్నాథ శర్మ ఆయలసోమయాజుల గారి 'మొదటి పేజి కథలు' కథాసంపుటి 'లక్ష్మీనారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కారం 2019' కి ఎంపికైనది. ఈ నెల 29వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు రవీంద్రభారతిలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఎన్.గోపి, నందిని సిధారెడ్డి, సుధామ, ఎల్.బి.శ్రీరాం, మామిడి హరికృష్ణ, వేలూరి శ్రీదేవి, బిక్కి కృష్ణ, నెల్లుట్ల రమాదేవి, గుడిపాటి, వాణీ దేవులపల్లి పాల్గొంటారు.

**- డా. ప్రభాకర్ జైనీ; ఛైర్మన్, జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్**

# పల్లెతల్లుల చెమటకాలువ ఉద్దరాశిపూలచెట్టు

నీతిగల్ల బతుకులు బతుకుతూ, రెక్కల్ని నమ్ముకున్న మట్టి మనుషులు రుద్రాక్షపూలు అని సరిగ్గా పలకడానికి రాక పలికేపదం 'ఉద్దరాశిపూలు'. ఆ శ్రమజీవులు ఎలా పలికినా సరే ఆ మాటల్లోనే ఎంతో శ్రమ సౌందర్యముంది, స్వచ్ఛమైన బతుకున్నది, ప్రాంతీయ అస్తిత్వ మూలాలున్నాయి.

ఉద్దరాశిపూలచెట్టు పేరుతో అంతే స్వచ్ఛంగా, అంతే సౌందర్యంతో, అంతే జీవ కవిత్వంతో మనముందు నిలబడ్డ కవి నాగిళ్ళ రమేష్. అడవిపూలను ఏరి మాలకట్టి కవిత్వపు పరిమళాలను వెదజల్లుతున్న నిరాడంబర కవి. ఉద్దరాశిపూలచెట్టు పక్కన మాగిన సీతాఫలాల్లాంటి కమ్మని కవితల్ని రుచి చూపిస్తున్నాడు. ఉద్దరాశిపూలచెట్టు కవితతోనే వారి కవిత్వాన్ని ఆస్వాదిద్దాం.

"ఉద్దరాశిపూలు/ పూసిన కాలం/ దొరకు కైకిలిపోయి

మోకాలుమంటి బురదల..." అంటూ చినుకులు చినుకులు పడుతున్నట్లు కవిత ప్రారంభమౌతుంది. ఉద్దరాశిపూలు పూసిన కాలమంటే వానాకాలం. దొర దగ్గరకు కైకిలి (కూలి)కి పోయి పొద్దుందాక మోపులు మోసి, వరికోత దగ్గర ఇచ్చిన కుడుక (కొబ్బరి ముక్క) ముక్కని పిల్లలకోసం జాగ్రత్తగా దాచి, సద్ది గిన్నెలో కట్టుకొని వచ్చె అమ్మను దృశ్యమయం చేస్తాడు. కథనాత్మకశైలిలో సాగడం ఈ కవితకు మరింత బలం. సహజంగా అమ్మ మాట్లాడే మాటలే కవిత్వమయ్యాయి. ఆర్ద్రత, ఆత్మీయత కలబోసుకున్న ఆ మాటల్ని విందాం.

"పొడుగు ముక్కు/ ఉంగరాల ఎంటికలు/ అచ్చం మా అన్నేనని
సచ్చిపోయిన అన్నను/ నాలో జూసుకొని/ బహుమురిసిపోదువు"

ఇక్కడ తన కొడుకు ముఖంలో అన్నను చూసుకోవడమనే నాస్టాల్జియా కనిపిస్తున్నా, పుట్టినింటిపై ఒక స్త్రీకి గల మమకారం అర్థమౌతుంది. మేనమామ పోలికలతో తనకొడుకు ఉన్నాడనే శాస్త్రీయత తెలుస్తుంది. నీ రెక్కల కష్టంముందు నా నౌకరి దేనికి కొరగాదని అమ్మ పడ్డ కష్టాలను తల్చుకుంటూ చివరకు భావోద్వేగం పతాకస్థాయికి చేరుతుంది. చినుకుల్లా మొదలైన పదాల ప్రవాహం కాస్త నదిలా మారుతుంది.

"ఏదీ/ నీరాటు దేలిన సేతుల్లో/ దాసుకున్న ఉలులను/
ఒక్కసారి తాకాలని వున్నదే/ ముండ్లిరిగి పూసిన/
నీ పాదాలను ముద్దాడాలని/ నా మనసెంతో/ తండ్లాడుతున్నదే."

రాటుదేలిన చేతులు, ముండ్లిరిగి పూసిన పాదాలు అనే పదబంధాలు అమ్మ శ్రమను ఆవిష్కరిస్తాయి. కవిత్వనిర్మాణ పరంగ చూసినా అందంగ ఒదిగిపోయాయి. వీరి కవిత్వంలో ఒక ప్రత్యేకశైలి కనబడుతుంది. ఒక్కొక్క పదాన్ని ఒక వాక్యంలా కూర్చిన పద్ధతి కనిపిస్తుంది. దీనివలన ఊనికను సాధించాడు.

కవి ఎంచుకున్న వస్తువులతో పాటు కవితా శీర్షికలు కూడా ఎంతో వైవిధ్యంగా, ఔచిత్యంగా ఉంటాయి. అందుకు 'మంచిపూల దుప్పటి' కవిత మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కాశ్మీరులో ఉన్న మిత్రుడిని తల్చుకునే కవిత ఇది. స్నేహం కలకాలం పచ్చగా ఉంటుందని చెప్పడానికి ఎంచుకున్న ప్రతీకలు ఎంతో తాజాగా ఉంటాయి.

"ఎండిన చెట్టుపై/ చిలుకలు వాలి ఆకులైనట్లు
నేను కుంగిపోయిన ప్రతీక్షణం/
నువ్వు మెండుగా ధైర్యాన్నిస్తావు"



అంటూ మిత్రుడిని తల్చుకుంటూ కవిత సాగుతున్నా చివరలో ప్రతీ సైనికులకు వర్తించేలా సార్వజనీనత సాధిస్తాడు. తన బాల్యం గురించి చెప్పేటప్పుడు కూడా మట్టితో తనకున్న అనుబంధం మెటాఫర్‌గా మారుతుంది.

"ఆరుద్రపురుగులోలే/ భూమి పొత్తిళ్ళలో
ఆడుకుంటున్నప్పుడు
ఎంత సుతారంగా హత్తుకున్నది పుడమితల్లి"

సుతిమెత్తని 'ఆరుద్రపురుగు'తో పసిపిల్లలను పోల్చడం కవి పరిశీలనాశక్తికి, కవితాదృష్టికి నిదర్శనం.

నాగిళ్ళ కవిత్వంలో ప్రధానంగా పల్లెటూరి జీవనచిత్రణ, అడవితో తనకున్న అనుబంధం, తాత్వికత, చారిత్రక నేపథ్యం గల నాలుగు పార్శ్వాలు కనిపిస్తాయి.

'దసన్నపూల తొవ్వ' కవిత తెలంగాణ ఆత్మను పట్టిచూపిస్తుంది. దసన్న పువ్వలంటే ఒకే రెక్కఉన్న మందారపూలు. అడవులలో ఉండే ఉద్యమకారులకు సంకేతం.

తెలంగాణ ఉద్యమంలో భాగంగా రాసిన 'కడుపుకోతల పత్తా' కవితలో బాధ దు:ఖంగా, దు:ఖంలోంచి ఆవేశం ఆ ఆవేశంలోంచి ఎన్నో ఆలోచింపజేసే ప్రశ్నలను సంధిస్తడు.

ప్రపంచ చరిత్రలోనే చెప్పుకోదగ్గ ఉద్యమాల పురిటిగడ్డలైన నూకలమర్రి, నాగం పేటలను యాజ్జేసుకుంటాడు. నాగిళ్ళ కవిత్వం గురించి మాట్లాడుకునేటప్పుడు తప్పకుండ వారు ఉపయోగించిన పదాల గురించి మాట్లాడుకోవలసిందే. మరుగున పడిపోతున్న ఎన్నో పలుకుబడులు, పదాలు తన కవిత్వంలో మళ్ళీ పురుడుపోసుకుంటాయి. 'చెప్పుంద్రల్లా, సుట్టిర్కమున్నది, సుట్టబట్ట' లాంటి పదాలు విన్నప్పుడు ఈ విషయం మరింత స్పష్టమౌతుంది.

'వడిసెలరాళ్ళు' అనే నానీల సంపుటితో సాహిత్యంలోకి ప్రవేశించిన ఈ కవి వచన కవిత్వంలో తనదైన ముద్రతో బలమైన కవిత్వం వినిపిస్తున్నాడు. చంద్రుడిని 'ఆకాశగంగలో పూసిన పద్మం' అని కాళిదాసు వర్ణిస్తే, 'ఎడారిలో కాలు తెగిన ఒంటె' గా శ్రీశ్రీ పోల్చాడు. మరి నాగిళ్ళరమేష్ ఏమన్నాడో తెలుసా? 'మొగులుమీద పటువ'గా కవిత్వీకరించాడు. ఇక్కడ కవితావస్తువు చంద్రుడే అయినా కవి ఉపయోగించిన ప్రతీకలు తన జీవిత నేపథ్యాన్ని సూచిస్తాయి. కవిత్వమంటే మరేమి కాదు, మన జీవితానికి పర్యాయపదం అను సత్యం మరోసారి ఋజువుచేస్తాడు.

ఇలా చంద్రుడిని ఆనగపుకాయను కోసినప్పుడు వచ్చె గుండ్రటి వక్కతో, జొన్నసేనుతో ఏసిన సొప్పగూడుతో, బువ్వను గిన్నె అంతట నెరిపిన నిండుదనంతో, అంచులూసిపోయిన పటువ (చిన్న కుండ) తో పోల్చుతాడు. చందమామను గుండ్రటి వస్తువులతో పోల్చడం, వెన్నెలలాంటి తెల్లదనమున్న వస్తువులతో పోల్చడం ఈ కవితకు నిండుదనం.

అడవి దు:ఖాన్ని తన కవితలోకి ఒంపినవాడు, గోగుపూల వాకిలిలో లంబాడి తల్లుల కష్టాల్ని చిన్నచిన్న అద్దాలుగా అక్షరాలను కుట్టిన నాగిళ్ళరమేష్ వర్ధమాన కవిత్వంలో ప్రత్యేక పాయగా ప్రవహిస్తుండు. గుండెలో వాగువారిన చప్పుళ్ళు అతని కవితలు. అతని కవిత్వానికి అభిమానిగా వారి నుంచి మరెన్నో బంతిపూవ్వుల్లాంటి, అన్నం మెతుకుల్లాంటి కవితలకోసం ఎదురుచూస్తున్న.

**ఉద్దరాశిపూల చెట్టు, కవి :నాగిళ్ళ రమేష్, వెల :40, ప్రతులకు : నాగిళ్ళ రమేష్ (7330957559), మల్లారం, భీమదేవరపల్లి, వరంగల్ రూరల్**

**- తగుళ్ళ గోపాల్, 9505056316**

## పుస్తక మొగ్గలు



అనుభవాలను అక్షరాక్షరాల్లోకి ఒంపుతూనే
చరిత్ర పాఠాలతో వర్తమానమై పలకరిస్తుంది
పుస్తకం జ్ఞాపకాలను పదిలపరిచే జ్ఞానపందిరి


సామాజిక శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందిస్తూనే
ప్రాపంచిక అనుభవాల కరదీపికవుతుంది
పుస్తకం తరతరాలుగా తరిగిపోని జ్ఞానగంధం

ఆలోచనలకు నిత్యం అంకురార్పణ చేస్తూనే
భావకుసుమాలను వికసింపచేస్తూనే ఉంటుంది
పుస్తకం అక్షర తోరణాలతో వెలిగే ఆణిముత్యం

జాతికి జాగృతపరచే జ్ఞానాన్ని అందిస్తూనే
భవిష్యత్తుకు మార్గం చూపే చుక్కానవుతుంది
పుస్తకం భవిష్యత్ తరాలకు తరగని పెన్నిధి

నిరంతరం తిమిరంతో సమరం చేస్తూనే
వెలుగుదివ్వెలను పంచే దీపశిఖవుతుంది
పుస్తకం అక్షరపరిమళమిచ్చే జ్ఞానసమీరం

**- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, 9032844017**



**షీటీమ్స్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ నిర్వహణలో శహభాష్ అనిపించుకున్నారు. ప్యాషన్‌గా ఎంచుకున్న బైకింగ్‌తో దేశవిదేశాల్లో 17వేల కిలోమీటర్ల మేరకు రైడింగ్ చేసి .. తెలంగాణ రాష్ట్ర షీటీమ్స్‌ను ఏడు దేశాల్లో ప్రమోట్ చేశారు. వృత్తిలోనే కాదు వ్యక్తిగతజీవితంలోనూ ఎంతో ధైర్యంగా తన ఇద్దరు ఆడపిల్లలను పెంచుతున్నారు. ఆమె షీటీమ్స్ కానిస్టేబుల్ శాంతి . కండ్లకు గంతలు కట్టుకుని ఆయుధాలను అస్సెంబుల్, డిస్సెంబుల్ చేసే నైపుణ్యం ఆమె సొంతం. ఇటీవల పోలీస్‌మీట్‌లోనూ రెండు బంగారు పతకాలతో సహా ఏడు పతకాలు గెలుచుకున్న ఆమె పరిచయం..**

# బైక్ రైడింగ్ నా ప్యాషన్

**మా**ది బెంగుళూరు. నాన్న ఎల్.ఎ. సుసైనాథ్ రైల్వేపోలీస్‌గా పనిచేసేవారు. నాకు నాలుగేండ్లు ఉన్నప్పుడు నాన్నకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. దాంతో మా కుటుంబం హైదరాబాద్ వచ్చింది. రైల్వే స్కూలు, కాలేజీలో చదువుకున్నాను. ఇంటర్ కాలేజీ లెవల్‌లో వాలీబాల్ నేషనల్స్ ఆడాను. అక్క, ఇద్దరు అన్నయ్యల తర్వాత నేను. అమ్మ ఎల్.ఎ. మణి చిన్నప్పటి నుంచి మా అందరినీ సమానంగానే పెంచడమే కాదు నా డ్రస్సింగ్ కూడా అబ్బాయి మాదిరిగానే ఉండేది. ఒకసారి మా పెద్దనాన్న బిడ్డకు రైల్వేపోలీస్‌లో సెలక్షన్ కోసం వెళ్లుతుంటే నేనూ కూడా వెళ్లాను. అక్కడ సెక్యూరిటీ ఆమెను వదిలేసి నన్ను లోపలికి నెట్టేశారు. నేను ఆమె కన్నా పొడవు ఎక్కువగా ఉండటంతో నేనే సెలక్షన్స్‌కు వచ్చాను అనుకున్నారు. ఆ రోజు నుంచి నా మనసులో పోలీస్ కావాలన్న ఆలోచన వచ్చింది. నాన్నకు ఇష్టం లేదు. కానీ పెద్దన్నయ్య మాత్రం చాలా ప్రోత్సహించేవారు. నాన్న విఆర్‌ఎస్ తీసుకోవడంతో ఎవరైనా ఒకరు డిపార్ట్‌మెంట్‌లో ఉండాలని పెద్దన్న చెప్పేవాడు. అన్నయ్యల ప్రోత్సహంతో నేను కాలేజీకి అన్నయ్య బైక్‌పై వెళ్లేదాన్ని. అందరూ వింతగా చూసేవారు. నేను, చిన్న అన్నయ్య రైల్వే పోలీస్ జాబ్‌కు ట్రై చేసినా రాలేదు. ఆ తర్వాత డిగ్రీ సెకండియర్‌లో ఉన్నప్పుడు నేను, చిన్న అన్నయ్య కానిస్టేబుల్ పరీక్ష రాసాం. అన్నయ్య రిటర్న్ టెస్ట్‌లో ఒక మార్కులో అవకాశం కోల్పోయాడు. నేను కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయ్యాను. ఫైరింగ్‌లోనూ సెమిఫైనల్స్ వరకు వెళ్లాను. కార్బన్, ఎస్ఎల్ఆర్, పిస్టల్‌ను బ్లైండ్‌గా డిస్సెంబుల్, అస్సెంబుల్ చేస్తాను. క్యాష్‌ప్రైజ్ కూడా అందుకున్నాను.

## ఫస్ట్ పోస్టింగ్...

2005లో బేగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫస్ట్ పోస్టింగ్. అన్నయ్య బాక్సర్‌పై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేదాన్ని. ప్యాంట్, షర్టు వేసుకుని బాక్సర్‌పై రావడంతో మా తోటి ఉద్యోగులు హేళనగా మాట్లాడేవారు. ఒకసారి వారి మాటలు భరించలేక పంజాబీడ్రస్సులు కుట్టించుకుందాం అనుకున్నాను. మల్కాజిగిరి నుంచి బేగంపేటకు వచ్చేదాన్ని. దారిలో ఒక ట్రాఫిక్ సిగ్నల్ ఉండేది. ప్రతిరోజూ అక్కడకు రాగానే సిగ్నల్ పడేది. చాలాసార్లు సిగ్నల్ జంప్ చేసేదాన్ని. దాంతో ఒకరోజు ట్రాఫిక్ కానిస్టేబుల్ నా బండి ఆపాడు. నేను హెల్మెట్ తీయగానే ఆశ్చర్యపోయాడు. ' సిగ్నల్ జంప్ చేసినప్పుడల్లా వీడికెంత పొగరు అని తిట్టుకుంటాను. నువ్వు అమ్మాయివా? పైగా పోలీస్ కానిస్టేబుల్‌వి. ఇలా రూల్స్‌ను బ్రేక్ చేయవచ్చా?' అంటూ మందలిస్తూ... భేష్ అమ్మాయిలు ఇలా ధైర్యంగా ఉండాలి అంటూ అభినందించాడు. ఆ రోజు నుంచి ప్రతిరోజూ అతనికి గుడ్‌మార్నింగ్ చెప్పేదాన్ని. నా డ్రస్సింగ్ స్టైల్ మార్చుకోవాలనుకున్న ఆలోచన వదిలేసాను.

## ఎవడ్రా వీడు..

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా డ్యూటీ అసెంబ్లీలో వేశారు. ఫస్ట్‌టైం. అసెంబ్లీలోకి వెళ్లడానికి వేరువేరు గేట్లు ఉంటాయని కూడా తెలియదు. ఫస్ట్ గేట్ నుంచి వెళ్లేదాన్ని. రెండు రోజులు అలాగే వెళ్లాను. మూడోరోజు నేను గేట్ సమీపంలోకి వెళ్లగానే.. అక్కడ ఉన్న పోలీస్‌లు నన్ను ఆపారు. బండి ఆపగానే నన్ను పట్టుకోవడానికి ముందుకు వచ్చారు. హెల్మెట్ తీయగానే.. ఒక అడుగు వెనక్కి వేశారు. నేను బండి ఆపి కిందికి దిగాను. అక్కడే ఉన్న డిఎస్పీ నన్ను పిలిచి వివరాలు అడిగారు. 'ఫస్ట్ గేట్ నుంచి రావద్దని నీకు తెలియదా? నువ్వు బండిపై దూసుకుపోతుంటే ఎవరా అనుకున్నాం. బండి నడపడం బాగానే ఉంది కానీ, రాంగ్‌రూట్‌లో రావడం బాగాలేదు' అంటూ మందలించారు. ఇక అప్పటి నుంచి బుల్లెట్‌రాణి అంటూ సరదాగా కోలిగ్స్ పిలిచేవారు.

## గేర్ బండి వద్దు..

ఇంట్లో నాకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో పెండ్లి విషయంలోనూ నా నిర్ణయాన్ని



అంగీకరించారు. ప్రేమించి పెండ్లి చేసుకున్నాను. పెండ్లి తర్వాత గేర్ బండి వద్దు.. మోపెడ్ తీసుకో అని మా ఆయన సూచించారు. కొన్నాళ్లు సాఫీగా సాగిన జీవితం ఇద్దరు అమ్మాయిలు పుట్టిన తర్వాత అనుకోని మలుపు తిరిగింది. ఆడపిల్లలను కన్నావంటూ అనునిత్యం వేధింపులు. ఆడపిల్లలను తక్కువగా చేసి మాట్లాడటం భరించలేక పోయాను. ఇక అతనితో కలిసి ఉండలేక పిల్లలను తీసుకుని అమ్మవాళ్లింటికి వచ్చాను. ఈ సమాజంలో ధైర్యంగా, గౌరవంగా బతికేలా నా పిల్లలను పెంచాలన్నదే నా తపన.

## షీటీమ్స్ లోకి..

రాష్ట్రప్రభుత్వం 2014లో ఏర్పాటుచేసిన షీటీమ్స్‌లోకి నన్ను తీసుకున్నారు. 'కమ్యూనిటీ లీడ్ యాక్షన్ ప్రోగ్రామ్ బై పోలీస్' లోనూ చురుగ్గా పాల్గొన్నాను. స్టూడెంట్స్, పోలీస్‌లు కలిసి పనిచేసే ఈ కార్యక్రమంలో నాకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్వేత దండపాణి, ట్రావెలర్, బైకర్ జయభారతి పరిచయం అయ్యారు. ఎప్పటి నుంచో బైక్‌పై లాంగ్‌డ్రైవ్ చేయాలన్న ఆసక్తి వారితో షేర్‌చేసుకున్నారు. రైడ్ ఉన్నప్పుడు చెబుతాను అన్నారు. వారితో పరిచయం నా జీవితాన్ని కొత్తమలుపు తిప్పింది. నేను ఉమెన్‌రైడర్స్ గ్రూప్‌లో చేరాను. చాలా రైడ్స్ వారితో కలిసి చేశాను.

## రెండునెలల పాటు..

కాశ్మీర్ టూ కన్యాకుమారి బైక్ రైడ్‌కు జయభారతి, మరికొంత మంది వెళ్ళుతున్నారు. నన్ను అడిగారు. అయితే ఖర్చులకు దాదాపు అరవైవేలు అవుతాయి అని చెప్పారు. డబ్బులు లేకపోవడంతో రాలేను అని చెప్పాను.. నెక్ట్స్ రైడ్ వరకు డబ్బులు జమ చేసుకుని తప్పక వస్తాను అన్నాను. ఎంతో బాధపడ్డాను. కొన్ని నెలల తర్వాత ఒకరోజు జయభారతి నుంచి ఫోన్' ట్రిప్ ఉంది. రెండునెలల పాటు మాతో వస్తావా?' అనగానే..'ఎంత ఖర్చు అవుతుంది' అని అడిగాను. 'డబ్బులు అవసరం లేద' ని చెప్పగానే.. ఎక్కడికి అని కూడా అడగలేదు. 'వస్తాను. మరి ఆఫీస్?' అన్నాను. నేను మాట్లాడుతాను అంది జెబి. రెండు రోజుల తర్వాత జెబీ ఫోన్ చేసి పాస్‌ఫోర్ట్ ఉందా' అనగానే లేదని చెప్పాను. పాస్ట్‌పోర్ట్ మేళా పెట్టినప్పుడు నేను హైదరాబాద్ వదిలి ఎక్కడకు వెళ్తాను అని అప్లై చేయలేదు. ఇప్పుడు ఇలా అవకాశం వస్తుందని ఆ రోజు తెలియదు. అన్నయ్య తాత్కాల్‌లో పాస్‌పోర్ట్‌కు అప్లై చేసాడు. పిల్లలను చిన్నప్పటి నుంచి మా అక్కే చూసుకునేవారు. అమ్మ, అక్క, అన్నయ్యలు నీవు వెళ్ళు మేం చూసు కుంటాం అనడంతో పిల్లల గురించిన దిగులు లేదు. నలుగురు అమ్మాయిలు కలిసి ఏడు



దేశాలు, 17వేల కిలోమీటర్ల దూరం బైక్‌లపై వెళ్లే ట్రిప్. స్వాతిలక్రామేడమ్ ఎంతో ప్రోత్సహించారు. ఆఫీస్ నుంచి పర్మిషన్ రావడం, పాస్‌పోర్ట్ తీసుకోవడం అన్ని చకాచకా జరిగిపోయాయి. తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేస్తూ సాగే ఈ బైక్‌రైడింగ్‌లో పాల్గొన్న నలుగురు అమ్మాయిలో నేను ఉండటం గర్వంగా అనిపించింది. ఇది లైఫ్ టైమ్ ట్రిప్. మా ట్రిప్ విజయవంతంగా పూర్తికావడంతో స్నేహితులు, బంధువులు ఎంతో అభినందించారు. డ్యూటికి నా ప్యాషన్ తోడు కావడంతో డిపార్ట్‌మెంట్ లో హేళన చేసిన వారే గొప్పగా మాట్లాడారు. బైకింగ్ అంటే ఎంత ఇష్టమో.. ఫ్రెండ్ జయభారతి, తన ఇద్దరు పిల్లలు అంటే కూడా అంతే ఇష్టం. అందుకే పచ్చబొట్టుగా పదిలపరుచుకున్నాను. థాయ్‌లాండ్ టూర్ తర్వాత తొమ్మిది జిల్లాల్లో తొమ్మిది రోజులు పాటు బతుకమ్మ రైడ్ నిర్వహించాం. బేగంపేటలోని ట్రాఫిక్ గ్రౌండ్‌లో టూవీలర్ నేర్పించాం. ఇప్పటివరకు ఐదువందలకు పైగా మహిళలు టూవీలర్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు.

## అమ్మ నుంచే ప్రారంభం..

నా చిన్నప్పుడు మా అమ్మ అందరినీ సమానంగా చూసేవారు. ఆడపిల్ల అని ఏ రోజు నన్ను ఆంక్షల మధ్య పెంచలేదు. అదేవిధంగా నేను నా పిల్లలను పెంచుతాను. నా జీవితంలో ప్రతి మార్పును నా పిల్లలకు అర్థం అయ్యేలా చెప్తాను. వారిని ధైర్యంగా, గౌరవంగా బతికేలా పెంచుతాను. ఆడపిల్లలను తక్కువగా చూసేవారు తమ ఆలోచనలను మార్చుకోనేలా వారి భవిష్యత్ తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాను. ఆడపిల్ల అన్న వివక్షను ఎదిరించాలంటే అది అమ్మ నుంచే ప్రారంభం కావాలి. ఆడ, మగబిడ్డలను సమానంగా చూసినప్పుడే సమాజంలో లింగవివక్ష తగ్గుతుంది.

యశోద



# పురుగులు పరార్

- **గా**జు వస్తువుల మీద సన్నని గీతలు పడితే వాటి మీద టూత్‌పేస్టును వేసి రుద్దినట్లయితే నునుపుదేలుతాయి.
- అగరబత్తి నుంచి రాలినను వెండి, ఇత్తడి వస్తువులను రుద్దితే తళతళ మెరుస్తాయి.
- తెల్లటి షూ మీద ఏవైనా మరకలు పడి ఉతికినా పోకపోతే, దూదిని నెయిల్‌పాలిష్ రిమూవర్‌లో ముంచి మరక మీద రుద్దాలి.
- షూ మీద పడిన మరకలు వదలకపోతే ఆఫ్టర్ షేవ్ లోషన్‌తో తుడిస్తే ఫలితం ఉంటుంది.
- షూ పాలిష్ గట్టిపడి వాడడానికి వీలుకాకుంటే ఐదారు చుక్కల వైట్ స్పిరిట్ వేస్తే మెత్తబడి పాలిష్ వేయడానికి అనువుగా మారుతుంది.
- లెదర్ షూస్ గట్టిపడి కాలికి వేసుకోవడానికి అసౌకర్యంగా ఉంటే రాత్రి పూట షూ లోపలి వైపు పెరుగు రాయాలి.
- మిక్సీలో మసాలాలు గ్రైండ్ చేసిన తర్వాత కడిగినా కూడా మసాలా వాసన వదలదు. అలాంటప్పుడు ఎండిపోయిన బ్రెడ్ ముక్కలను వేసి ఒకసారి తిప్పితే చాలు.
- ఫ్లవర్ వాజ్‌లో నీళ్లు నిలవ ఉన్నా కూడా దుర్వాసన రాకుండా ఉండాలంటే ఆ నీటిలో చార్‌కోల్ ముక్కలు వేయాలి.
- బుక్‌షెల్ఫ్‌లో చిన్న చిన్న పురుగులు చేరుతుంటాయి. వాటినలాగే వదిలేస్తే పుస్తకాలను తినేస్తాయి. అరల్లో అక్కడక్కడా కర్పూరం బిళ్లలు వేస్తే పురుగులు పట్టవు.
- గ్లూస్టిక్ ఎండిపోయినట్లయితే అందులో కొద్దిగా గ్లిజరిన్ వేసి గోరువెచ్చగా చేయాలి. గ్లూ మెత్తబడి వాడుకోవడానికి వీలుగా మారుతుంది. ❄

## ఇట్లా చేద్దాం



**రెండు స్పూన్ల నిమ్మకాయల రసాన్ని గోరువెచ్చని నీళ్లలో కలిపి తాగితే మలబద్ధకం తగ్గుతుంది. స్థూలకాయం తగ్గి, సన్నగా నాజూగ్గా అవుతారు.**




# పాదాల పగుళ్లకు బంతి

**బం**తి పువ్వు చర్మ సమస్యలకు, నొప్పులకు మంచి మందని ఆయుర్వేదం, హోమియోపతి వైద్యాలు సూచిస్తున్నాయి.

- కడుపునొప్పిని బంతి రేకుల కషాయం తగ్గిస్తుది.
- దురదలు, దద్దుర్లు వంటి చర్మవ్యాధులకు పైపూతగా పనిచేస్తుంది.
- కందిరీగలు, తేనెటీగలు కుడితే బంతిరసాన్ని పూస్తే మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.
- పువ్వులు నలిపి కట్టుకడితే పుండ్లు, గాయాలు, కాలిన గాయాలు, పాదాల పగుళ్ల తగ్గుతాయి.
- మొటిమలు తగ్గేందుకు వీటి లేపనం ఉపయోగపడుతుంది.
- బంతి పూలతో తయారుచేసిన మందులను కంటి, చెవి వ్యాధులు, వాపుల కోసం వాడతారు.
- బంతి నుంచి సేకరించిన రంగుల్ని వంటల్లో కుంకుమ పువ్వుకు ప్రత్యామ్నాయంగా వాడతారు.
- బంతి నారు ఉన్న చోట విషకీటకాలు చేరవట.
- యుద్ధ సమయాల్లో అమెరికన్ వైద్యులు క్రిమినాశక మందుగా బంతి ఆకుల్ని, పువ్వుల్ని ముద్ద చేసి గాయాలకు కట్టుకట్టేవాళ్లు.
- వీటి రేకుల్ని ఎండబెట్టి వంటల్లో వాడితే పదార్థాల రుచి పెరుగుతుందట. ❄

# చలిలో చర్మ సంరక్షణ



**గా**ల్లో తేమ తగ్గిపోయి ఆ ప్రభావం శరీర నిర్మాణంపై చూపుతుంది. చర్మంపై సహజ నూనెల స్రావం తగ్గడం, ఉన్న నూనెలు ఆవిరైపోవడం, సబ్బులు, పెర్‌ఫ్యూమ్‌ల వాడకం ... ఇలా రకరకాల కారణాల వల్ల చలికాలం చర్మం దురదపెడుతుంది. ఈ సమస్యల నివారణకు...

- రెండు కప్పుల ఓట్స్‌ను వేడినీటిలో నానబెట్టాలి. ఈ మిశ్రమం వెచ్చగా ఉన్నప్పుడు శరీరానికి పట్టించి, మృదువుగా మసాజ్ చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.
- లవంగ, తులసి, ఆవ, ఆలివ్, నువ్వులు, కొబ్బరి ... మొదలైన నూనెలలో ఏదో ఒకటి తీసుకొని దేహానికంతా పట్టించి, మర్దనా చేసి వెచ్చని నీటితో స్నానం చేయాలి. వెంటనే మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. రోజూ ఇలా చేస్తే సమస్య ఉండదు.
- రాత్రి పడుకునే ముందు మడమలు, చేతులు, మోచేతులకు నూనె లేదా మాయిశ్చరైజర్ రాసి, ఆ భాగం కవర్ అయ్యేలా సాక్స్‌లు లేదా దుస్తులు ధరిస్తే దురద సమస్య రాదు.
- నిమ్మరసం రాస్తే ఇంకా పొడిబారుతుందని అనుకుంటారు. కానీ చర్మం దురద తగ్గడానికి బకెట్ నీటిలో టీ స్పూన్ నిమ్మరసం కలిపి స్నానం చేయాలి.
- రాత్రి పడుకునే ముందు కొబ్బరిపాలు రాసుకుంటే చర్మం పొడిబారడం తగ్గదు కానీ నల్ల మచ్చలు తగ్గుతాయి. చర్మకాంతి పెరుగుతుంది.
- చర్మం పొడిబారి, దురదపెట్టిన చోట దూది ఉండను యాపిల్ సైడర్ వెనిగర్‌లో ముంచి రాస్తే ఉపశమనం లభిస్తుంది. ❄

# జీర్ణసమస్యలు తగ్గాలన్నా..




**శ**రీరంలోని అన్ని భాగాలకు రక్తప్రసరణ జరిగితేనే ఆరోగ్యంగా ఉంటాం. జీర్ణసమస్యలు తగ్గాలన్నా కొన్ని రకాల ఆసనాలు వేయాలి. ఇందులో బాగా ఉపయోగపడే ఆసనం శలభాసనం. ఈ ఆసనం క్రమం తప్పకుండా సాధన చేస్తే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి.

**శలభాసనం :** ముందుగా బొర్లా పడుకోవాలి. ఇప్పుడు రెండు చేతులను పిడికిలి బిగిండి రెండు తొలలల కింద ఉంచాలి. ఇప్పుడు శ్వాసను తీసుకుంటూ కుడికాలును పైకి లేపాలి. అలాగే పది సెకన్ల పాటు ఉంచి యధాస్థితికి తీసుకురావాలి. ఆ తర్వాత శ్వాస తీసుకుంటూ ఎడమకాలును పైకి లేపాలి. పది సెకన్ల పాటు అలాగే ఉంచి యధాస్థితికి తీసుకురావాలి. ఆ తర్వాత రెండుకాళ్ళను మోకాలు వంచకుండా పైకి లేపి పది సెకన్లు పాటు అలాగే ఉండాలి. ఆ తర్వాత యధాస్థితికి రావాలి. ఈ విధంగా ఐదారు సార్లు చేయాలి.

**ఉపయోగాలు**

- జీర్ణసమస్యలు తగ్గుతాయి.
- మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుంది.
- అంతర్గత అవయవాలకు రక్తప్రసరణ పెరుగుతుంది.
- నడుము నొప్పి తగ్గుతుంది.
- కిడ్నీల పనితీరు మెరుగవుతుంది.

**జాగ్రత్తలు..**

గుండె సమస్యలు, హెర్నియా, పొట్టకు సంబంధించిన సర్జరీలు అయినవారు ఈ ఆసనం వేయరాదు.



శ్రీచందన
డిజె ఫిట్‌నెస్ హబ్
9666665458

## వైసీపీకి రాధా గుడ్‌బై

**జగన్‌కు రాజీనామా లేఖ**

- **2-3 రోజుల్లో కార్యాచరణ**



**విజయవాడ :** మాజీ ఎంఎల్‌ఏ, వైసీపీ నేత వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు, సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా విజయ వాడ సెంట్రల్ సీటుపై పార్టీ అధిష్టానం నుంచి హామీ లభించకపోవడంతో రాజీ నామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్‌కు పంపారు. రాధాను బుజ్జగించేందుకు పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ రంగంలోకి దిగినా శాంతించలేదు. 'పేద ప్రజల స్ఫూర్తి, ఆకాంక్షలకు అనుగుణంగానే నా ప్రయాణం. ప్రజల ఆశయాలను కొనసాగించే దిశలో ప్రయాణం సాగించాలన్నదే నా ఆకాంక్ష. సీఎం కావాలన్న మీ కాంక్ష నెరవేరాలంటే వైసీపీలో అందరికీ ఆంక్షలు విధించడం తప్పనిసరి. నా ఆకాంక్ష నెరవేరాలంటే ఆంక్షలు లేని ప్రజా ప్రయాణం తప్పనిసరి' అంటూ రాధాకష్ణ జగన్‌కు రాసిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సెంట్రల్ సీటు కోసం తాను గత నాలుగు మాసాలుగా వేచి చూసే ధోరణి అవలంభించినా అధిష్టానం నుండి సానుకూల స్పందన రానందున పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు రాధాకృష్ణ చెప్పారు. ఏ పార్టీలో చేరాలన్నది రెండు, మూడు రోజుల్లో స్పష్టమైన ప్రకటన చేస్తానని రాధా ప్రకటించారు. ఇదిలా ఉండగా రాధా రాజీనామాపై వైసీపీ నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఇస్తామని, గతంలో పోటీ చేసిన తూర్పు నియోజకవర్గం నుండి లేదా మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాల్సిందిగా సూచించినా రాధాకృష్ణ వినలేదని చెప్పారు. రాధా రాజీనామాతో బెజవాడ రాజకీయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. అయితే తాను ఏ పార్టీలో చేరుతున్నాననే దానిపై మాత్రం ఆయన సస్పెన్స్ అలాగే కొనసాగించారు. ఆయన టీడీపీలోకిగానీ, జనసేనలోకి గానీ వెళ్తారనే ప్రచారం సాగుతున్నా ఈ రెండు పార్టీల నుంచి ఇప్పటి వరకూ ఆయనకు సానుకూల సంకేతాలు రాలేదు. కొద్దిరోజుల క్రితం వరకూ రాధాను విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించి మల్లాది విష్ణుకు అప్పగించారు. దీనిపై పార్టీ రాష్ట్రస్థాయి సమావేశంలోనే రాధా తన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం రాధాకు అన్యాయం చేసేది లేదని, సెంట్రల్ నియోజకవర్గంలో నిర్వహించిన సర్వేలో ఆయనకు ప్రతికూల ఫలితాలు వచ్చాయని, అందుకే మల్లాది విష్ణుకు ఆ సీటును కేటాయిస్తున్నామని చెప్పింది. అయినా ఆయన గత కొన్ని నెలలుగా మరోసారి సెంట్రల్ సీటు కోసం ప్రయత్నాలు సాగించారు. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడడం, పార్టీ అధినేత జగన్ నుంచి హామీ లభించకపోవడంతో ఆయన వైసీపీకి రాజీనామా చేశారు.

**రాధా వస్తే స్వాగతిస్తాం : ఎంఎల్‌సి బుద్దా వెంకన్న**

రాధాకృష్ణ టీడీపీలోకొస్తే స్వాగతిస్తామని ఎమ్మెల్సీ, టీడీపీ విజయవాడ అర్బన్ అధ్యక్షుడు బుద్దా వెంకన్న తెలిపారు. విజయవాడలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

## హోంగార్డు వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్యాయత్నం



**నందిగామ:** హోంగార్డు వేధింపులు తాకలేక యువకుడు ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన కృష్ణాజిల్లా నందిగామలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం.. స్థానిక నెహ్రూ నగర్‌కు చెందిన ఎస్‌కె షరీఫ్‌పై పోలీస్ స్టేషన్‌లో గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ కోర్టును ఆశ్రయించగా అతనిపై ఉన్న కేసులను కోర్టు కొట్టివేసింది. మరోమారు షరీఫ్‌పై పేకాట కేసు నమోదైంది. ప్రస్తుత సీఐ పివి రమణ అతనికి కౌన్సెలింగ్ నిర్వహించారు. బంధువుల పూచీకత్తుతో విడుదలయ్యాడు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండే హోంగార్డు షరీఫ్‌ను ఎక్కడ కనపడితే అక్కడ అవహేళనగా మాట్లాడటం ప్రారంభించాడు. రెండురోజుల క్రితం మయూరి సెంటర్‌లో తన స్నేహితులు, బంధువులతో షరీఫ్ ఉండగా అటుగా వచ్చిన హోంగార్డు తీవ్రపదజాలంతో దూషించాడు. దీంతో షరీఫ్ మనస్తాపం చెందాడు. ఆదివారం కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయవాడ తరలించారు.

## ప్రపంచ వయో వృద్ధుడు కన్నుమూత



**టోక్యో :** ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడు మసాజో నోనక(113) ఆదివారం కన్నుమూశారని జపనీస్ మీడియా వెల్లడించింది. మొట్టమొదటి మానవ సహిత విమానాన్ని రైట్ బ్రదర్స్ ప్రారంభించిన రెండు సంవత్సరాల అనంతరం, ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రచురించడానికి కొన్ని నెలల ముందే మసాజో జన్మించారు. మసాజో 1905 జులై 5న జన్మించగా, గత ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచంలోనే అత్యంత వయో వృద్ధుడిగా గిన్నిస్ రికార్డును అందుకున్నారు.

## అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షనేత భట్టి

**స్పీకర్ ప్రకటన**

- సండ్ర ప్రమాణ స్వీకారం
- సభ నిరవధిక వాయిదా

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత (సీఎల్‌పీ లీడర్)గా ఎన్నికైన మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తారని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా గుర్తిస్తున్నామని ఆయన తెలిపారు. ఎంఐఎం శాసనసభాపక్ష నేతగా అక్బరుద్దీన్ ఓవైసీ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా భట్టికి ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందనలు తెలిపారు. మరోవైపు టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. మూడు రోజులపాటు ఆయన సభకు గైర్హాజరైన సంగతి విదితమే. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సీఎం సమాధానం అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

## నాలుగు రోజులు.. 9 గంటల 28 నిమిషాలు

- **అసెంబ్లీ జరిగిన తీరిది...**

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ రెండో శాసనసభ తొలి సమావేశాలు నాలుగు రోజులపాటు కొనసాగాయి. ఈనెల 17న ప్రారంభమైన అసెంబ్లీ ఆదివారం వరకు కొనసాగింది. తొలిరోజైన గురువారం కొత్తగా ఎన్నికైన సభ్యుల చేత ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు. తర్వాత రోజు స్పీకర్ ఎన్నిక జరిగింది. మరుసటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించారు. చివరి రోజైన ఆదివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పలువురు సభ్యులు మాట్లాడిన తర్వాత సీఎం కేసీఆర్ సమాధాన మిచ్చారు. అనంతరం సభను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నిరవధి కంగా వాయిదా వేశారు. మొత్తం ఐదుగురు సభ్యులు ప్రసంగించగా.. 9గంటల 28 నిమిషాలపాటు సభలో కార్యకలాపాలు కొనసాగాయి. మరోవైపు శాసనమండలి ఒక్క రోజు సమావేశమైంది. నాలుగు గంటల 54 నిమిషాలపాటు కార్యకలాపాలు కొనసాగాయి. మొత్తం 18 మంది సభ్యులు ప్రసంగించినట్టు శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహా చార్యులు ఆదివారం విడుదల చేసిన బులిటెన్‌లో పేర్కొన్నారు.

# తిరుగు ప్రయాణమూ కష్టమే..

## ముగిసిన పండుగ సెలవులు

### కిటకిటలాడిన బస్టాండ్, రైల్వేస్టేషన్లు

- **రద్దీగా బుకింగ్ సెంటర్లు**

**అమరావతి:** సంక్రాంతి సెలవులు ముగించుకుని తమ తమ గమ్యస్థానాలకు బయల్దేరిన ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. ప్రయాణికుల రద్దీతో విజయవాడ పీఎన్ బస్‌స్టేషన్ రద్దీగా మారింది. ఎటు చూసినా ప్రయాణికులే అన్నట్టుగా తయారైంది. సంక్రాంతి పండుగను జరుపుకొని తిరిగి వారి వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు బయలుదేరిన ప్రయాణికులతో పీఎన్ బస్‌స్టేషన్ కిక్కిరిసింది. ఆదివారంతో సెలవులు ముగియడంతో రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రయాణికులతో ప్లాట్‌ఫారాలు, బుకింగ్ సెంటర్లలో రద్దీ ఏర్పడింది. ఆదివారం సాయంత్రం నాటికి ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులను 64 సర్వీసుల ద్వారా తరలించగా, రాత్రి పొద్దు పోయేంత వరకు మొత్తం వంద సర్వీసులను ఆయా ప్రాంతాలకు నడిపినట్టు ఆర్‌టీసీ అధికారులు తెలిపారు.



విశాఖలోని ఆర్టీసీ, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. ద్వారకా బస్సు స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక డిపోల్లో జనం తాకిడి నెలకొంది. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు తదితర ప్రాంతాలకు ప్రయాణమైన వారితో రైళ్లన్నీ నిండిపోయాయి. రత్నాచల్, గోదావరి, సింహాద్రి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లలో ఉత్తరాంధ్ర వాసులు ఇరుక్కుని ప్రయాణాలు సాగించారు.



**కీసర టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జామ్**

ఆదివారంతో సంక్రాంతి సెలవులు ముగియడంతో తెలంగాణా రాష్ట్రంలో ఉంటున్న కోస్తా ప్రాంత వాసులు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం నుంచి విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తెరుచుకోనుండటంతో ఆదివారం నుండే కోస్తా ప్రాంతం నుండి జనం తిరుగుప్రయాణం అయ్యారు. దీంతో హైదరాబాద్ మార్గంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. ఆదివారం మధ్యాహ్నం నుండి కార్లతో రద్దీ ఏర్పడింది. దీంతో మండలంలోని కీసర టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు అరకిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి.

## చిత్తూరుకు హంద్రీనీవా జలాలు

- **నెరవేరిన 33 ఏండ్ల కల**



**చిత్తూరు:** ఒకటి కాదు.. పది కాదు.. దాదాపు 30ఏండ్లకు పైగా నిరీక్షిస్తున్న చిత్తూరు జిల్లా కరువు రైతు కల సాకారమయ్యింది. ఈ జిల్లా వాకిట్లోకి హంద్రీనీవా జలాలు ఆదివారం చేరుకున్నాయి. ఈ నీళ్ల రావడంతో పడమటి మండలాల్లోని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి మరి కొన్ని రోజుల్లో ముఖ్యమంత్రి నియోజవర్గం కుప్పానికి కృష్ణాజలాలు చేరుకోనున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ కృష్ణాజలాలు అనంతపురం జిల్లా జిడిపల్లి వద్ద గల జలాశయం నుంచి 22 కిలోమీటర్లు ప్రయాణించి ఇదే జిల్లాలోని కదిరి వద్ద గల చెర్లోపల్లి రిజర్వాయర్ చేరుతూ వచ్చాయి. ఇది 1.425 టీఎంసీల సామర్థ్యం కలదు. ఇందులో 30 శాతం నీళ్లు నిండిన తరువాత మూడు రోజుల క్రితం 150 క్యూసెక్కుల నీటిని కిందికి వదలారు. అవి చిత్తూరు జిల్లాలకు ముఖ ద్వారంగా పీటీఎం వద్ద గల బొంతపల్లికి చేరుకుంది. ఇక్కడున్న చెరువు నింపిన తరువాత కిందికి వదులుతామని అధికారులు చెబుతున్నారు. ఈ దఫాలో 1.2 టీఎంసీల నీటిని తరలిస్తున్నట్టు వారు అంటున్నారు. తొలుత వేసవి అవసరాలు తగ్గట్టుగా నీళ్ల వదలనున్నారు. ఈ జిల్లా పరిధిలో 69.84 కిలోమీటర్ల పొడవున ప్రధాన కావుల సాగనుంది. ఈ జలాల వల్ల తంబళ్లపల్లి, మదనపల్లి, పలమనేరు, కుప్పం నియోజక వర్గాల్లోని ప్రజలకు మేలు చేకూరనుంది. ఈ ప్రాంతాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగుకు, 10 లక్షల మందికి తాగునీరు లభించే అవకాశం ఉంది. అనేక అవరోధాలు అధిగమించి ఆదివారం నాడు కృష్ణాజలాలు చిత్తూరు జిల్లాకు చేరుకున్నాయి. దీంతో 33 ఏండ్ల నిరీక్షణకు తెరపడినట్టు అయ్యింది.

## శాసనసభ సభ్యత్వానికి, బీజేపీకి 'ఆకుల' రాజీనామా

**రాజమహేంద్రవరం:** రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఆదివారం తన శాసనసభ్యత్వానికీ, బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశారు. ఈ నెల 21న జనసేన పార్టీలో చేరుతున్నానని ప్రకటించిన నేపథ్యంలో ఆయన తన రాజీనామా లేఖను శాసనసభ స్పీకర్‌కు ఆదివారం పంపారు. తక్షణం తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా ఆయన లేఖలో స్పీకర్‌ను కోరారు. బీజేపీని వదిలి జనసేన పార్టీలో చేరుతున్న నేపథ్యంలో బీజేపీకీ, ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణకు పంపారు. ఆయనతోపాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాల్ బహదూర్ శాస్త్రి, అయ్యల గోపి, నాళం పద్మశ్రీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొవ్విడి సురేష్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శులు కొప్పిశెట్టి లోవరాజు, ఎం.కల్యాణ్, ఎస్‌సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి తోట రామసత్యశ్రీ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.వాసుదేవరావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ సోషల్ మీడియా కన్వీనర్ ఎం.శ్రీనివాస నాయుడు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.గౌసియాబేగం, ఎస్‌వి.రాణి తదితరులు రాజీనామా చేశారు.

## 5జీ కోసం చైనా తొలి ఇన్నోవేషన్ పార్కు



**బీజింగ్:** అయిదో తరం నెట్‌వర్కు (5జీ) కోసం తూర్పు చైనా జెజియాంగ్ ప్రొవిన్స్‌లో అధునాతన ఇన్నోవేషన్ పార్కును ఆదివారం ప్రారంభించారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 5జీ నెట్‌వర్కు ఆవిష్కరణకు పరిశోధనలు నిర్వహించేందుకు అన్ని వసతులతో చైనా ఏర్పాటు చేసిన తొలి ఇన్నోవేషన్ పార్కు ఇదే. 5జీ నెట్‌వర్కు సేవలను ఎప్పుడైనా రావచ్చని చైనా ఇండస్ట్రీ ఇన్‌సైడర్స్ కొందరు చెబుతున్నారు. 5జీ నెట్‌వర్కు స్పీడ్ ఇప్పుడున్న దానికన్నా అనేక రెట్లు అధికంగా వుంటుందని, మొబైల్ టెక్నాలజీలో అది పెను సంచలనం సృష్టిస్తుందని వార్తలొస్తున్నాయి. అయితే 5జీ నెట్‌వర్కు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి ఇంకొంత కాలం నిరీక్షించక తప్పదని మొబైల్ రంగంలో చైనా దిగ్గజం హ్యూవెయి టెక్నాలజీస్ తెలిపింది. ఈ దిశగా సాగించే కృషిలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని ఆ కంపెనీ సీఈవో సియాంగ్ లిగాంగ్ చెప్పారు.

## బీజేపీ మహిళా ఎమ్మెల్యేకు నోటీసులు



**న్యూఢిల్లీ :** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) అధినేత్రి మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే సాధన సింగ్‌ను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యు) ప్రశ్నించనుంది. ఈ వ్యాఖ్యలపై ఆమె వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు పంపనుంది. మీడియా కథనాల ప్రకారం గతంలో బీఎస్‌పీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ)లు బద్ధశత్రువులుగా ఉండేవి. 1995లో లక్నోలోని ఓ గెస్ట్ హౌస్‌లో మాయావతిపై ఎస్‌పీ కార్యకర్తలు పలుమార్లు దాడికి పాల్పడగా..ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సాధన సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'ఆమెకు(మాయావతి) స్వీయ గౌరవం లేదు, ఆమె గతంలో లైంగిక వేధింపులకు గురయ్యారు. ద్రౌపదికి కూడా ఇటువంటి అవమానమే జరిగితే ఆమె తన పగను తీర్చుకుంది. కానీ ఈ మహిళ అధికారం కోసం తన గౌరవాన్ని అమ్ముకున్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నాం మాయావతి జీ. స్త్రీ జాతికే ఆమె ఒక మచ్చ. ఆమె నపుంసకుడి కంటే ఘోరం' అని శనివారం ఓ ర్యాలీలో సాధన వివాదాస్పదంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఖండిస్తున్నామని, దీనిపై సాధనకు వివరణ ఇవ్వాలని కోరుతూ సోమవారం నోటీసులు పంపనున్నట్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకున్న ఎన్‌సీడబ్ల్యు చైర్ పర్సన్ రేఖా శర్మ తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఎస్‌పీ నేత అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌జేడీ) నేత ఖండించారు. అయితే రానున్న ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పీ,బీఎస్‌పీ పొత్తు పెట్టు కోవడంతోనే ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు కూడా సమా చారం. అయితే మాయావతిపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నాని సాధన అన్నారు. ఎవరి మనో భావాలు దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని ఆమె పేర్కొ న్నారు. గతంలో ఆమెకు ఎదురైన అనుభవాన్ని చెప్పా లని అనుకున్నానని, తనను అవమానించే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేయలేదని క్షమాపణలు తెలిపారు. అయినప్పటికీ బీఎస్‌పీ నేత రామచంద్ర గౌతమ్ బాబూరీ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు.

## మోదీ పర్యటనను అడ్డుకుంటే రాష్ట్రపతి పాలన : కన్నా

**గుంటూరు :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో త్వరలో పర్యటిస్తారని, ఆయన పర్యటనను అడ్డుకుంటే రాష్ట్రపతి పాలన వస్తుందని రాజ్యసభ సభ్యులు జివి ఎల్ నరసింహారావు హెచ్చరించారు. గుంటూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాల నిరసనలకు భయపడి మోదీ తన పర్యటనను వాయిదా వేసుకోలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధుల్లో టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులేగాక లక్షన్నర కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను మాయం చేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ నిధులతోచేపట్టి పూర్తి చేసిన మూడు భారీ ప్రాజెక్టుల పేర్లు చెప్పాలన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ఇక నుంచి ప్రతి వారం ఒక కేంద్ర మంత్రి రాష్ట్రానికి వచ్చి కేంద్రం ఏం చేసిందో చెబుతారని అన్నారు.

# ప్రభుత్వ విధానాలతో అసమానతలు

### వ్యవసాయాన్ని హైజాక్ చేసిన కార్పొరేట్లు

- **గ్రామీణ సమస్యలపై మీడియా దృష్టి పెట్టాలి: కంఠంనేని రవీంద్రరావు స్మారకోపన్యాసంలో పాలగుమ్మి సాయినాథ్**



**అమరావతి :** కేంద్ర ప్రభుత్వం 1991 నుంచి అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో అసమానతలు పెరుగుతున్నాయని, దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. ఆదివారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో కంఠంనేని రవీంద్రరావు మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సదస్సులో 'సమాజంలో అసమానత - మీడియా పాత్ర' అంశం పై ఆయన ప్రసంగించారు. గడచిన మూడు దశాబ్దాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాల ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయని సాయినాథ్ అన్నారు. ప్రభుత్వాన్ని కొన్ని కార్పొరేట్ శక్తులే నియంత్రిస్తున్నాయని, లోక్‌సభ సభ్యుల్లో ఎక్కువశాతం వారే ఉన్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన చెప్పారు.

నీటి సరఫరా నుంచి బ్యాంకు రుణాల మంజూరు వరకు రైతులను, సామాన్యులను దెబ్బతీసి, కార్పొరేట్లకు లాభం చేకూరేలా ప్రభుత్వ విధానాలున్నాయని విమర్శించారు. సాగు కంటే పరిశ్రమలకే చౌకగా నీరు అందుతోందని, దీంతో తాగడానికి కూడా నీటిని అధిక ధరకు కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందన్నారు. విదర్భ ప్రాంతంలో సామాన్యులు నీటి ట్యాంకర్ల నుంచి లీటరు రూపాయికి కొంటుండగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి బీర్, ఆల్కహాల్ పరిశ్రమలకు లీటర్ నీటిని నాలుగు పైసలకే అందజేస్తోందని చెప్పగా సభికులు నివ్వెరపోయారు. సాగునీటి వినియోగంలో అసమానత వల్ల వ్యవసాయం నష్టదాయకమై రైతులు గ్రామాలు వదిలి పట్టణాలకు వలస వెళ్లిపోతున్నారని అన్నారు. అందరికీ దక్కాల్సిన సహజ వనరులు కొందరు సంపన్నులకు కట్టబెడుతున్నారని చెప్పారు. దేశంలో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులు హైజాక్ చేశాయని వివరించారు.

దేశంలో 1990లో లేని డాలర్ బిలియనీర్లు (వంద కోట్ల డాలర్లు- సుమారు 70వేల కోట్ల రూపాయలు) 2000 నాటికి ఫోర్బ్స్ జాబితాలో 53 మంది బిలియనీర్లుగా ఎలా ఎదిగారన్నారు. ముఖేశ్ అంబానీ 2017 నుంచి 2018కి ఒక్క ఏడాదిలో 1.5 లక్షల కోట్లు ఆదాయం ఎలా ఆర్జించాడని ప్రశ్నించారు. ఫోర్బ్స్ శత కోటీశ్వరుల ఫోటోలను ప్రముఖంగా ప్రచురించే మీడియా ఈ అంశాన్నిమాత్రం చర్చించకపోడం శోచనీయమన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయంలో ఉత్పత్తి వ్యయం గతంలో కంటే దాదాపు ఐదు రెట్లు పెరిగి నష్టాలపాలై రైతు ఆత్మహత్యలు పెరిగాయని, రైతులు రుణమాఫీ డిమాండ్ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. బ్యాంకులిచ్చే వ్యవసాయ రుణాల్లో 53 శాతం అగ్రి బిజినెస్ కంపెనీలకే వెళుతోందని, దాంతో సన్న చిన్నకారు రైతులు వడ్డీ వ్యాపారులనాశ్రయించ వలసి వస్తోందన్నారు. మహిళలకు ఇచ్చే వేతనాలలో కూడా వ్యత్యాసం ఉంటోందని, దాదాపు 75 శాతం గ్రామీణ మహిళలు వారు చేసే పనికి తగిన వేతనం పొందడంలేదన్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక ప్రకారం ఒక్క 2017లోనే దేశంలో దాదాపు 1.1 కోట్ల మంది ఉపాధి కోల్పోయారని వివరించారు. ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు. కులాల అసమానతలున్నాయని బాల్యం నుంచే వాటిని పిల్లలకు అలవరుస్తున్నారని, వివిధ అంశాలలో అసమానతలపై ఎదురైన అనుభవాలను ఆయన సదస్సులో పంచుకున్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను పరిశీలిస్తే వారు వైద్యానికి వెచ్చించడంవల్లే ఎక్కువగా అప్పులపాలవుతున్నారని తెలిపారు. విద్య, వైద్యం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

రాజా రామ్మోహన్ రాయ్, గాంధీజీ, అంబేద్కర్, భగత్‌సింగ్ పాత్రికేయులుగా ప్రజలను చైతన్యపరిచారని, ప్రస్తుత మీడియా వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వ్యవసాయం, రైతు సమస్యలు, గ్రామీణ ప్రాంతాల వార్తలపై మీడియా దృష్టి పెట్టాలని సూచించారు. మహిళా సమానత్వం, హక్కుల కోసం ఏర్పడిన కేరళ మహిళా కుడ్యం చారిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు. బిఆర్. అంబేద్కర్ లా కాలేజీ ప్రొఫెసర్ ఎన్. నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న వారికి కార్మిక చట్టాలు అమలుకావడంలేదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన నాయవాది బండ్ల సాంబశివరావు మాట్లాడుతూ 169 మంది పార్లమెంట్ సభ్యులపై క్రిమినల్ కేసులున్నాయని, వారే పారిశ్రామికవేత్తలుగా కొనసాగుతున్నారని విమర్శించారు.. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండపల్లి సత్యనారాయణ, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్. మల్లేశ్వరరావు తదితరులు వేదికనలంకరించారు.


# విమర్శలు అర్థవంతంగా ఉండాలి..

### టీఆర్ఎస్ సభ్యుడు కొప్పుల ఈశ్వర్

- చర్చలో పాల్గొన్న కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ సభ్యులు
- గవర్నర్ ప్రసంగంలో నిర్దిష్టత లేదు : గండ్ర
- ఆ పార్టీకి కిరణ్‌కుమార్‌రెడ్డి మంచి గిఫ్టునిచ్చారు : రాజాసింగ్


**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

శాసనసభలో ప్రతిపక్షాలు చేసే విమర్శలు అర్థవంతంగా ఉండాలని టీఆర్ఎస్ సభ్యుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రభుత్వ చర్యల్లో ఏవైనా తప్పులు దొర్లితే వాటిని సరిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టే మంచి కార్యక్రమాలను చెడగొట్టొద్దంటూ ప్రతి పక్షాలకు హితవు పలికారు. సంక్షేమ పథకాల విషయంలో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచిం దన్నారు. సమైక్య రాష్ట్రంలో అనేక తరగతులకు అన్యాయం జరిగిందని..




తెలంగాణలో వాటన్నింటినీ సరిదిద్దామని తెలిపారు. రైతుబంధు పథకం మిగతా అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ టీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రసంగించారు. చర్చలో కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి, అబ్దుల్లా బలాలా (ఎంఐఎం), రాజాసింగ్ (బీజేపీ) పాల్గొన్నారు.

వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగం లో పలు అంశాలకు సంబంధించి నిర్దిష్టత లోపించిందని అన్నారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ఎప్పటి లోగా అమలు చేస్తారని ప్రశ్నించారు. అన్ని నియోజక వర్గాల్లోనూ వంద పడకల ఆస్పత్రులను నిర్మించాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రస్తుతం సరిగా అమలు కావటం లేదని.. అందులో ఉన్న లోపాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. '104' వాహన సేవల ఉద్యోగులకు వేతనాలు అందటం లేదని, వాహనాలను డీజిల్ కొరత వేధిస్తున్నదని తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏండ్లకు పెంచుతామన్న హామీని ఎప్పటిలోగా అమలు చేస్తారని ప్రశ్నించారు. చర్చ సందర్భంగా గండ్ర... గవర్నర్‌నుద్దేశించి 'మీ గవర్నర్...' అని వ్యాఖ్యానించటంతో




సీఎం కలుగజేసుకున్నారు. 'గవర్నర్ ఒక పార్టీకి ప్రతినిధిగా ఉండరు. అందువల్ల ఆయన్ను మన గవర్నర్ అని సంబోధించాలి...' అని సూచించారు.

బలాలా మాట్లాడుతూ.. ప్రధాని మోడీ సహా బీజేపీ అగ్రనేతలందరూ ప్రచారం చేసినా టీఆర్ఎస్‌ను ఏమీ చేయలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ తెలంగాణలో పర్యటించినా.. ఆ పార్టీని అధికారంలోకి తీసుకురాలేక పోయారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు.. ఇక్కడికి దొంగలా వచ్చి అధికారాన్ని దోచుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. అయినా తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటనే నిలబడ్డారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా కేసీఆర్ ఏర్పాటు చేయబోతున్న ఫెడరల్ ఫ్రంట్ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాజాసింగ్ మాట్లాడుతూ.. ఎంఐఎంనుద్దేశించి విమర్శలు గుప్పించారు. 'ఇది గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చనా..? లేక రాజకీయ పార్టీల సభనా..?' అని ప్రశ్నించారు. 'ఎవరు అధికారంలో ఉంటే వారి కాళ్లను పట్టుకుని తిరగటం కొన్ని పార్టీలకు అలవాటు. ఆ ప్రకారంగా చంద్రబాబును, వైఎస్‌ను, కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఇప్పుడు కేసీఆర్ కాళ్లను పట్టుకుని ఒక పార్టీ తిరుగుతున్నది. కిరణ్ సీఎంగా ఉన్నప్పుడు ఆ పార్టీకి గిఫ్ట్ కూడా ఇచ్చారు...' అని ఎద్దేవా చేశారు.



# భూ పోరాట భేరి-వీరనారి



భూపతి వెంకటేశ్వర్లు

**తెలంగాణ లొంగని యుద్ధభూమి**
**యుద్ధరావాలు మోగించే రుద్రవీణ**
**కంటతడి పెట్టకండి- ఇంటికొక్కరు కదిలిరండి**
**రగులుతోంది... రాబందులపై కసి....**
**అవుతాంర్రా మసి మసి... ఒరేయ్ దొరా...!**

అని ధిక్కరించిన ధీరవనిత. కాళ్ల కింద నేల లేకుండా చేస్తున్న వాడిని, పాతాళంలోకి తొక్కేందుకు ఆడ, మగా తేడా ఏమిటి? భూమి కోసం, భుక్తి కోసం, సమానత్వం కోసం పోరాడటమూ నేరమైతే నేను నేరస్తురాల్నే అని ప్రశ్నించిన సాహసం. పర్వతం తవ్విన ముసలివాడి తెగువ అవ్వది. అ ప్పటి పోరాట నిగ్రహం, ఇప్పుడు నీ విగ్రహం చూస్తే నువ్వు లొంగవు. ప్రశ్నిస్తావు. అందుకే నీది నడుస్తున్న చరిత్ర.. తెలంగాణ తల్లి.. భూ పోరాటాలకు మెటిరియల్ తయారు చేస్తున్నది అవ్వ.. ఆమే చాకలి ఐలమ్మ చిరపరిచితురాలైన పోరాటాల వెలుగమ్మ.


**నైజాం రాజ్యాన ఉయ్యాలో, నల్లగొండ జిల్లా ఉయ్యాల**
**ఎట్టి చాకల్దమ్మ ఉయ్యాలో, ఎత్తైన మనిషమ్మ ఉయ్యాల**
**కరిగిపోయే మనసు ఉయ్యాలో, ఒదిగిపోయే గుణం ఉయ్యాల**
**పాలకుర్తిలోన ఉయ్యాలో, గట్టిదే ఐలమ్మ ఉయ్యాల**
**సంఘమే పెట్టింది ఉయ్యాలో, దొరల సంగతే చూసింది ఉయ్యాల...**

అంటూ ఇప్పటికీ అమ్మలక్కలు నాట్లల్లో, చేలల్లో గలగల పారే సెలయేటిలో ఐలవ్వ ఉద్యమ జీవితం పాడుకుంటున్నారంటే ఈ భూమిని ఊపిరిగా చేసుకొని పోరాటమే చిరునామాగా బతికింది ఐలమ్మ. అక్షరం రాదు కానీ.. హక్కుల పోరాటం తెలుసు. పేదరికం తెలుసు. పెద్దోళ్ల పట్ల మర్యాద తెలుసు. ఆకలెరిగిన వాళ్లకు అడుక్కొచ్చి అన్నం పెట్టడం తెలుసు. దొరలకు సవాల్ విసరడం కూడా తెలుసు. మనోనిబ్బరానికి ఆమే చిరునామా! అటువంటి ఐలవ్వ 1895లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో కండ్లు తెరిచింది. మల్లమ్మ, సాయిలు దంపతుల ముద్దుబిడ్డ. దొరలు, పటేల్, పట్వారీలకు కనబడకుండా, భయం భయంగా, బిక్కుబిక్కుమంటూ బతుకాల్సిన దీనస్థితి. మాన, ప్రాణాలకు రక్షణ లేని రోజులు. చిన్న వయస్సులోనే పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో లగ్గం కుదిరింది. ఐలవ్వకు ఐదుగురు మగోళ్లు, ఇద్దరు ఆడోళ్లు, పెద్ద కుటుంబం. పూట గడవడం కష్టంగా ఉండేది. బాంచన్ దొర అంటూ బట్టలుతికినా బతుకు గడవడం లేదు. ఏం చేయాలే.. భూమి కౌలుకు తీసుకోవాలే.. భూమి అంటే బువ్వ, ఓ ఆత్మ నిబ్బరం, కొండంత గుండె ధైర్యం. అందుకే భూమి కోసం మల్లంపల్లి దొర నాలుగు ఎకరాలు ఐలమ్మ కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నది. పాలకుర్తి పక్కన విస్నూరు దొర రాపాక రామచంద్రారెడ్డి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలలోని పెద్ద దేశ్‌ముఖ్. 40 గ్రామాల్లో 40 వేల ఎకరాల ఆసామి. కంటికి నచ్చినదేది తప్పించుకుపోదు. గుర్రం వాహనంగా మనుషుల్ని వేటాడేవాడు. వాడొక నరరూప రాక్షసుడనే పేరు ఉండేది. దుర్మార్గాలకు అంతేలేదు.

భువ్వకు లేనోళ్లు భూమి గురించి ఆరాటపడటమా? అందునా సాకల్ది సాగు చేయడమా? అడుక్కొనేవాడు ఆత్మ గౌరవంతో జీవించడమా? తలవంచుకొని బతకాల్సిన వారు తల ఎత్తి బతకడమా! అది దొర ఆధిపత్యానికి అడ్డు రావ డమే అని గుండ్లురిమి మల్లంపల్లి మఖ్తేదారు నర్సింహారెడ్డిని పిలుపించుకొని ఐలమ్మకు కౌలుకిచ్చిన భూమిని తన పేర రాసుకొని క్షణాల మీద బదిలీ చేసుకున్నాడు. అధికార దర్పాన్ని ప్రదర్శించాడు. పోలీసు అధికారులను పిలిపించి ఐలమ్మ భర్తను, కొడుకును జైలుపాలు చేశారు. ఆమె కూతురు పచ్చి బాలింతను వదలకుండా కరుడుగట్టిన దొరలు ఆమెపై లైంగికదాడి చేశారు. బిడ్డ కాపురం కూలిపోయింది. బిడ్డకు ధైర్యం చెప్పింది. భర్త, కొడుకు జైల్లోనే ఉన్నారు. ఇదే సమయంలో ఆంధ్ర జనసభ, ఆంధ్ర మహాసభగా పరిణామం చెందింది. అందరికీ అక్షరజ్ఞానం కోసం గ్రంథాలయోద్యమం ముందుకొచ్చింది. అప్పుడే సంఘం పుట్టింది. రహస్య సమావేశాలు జరుగుతున్నాయి. ఆ సమావేశాలలో భూస్వాముల దుర్మార్గాలు, వెట్టి చాకిరి, అధిక పన్నులు, నిర్బంధ వసూళ్లు వంటి అనేక అంశాలపై చర్చలు జరిగేవి. ఆ క్రమంలోనే సంఘ సభ్యులు చైతన్యమవుతూ వచ్చారు. సహకార సంఘాలు ఏర్పడ్డాయి. తిరుగుబా టుకు సిద్ధమయ్యారు.

విస్నూరు దొర వలన పొంచి ఉన్న ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ఐలమ్మ సంఘం చీటి తీసుకుంది. సంఘం ముచ్చట్లు అర్థం చేసుకుంది. ఆ సమావేశాలకు హాజరైంది. గ్రామ పరిస్థితులు ఎప్పటికప్పుడు సంఘం కార్యకర్తలకు అందజేసేది. కుటుంబ సభ్యులను సంఘంలో చేరడానికి ప్రోత్సహించింది. తన ఇంటిని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంగా మార్చి వీరాధి వీరులకు అండగా నిలబడింది. కుటుంబం మొత్తం ఇంటి ఇంటికీ వెళ్లి బువ్వ అడుక్కొని వచ్చి సంఘం కార్యకర్తలకు పెట్టే ఆదర్శ అమ్మగా, పోరాట వెలుగుగా కుటుంబాన్నే పార్టీ పరం చేసిన తల్లిగా ఆ రోజుల్లో నాయకులు కొనియాడారు. ఐలమ్మ నాలుగో కూతురు సోమనర్సమ్మ పైన లైంగికదాడి చేసి బయోత్పాతం సృష్టించినప్పుడు ఐలమ్మ తన కూతురును గడి దగ్గరకు తీసుకెళ్లి ఏడు దోసిళ్ల మన్ను బోసి "ఒరే దొరా.. నీ గడీల గడ్డి మొలుస్తదిరా?" అని శపించి తన కూతురుకు ధైర్యం చెప్పిన ధైర్యశాలి. అంతేకాదు, ఆమె తూటాల్లాంటి మాటలతో దొరను గడగడలాడించింది. ఆమెతోపాటు కమ్యూనిస్టు నాయకులపై పాలకుర్తి దొమ్మికేసు పెట్టించాడు. గూండాలతో ఇండ్లపై దాడులు చేయించారు. రోజురోజుకూ దొర ఆగడాలు మితిమీరుతున్నాయి. 1944 భువనగిరి ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో ప్రజా చైతన్యానికి పటిష్ట పునా దులు పడ్డాయి. దొడ్డి కొమురయ్య మరణంతో పోరాటం అన్ని గ్రామాల్లో ఉద్యమాలకు ఊపిరిపోసింది. పాలకుర్తి, విసునూరు, కడవెండి, కామారెడ్డి గూడెం, దేవరుప్పల గ్రామాలన్నీ పోరాట కేంద్రాలుగా ఉడుకుతున్నాయి. ఐలవ్వపై ఆగడాలు పెరుగుతున్నాయి. కమ్యూనిస్టులు గ్రామాల్లో చిన్న చిన్న సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం, పాటలు పాడటం బుర్రకథలు, ఒగ్గు కథతో ఒక సాంస్కృతిక వాతావరణానికి ఆటపాటలు ప్రజా చైతన్యానికి తూటాలుగా వర్ధిల్లుతున్నాయి.






పాలకుర్తిలో ఆంధ్రమహాసభ నాయకులు సభ ఏర్పాటు చేసి బుర్ర కథ చెబుతుండగా విసునూరు దేశ్‌ముఖ్ గూండాలు, విస్కోన్ అలీ గుమస్తా అబ్బాసు అలీ, వృత్తాలం రామిరెడ్డి, వనమాల వెంకడు తదితరులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ప్రజలు తిరగబడటంతో తప్పతాగిన గూండాలు పారిపోయి గడీలో తలదాచుకున్నారు. ఆ రాత్రికి రాత్రే దొర పోలీసులను పిలిపించి వనమాల వెంకడుపై హత్యాయత్నం చేసింద్రనే నేరం మోపారు. పైగా రాత్రి పడుతుండగానే, నాయకులు లేని సమయాన ఐలవ్వ ఇంటికి నిప్పు పెట్టింద్రు. ఒకవైపు మంటలు మండుతున్నాయి. గూండాలు ఇంట్లో జొరబడి యేదుం సద్దలు, పెసర్లు, నువ్వులు, బియ్యం ఎత్తుకుపోయింద్రు. ఇవన్నీ బండ్లల్లా గడీలకు తోలుకపోయింద్రు. ఇల్లు ఖాళీ అయిపోయింది. కట్టుబట్టలతో తలదాచుకొనే జాగలేని పరిస్థితిలోనూ ఐలమ్మ లొంగలేదు. ప్రజల సహాయంతో కాలిన చోట తలా ఒక్క గుంజ, కట్టే, కమ్మతో గుడిసె వేసుకుంది. గుడిసెపై ఎర్రజెండా ఎగురవేసింది. ఐలమ్మ పొలం కోయడానికి వరి చేలోకి వెళ్లింది. అంతలో గూండాలు ఈ భూమి విస్నూరు దొరది, ఈ పంట దొరది అని బెదిరించారు. ఐలమ్మ పంట ఐలమ్మకు చెందాలి. ఈ వార్త పరిసర ప్రాంతాలకు అందింది. అందిందే తడవుగా వందలాది ప్రజలు పాలకుర్తి వచ్చి ఐలమ్మకు అండగా నిలబడ్డారు.

చుట్టుపట్ల గ్రామాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు పార్టీ వలంటీర్లు దుండగులను తరిమి కొట్టారు. వరి కోసి, కొట్టి ధాన్యం మూటలు కట్టి వీపుల మీద మోస్తూ ఐలమ్మ ఇంటికి చేరుస్తుండగా దారి మధ్యలోనే మరో కిరాతక దాడి ఎదురైంది. గూండాలచే నెరవేరలేదని తన దుర్మార్గం సాయుధ పోలీసులచే సాధించాలని దేశ్‌ముఖ్ పోలీసులను ఎగదోశాడు. వీపుల మీద ధాన్యం మూటలు మోస్తున్న వారిలో భీంరెడ్డి నర్సింహారెడ్డి, కాచం కృష్ణమూర్తి, చకిలం యాదగిరిరావు, నల్లా నర్సింహులు ఉన్నారు. వారిపై టార్చిలైట్ వేసి పకడో పకడో అని బిగ్గరగా కేకలు వేశాడు. అమీన్ సాబ్ అందిన వారిని అందినట్టుగా అరెస్టు చేస్తున్నారు. అయినా ప్రజలు బహునేర్పుగా ధాన్యాన్ని ఎక్కడికక్కడ తప్పించి, ఐలమ్మ ఇంటికి చేర్చారు. ఇందుకు ప్రతి చర్యగానే భీంరెడ్డి, కృష్ణమూర్తి, చకిలం యాదిగిరిరావులపై మరో దొమ్మీ కేసు బనాయించి పాలకుర్తిలో ఒక గుహలోకి తీసుకొనిపోయారు. విపరీతంగా కొట్టారు, ఒళ్లంతా హూనమైపోయింది. స్పృహతప్పిన కామ్రేడ్స్‌పై కారం చల్లుతూ నానా హింసలు పెట్టారు. 'అమానుషంగా కలంతో రాయలేని, నోటితో చెప్పలేని చిత్ర హింసలు పెట్టారు. తోటి సహచరుల అరెస్టు వార్త తెలుసుకొని విసునూరుకు వస్తున్న ఆరుట్ల రామచంద్రారెడ్డిపై గూండాలు దాడి చేసి బట్టలు గుంజుకొని చింత బరిగెలతో చితకబాదారు. చెట్లల్ల నుండి తప్పించుకున్న రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డికి చెప్పి అన్ని వివరాలు డైరెక్టర్ జనరల్ అండర్సన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. పాలకుర్తి సంఘటన మొత్తంగా సాయుధ పోరాటంలో అనేక కొత్త ఎత్తుగడలకు, వ్యూహాలకు కారణమైంది. దీనికంతటికీ ఐలమ్మ రాజేసిన అగ్ని కణం 'భూపోరాటం". 10 గ్రామాల్లో వేలాది ఎకరాల భూమి పంచింది. నాలుగు వేల అమరులు బలిదానం చేసిన సాయుధ రైతాంగ పోరాటంలో ఐలవ్వ అగ్గిరవ్వ.అయినా నీ ఘన చరిత్రకు దక్కాల్సిన గౌరవం దక్కలే దు. వీరులను కీర్తించే బదులు వక్రీకరిస్తున్నారు. తెలంగా ణకు ప్రతీకైన అవ్వ ప్రతిమకు ట్యాంకుబండ్‌పై స్థానమే లే దు. కిరీటం, స్వర్ణ భరణాలతో కలిగిన మహారాణి తెలంగాణ తల్లి ఎట్లా అవుతుంది. ఐలవ్వ అంటే తెలంగాణ తల్లి. భూ పోరాటానికి ప్రతి రూపం, వెట్టిచాకిరి తప్ప ఏం చేయాలో తెలియని జాతికి పోరాటాల వెలుగు. నీ మట్టి పరిమళాన్ని భావితారాలకు అందించాలి. నీ ఆశయాలు పంచుకోవాలి. అవ్వా! నువ్వు పరమపదించి 34 ఏండ్లైనా నీ పోరాటానికి 73 ఏండ్లు దాటినా దున్నే వాడికి భూమికి నోచని శోషిత వర్గాలకు నేటికీ నువ్వు ఒక కాంతి పుంజం. అవ్వా నువ్వు మల్లొక్కసారి ఈ గడ్డపై రావాలని ఉంది. నీవు కూలగొట్టిన గడీలు మళ్లీ మొలుస్తున్నవి. అవి 20 అంతస్తులుగా మారి మా గుడిసెల్ని కూలగొడుతున్నవి. భూ పోరాటానికి ఐలమ్మ అన్న పేరే ఒక స్ఫూర్తి మంత్రం. రైతాంగ సాయుధ పోరాటం తర్వాత భూ పోరాటాలకు ఇది విరామం. విరామం విరమణ కాదు. ఓటమి కాదు. రేపటి సమరానికి సన్నాహం. అమ్మా! నీవెప్పటికీ తరగని పోరు రత్నం.

**సెల్ : 9490098343**

## సైన్స్ కాంగ్రెస్ సాక్షిగా అసత్య ప్రచారాలా?



గడ్డం శ్యామ్

భూమి పుట్టుక, భూమిపై జీవం ఆవిర్భావం, దాని పరిణామక్రమం అర్థమవ్వాలన్న సైన్స్‌ను చదవకుండా, అర్థం చేసుకోకుండా సాధ్యం కాదు. నిరూపణ ద్వారా తెలుసుకోగల్గే శాస్త్రీయ విజ్ఞానాన్ని మనం 'సైన్స్' అంటాం! అందుకే విధిగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు పర్యావరణంపై, పరిణామక్రమంపై జీవం ఉద్భవించడంపై అవగాహన, శాస్త్రీయ దృక్పథం కోసం సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా ఉంటుంది. ఉండాల్సిందే కూడా. కానీ దేశంలో శాస్త్రీయ ప్రతిబంధానికి, ఆర్ఎస్ఎస్ అనుకూల బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో శాస్త్రీయ దృక్కోణాన్ని ధ్వంసం చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని స్పష్టంగా అర్థమవుతుంది. దానిలో భాగంగానే పాఠశాల విద్యలోని తెలుగు పాఠ్యపుస్తకాల్లో పురాణాలు, ఇతివాసాలు, వేదాలతో నింపి వేసింది. చరిత్రను వక్రీకరించే పనిలో నిమగ్నమైంది. తద్వారా పిల్లల ఆలోచన విధానంలో, శాస్త్రీయ దృక్పథంలో, అవగాహనలో హేతుబద్ధత కుంటుపడుతుందనడం వాస్తవం. రేపటి విద్యార్థులు ఆధునిక యుగంలోని పోటీ ప్రపంచ దేశాల స్థాయిలో మన దేశం నుంచి నవకల్పన, నూతన ఆవిష్కరణల ద్వారా సైన్స్‌ను అభివృద్ధి చేయగలరా...! అనేది ఆలోచించాల్సి ఉంది. మొన్న ఈ మధ్య ఆంధ్రా యూనివర్సిటీ విసి.నాగేశ్వరావు పంజాబ్ లోని జలందర్‌పూర్‌లో జరిగిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతూ, కౌరవులంతా టెస్ట్‌ట్యూబ్ బేబీలు అనడం పూర్తి సైన్స్ కాంగ్రెస్ సమావేశాలనే అపహాస్యం చేసినట్టుగా మనం భావించాల్సి ఉంది. ఎందుకంటే ఒక ప్రఖ్యాత యూనివర్సిటీ అధిపతి, సైన్స్‌ను, టెక్నాలజీని, శాస్త్రీయతనీ పెంపొందించాల్సిన బాధ్యతగల ఒక సైంటిస్ట్. ఉహాజనితంగా, హేతువిరుద్ధంగా మాట్లాడటం దుర్మార్గం. దీని ద్వారా విద్యార్థులకూ, ప్రజలకూ ఏం సంకేతం ఇస్తున్నట్టు. భూమిపై గల ప్రతి జీవి పుట్టుక, మనుగడపై శాస్త్రీయ విమర్శనాత్మక పరిశోధన, పరిశీలనలపై చర్చించి నిరూపించాల్సిన బాధ్యత గల ఒక సైన్స్ వేదిక సాక్షిగా కట్టు కథలు, విష ప్రచారాలా...? టెస్ట్ ట్యూబ్ బేబి ఏర్పడ్డ విధానమంత మానవ విజ్ఞానం. సైన్స్‌లో ముడిపడి ఉంది. ఆ బేబి ఏర్పడే టెక్నాలజి విధానాన్ని మనం ఒక్కసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది. స్త్రీ జీవి నుంచి అండాలను, పురుష జీవి నుంచి శుక్రకణాలను గ్రహించి ఈ రెండింటిని రసాయన ద్రవ పదార్థంలో ఫలదీకరణం చేయాల్సి ఉంటుంది. అలా చేసిన 3 రోజులలో ఎబ్రియో ఏర్పడుతుంది. దాన్ని తిరి గి 1950 సెంటిగ్రేడ్ వద్ద శీతలికరించాలి. తల్లి గర్భంలో ఆ ఎబ్రియోను ప్రవేశపెట్టిన తరువాత వివిధ రూపాంతరాల అనంతరం తల్లి గర్భం నుంచి బేబి బయటికి వస్తుంది. కానీ ఈ ప్రక్రియ అంతా మనకు మహాభారత కథలో జరగలేదు. కుంతి పాండవుల అగ్రజుడు ధర్మరాజుకి జన్మనిస్తున్నది. కుంతి కంటే ముందే గర్భం ధరించిన గాంధరి జన్మిం చకపోవడంతో ఆసూయ, కోపంతో గాంధరి గర్భాన్ని బాదుకోవడం వలన గర్భ విచ్చిత్తి జరుగుతున్నది. అప్పుడు వేదవ్యాసుడు అవిచ్ఛితి ముక్కలను 100 బాగాలుగా విడగొట్టి నెల రోజుల వ్యవధిలో 100 కుండల నుంచి 100 బేబీలను బయటకి తీయ్యడం జరుగుతుందనేది మహాభారతంలోని కౌరవుల జన్మ కథ. ఇక్కడ సైన్స్‌కి, టెక్నాలజికి, శాస్త్రీయతకు సంబంధిం చిన ఒక్క చర్య జరగలేదు. టెస్ట్ ట్యూబ్ టెక్నాలజి ద్వారా తిరిగి పిండాన్ని గర్భంలో ప్రవేశ పెట్టాల్సిందే. కానీ గాంధరి కథలో అలా జరగలేదు. శుక్ర, అండ కణాల ఫలదీకరణం జరగలేదు. ఎబ్రియో ఏర్పడలేదు. శీతలీక రణ చర్య జరగలేదు. అలాంటి టెక్నాలజీ, ఆధునిక యంత్రాలు ఏవి లేవు. అలా జరిగిందనడానికి చరిత ఆధారాలు లేవు? ఈ టెస్ట్ ట్యూబ్ బేబి పరిజ్ఞానం గాంధరికి ముందుగానీ తరువాత సమాజంపై గానీ లేదు. ఒ క్క గాంధారికి జరుగుతుంది. ఎందుకలా ఈ పరిజ్ఞానం ఉంటే అప్పటి స మాజంపై ఆ ప్రభావం ఉండాలి కదా! మరి లేదు ఎందుకు? ఇదంతా పు రాణాల కథ, ఆధారాలు లేని, నిరూపణ సాధ్యం కాని కథ. కథ, కథలాగే ఉంటే అభ్యంతరం లేదు కానీ అదే జ్ఞానం, విజ్ఞానమంటూ భ్రమింపచేసే ప్రభుత్వ అనుకూల మనువాద ప్రొఫెసర్లను అధిపతులుగా నియమిస్తే భారతదేశ భవిష్యత్, పిల్లల జీవితాల్లో కొత్త ఆవిష్కరణలు ఎలా చిగురి స్తాయి. శాస్త్ర జ్ఞానానికి, హేతుబద్ధతకు అవరోధంగా ఉండే మతోన్మాదం ఇప్పుడు అధికారంలో వుంది. మానవ వ్యవహారాల్లో నిశ్చితత్వాన్ని పెంపొ ందించేందుకు భవిష్యత్ గురించి విశ్వసనీయ ఆధారాలతో ఖచ్చితమైన అంచనాకు రావడానికి శాస్త్ర విజ్ఞానం అవసరం. కానీ ఆ శాస్త్రీ విజ్ఞానం స్వేచ్ఛగా తనకు తానుగా లేదు. రాజకీయాల్లో చిక్కుకొని బందిగా ఉంది. అందుకే రాజకీయ వికృత క్రీడలకు సైన్స్ జ్ఞానానికి పరస్పరం ఘర్షణ జరుగుతూనే ఉన్నది. సరిగ్గా యేడాది క్రితం మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్య పుస్తకాల్లో నుం చి తొలగించాలని చేసిన వ్యాఖ్యలపై పెద్ద చర్చ కూడా జరిగింది. ఆ తరు వాత శాస్త్రవేత్తలు కూడా స్పందించి 'డార్విన్ సిద్ధాంతాలకు ఉన్న శాస్త్రీ యత, మానవ పరిణామ క్రమం ఇప్పుడున్న ఏ ఒక్క దానికీ లేదు. ఉంటే నిరూపించండి' అంటూ ఘాటుగా స్పందించారు. మరోవైపు దేశ ప్రధాని ఏకంగా వినాయకుని మేడ ప్లాస్టిక్ సర్జరి అంటాడు. పుష్పక విమానం ఉంది అంటాడు. సీఎస్ఐఆర్ సైంటిస్టులు కూడా దాన్ని సమర్థి స్తారు. చంద్రుడికి రెండోవైపు గ్రహాలను పంపి పరిశోధన చేస్తున్న రష్యా, అమెరి కా, చైనాలతో ఈ పుక్కిట పురాణాలు హేతువులేని కట్టు కథలతో దేశ ప్రగతిని ఎలా సాధించగలం. అశాస్త్రీయతకు, మూఢనమ్మకాలకు అసలు స్థానం లేని వేదిక నుంచి రాజకీయాలకు లోబడి, స్వప్రయోజ నాలకు ఆశపడి, చదువుకున్న విజ్ఞానాన్ని మరచి, విష ప్రచారాలు చేస్తుంటే ప్రజ లు, విద్యార్థులు ఏం ఆలోచించాలి. ఏం అర్థం చేసుకోవాలి.

**సెల్ : 9908415381**

## ఎన్నికల 'సం'క్రాంతి



రాజేశ్ కారంపూరి

భోగి మంటల భగభగలు భాగ్యాలకు నెలవు. సంక్రాంతి అంటే ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, గాలిపటాల సందళ్లు, కొత్త అల్లుండ్ల అలకలు. కానీ ఈ సంక్రాంతికి పల్లెల్లో పంచాయతీ ఎన్నికలతో మరింత జోష్ వచ్చింది. హరిదాసులతోపాటు ఉదయాన్నే అభ్యర్థులు ఇండ్ల ముంగిళ్లకు వచ్చారు. పండుగ పర్వదినాన అటు బంధువులూ, ఇటూ కుటుంట సభ్యులతో కళకళలాడుతుంటే అభ్యర్థుల ప్రచారంతో వీధులు మరింత సందడిగా మారాయి. సంక్రాంతికి పల్లెల్లో కొత్త జోష్ నెలకొంది. పంచాయతీ ఎన్నికల ప్రచారం పండుగ సందడిని మించిపోయింది. హరిదాసుల సంకీర్తనలకన్నా, అభ్యర్థుల హామీలే ఎక్కువయ్యాయి. గంగిరెద్దుల విన్యాసాలకన్నా నేతల జిమ్మికుల ప్రదర్శనలే అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. కోడి పందాల జోరు కన్నా అభ్యర్థులపై ఇతరుల బెట్టింగుల హోరే ఎక్కువుంది. పండుగకు ఎక్కడెక్కడో ఉండేవారు ఊరికి చేరుకోవడంతో ఇదే మంచి అవకాశంగా ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఇలా పండుగ, ఎన్నికలు ఒకేసారి రావడంతో ఈ సంక్రాంతి కొత్త జోష్‌ని సంతరించుకుంది.గ్రామ పంచాయతీ ఎన్నికలు పండుగ తర్వాతనే ఉండటంతో అన్ని గ్రామాల్లో ఎన్నికల 'క్రాంతి' గా మారింది. మొదటి దశ బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు ఖరారు కావడంతో ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో హామీల వర్షాలు, డబ్బు పంపిణీలు జరుగుతున్నాయి. రెండోదశ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా, మూడో దశలో ఆసక్తి ఉన్న అభ్యర్థుల ఆత్మీయ పలకరింపులు, ఆశీర్వాద స్వీకరణలతో పండుగకు పిలువని చుట్టాల్లా వచ్చి, వారే మర్యాదలు చేశారు. ప్రతి ఇంటినీ పలుకరించి సారె అందించారు. కానుకలాగా చీరలు, పిండి వంటలు, మద్యాన్ని, పండుగ ఖర్చులకు డబ్బులు ఇస్తున్నారు. ఇలా తమ ఓటర్లను సంతోషపెట్టే ప్రయత్నాలు కోకొల్లలు. సంక్రాంతి పూట పతంగుల జాతరలను నిర్వహిస్తూ, యువతను ఆకర్షించే విధంగా తమదైన రీతిలో యువ ఓట్లను వశం చేసుకునే విధంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలో ఏ పండుగకైనా ముందుండేవి మందూ, మాంసమూ. తమదైన శైలిలో వివిధ బ్రాండ్లు వారిగా డోర్ డెలివరీ చేస్తూ మద్యం మత్తులో ముంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా పండుగలో మరింత జోరు నింపింది. సంక్రాంతి పూట కూడా అన్నదాత పండించిన పంటతో పెట్టుబడిదారులు పండుగ చేసుకుంటున్నారు. కానీ కనీస మద్దతు ధరను ఇచ్చి రైతన్న కండ్లలో ఆనందాన్ని చూడలేకపోతున్నారు. సంక్రాంతి అంటే చీకటి నుండి వెలుగులోకి వెళ్లడం, ఓటమి నుండి విజయం వైపు వెళ్లడం. కానీ తెలంగాణ సైరికుడు మాత్రం సమస్యల్లో చిక్కుకుపోయాడు. మరోవైపు ఏకగ్రీవం పేరుతో పంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. భోగి మంటల్లో పాత వస్తువులను వేసి దగ్ధం చేస్తారు. అలా సమాజంలోని దుశ్చర్యలను దగ్ధం చేసిననాడే నిజమైన సంక్రాంతి.

**సెల్ : 8143190123**

## సం'క్రాంతి' ఇదేనా?



సావిత్రి శ్రీశైలం

సంక్రాంతి దక్షిణ భారతంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆంగ్ల సంవత్సరం తర్వాత వచ్చే మొదటి తెలుగు పండుగ. ఇది ఆంధ్రలో మూడు రోజులు, తెలంగాణలో ఒకటి లేదా రెండు రోజులు జరుపుతారు. ఈ పండుగకు పది దినాల ముందునుండే గ్రామాల్లో వాకిళ్లు రంగురంగుల ముగ్గులతో ముస్తాబవుతాయి. ఈ పండుగ రోజు ప్రతి ఇల్లూ పచ్చని తోరణాలతో కళకళలాడుతాయి. పై మాటలన్నీ పుస్తకాలు, పేపర్లలో చదివిన విషయాలు మాత్రమే. నేను చూసినా, చూస్తున్న, అనుభవించిన సంక్రాంతి మాత్రం వేరు. వాటిని తెలంగాణ సమాజానికి క్రోడీకరించే ప్రయత్నం చేస్తా...

నా చిన్నప్పుడు మాకున్న ఆర్థిక స్తోమతకీ, లాగుకి రెండు ట్యూబ్ లైట్ల(బొక్కలు)తో, చీమిడి కారుస్తూ సంక్రాంతి అనగానే నాకు గుర్తొచ్చేది పతంగులు (గాలిపటాలు). అవంటే నాకు తెగ మోజు, వాటిని కొనడానికి మాయమ్మను, అయ్యను గోకిన సోట గోకకుండా గోకితే మాయమ్మ కాదనకుండా రెండు రూపాలిస్తే, ఒక్క రూపాయితో పతంగి, ఇంకో రూపాయితో దారపుండ కొనేటోన్ని. దాన్ని తీసుకొని నా దోస్తుగాళ్లతో చెరువుగట్టు మీద ఎగరేయనీకే పోయేటోన్ని. అప్పుడు అవి డొల్కలు కొట్టుకుంటూ దారం తెగిపోతే, దాన్ని పట్టుకునేందుకూ చేసే యాతనలో ఉండే సంతోషమే "సంక్రాం తి". అయితే, ఇవన్నీ చెప్పడానికి కారణం ఇప్పటికీ నా చిన్నప్పుడు నేనున్నా ఆర్థిక స్తోమతలో చాలా మందున్నారు. అంటే ఏం మారింది అప్పటికీ, ఇప్పటికీ? డబ్బులున్నోడికి రో జూ పండుగే. దానికి సంక్రాంతి, గింక్రాంతి అవసరంలే. తెలంగాణలో గత మూడేండ్లుగా చాలీచాలనీ వానలతో పనులు లేక, వ్యవసాయం చేయలేక, పంటలకోసం తెచ్చిన అప్పు తీర్చలేక సతమతమవుతున్నారు. అప్పుల బాధతో ప్రాణాలు తీసుకుంటున్నారు. వాన లేదని ఊరుకోకుండా ఆశతో బరువెక్కిన గుండెల్లో ఏ మూలనో ఉన్న కోరికతో బోర్ల మీద బోర్లు(బోరుబావి) వేస్తూ, అప్పుల పాలవుతుంద్రు. ఇలా అప్పుల ఊబిలో మూలుగుతున్న రైతన్నకి ఏ పండుగొచ్చిన ఒకటే... ముఖ్యంగా తెలంగాణ రైతుల బాధని అర్థంచేసుకునే పరిస్థితిలో నేటి ప్రభుత్వాలు లేవు. కానీ, ఈ సంక్రాంతి మాత్రం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఎందుకంటే? ఈ సంక్రాంతికి ఐదేండ్లకోసారొచ్చే కపట రాజకీయ జూదం కదా! ఈ రాజకీయ పోరులో జనాలను ఆకర్షించేందుకు నాయకులు ఎన్నో పాట్లు, ఫీట్లు పడుతున్నారు. దానికోసం తాగేటోనికి మందు, తాగనోనికి డబ్బులాశ సూపెడుతుంద్రు. ఏదైతేనేం, అందరూ దొంగలే కదా! "సచ్చినోడి పెండ్లికి వచ్చిందే కట్నం అన్నట్టు" ప్రజలు వ్యవహరింస్తుంద్రు. ఎట్లయితేనేం ఈ కష్టకాలంలో ఈ పండుగకన్నా ఐదు వేళ్ల నోట్లోకి పోతున్నందుకు ఒకవైపు ఆనందం, ఇంకోవైపు వారి ప్రలోభాలకుగురై అక్కడక్కడా గ్రామశ్రేయస్సు కోసం నిలబడే నాయకులకు ఓటెయ్యరేమో అనే భయముంది. కాని ఏదేమైన గ్రామ శ్రేయస్సుకోసం పాటుపడే వారినే ఎన్నుకోవాలన్నదే నా ఆశ. వారివల్లే ఊరు బాగుపడుతదానేది మరవొద్దు.

**సెల్ : 9247343947**

## తెలంగాణలో 'సంక్రాంతి'



కిరణ్ పల్లుడెం

సంక్రాంతి అంటే మనకు ముందుగా గుర్తొచ్చేది రంగురంగుల ముగ్గులు, ఇండ్లల్లో గొబ్బెమ్మలు, భోగిమంటలు, పాల పొంగులు, పతంగుల ఎగరవేతలు...గంగిరెద్దులోళ్ల ఆటలు... ఇది మనకు తెలిసిన సంక్రాంతి. కానీ ఇది రైతుల పండుగ, రైతులు పండించిన పంటను ఇంటికి తీసుకొచ్చే రోజు, పడిన కష్టం చేతికొచ్చే రోజు, రైతులు సంతోషంగా ఉండాల్సిన రోజు. మరి నిజంగా ఈ రోజు "హలికుడు సంతోషంగా ఉంటున్నాడా? నేటి మన ఈ బంగారు తెలంగాణలో సైరికుని జీవితం సుఖంగా గడుస్తోందా..? అంటే లేదు అనే చెప్పుకోవాలి.నేడు మన తెలంగాణ సమాజంలో రైతు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. పండించిన పంటకు మద్దతు ధర లేక, దళారులు చెప్పిన ధరకే పంటను అమ్మాల్సి వస్తోంది. కష్టపడి పండించిన పంటను అప్పుల బాధతో మన పంటకాపు "అడ్డికి పావు శేరు" లెక్కన అమ్ముకొని కాలం వెల్లదీస్తున్నాడు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతు వ్యవసాయదారుల బాధలు పట్టించుకొని సమస్యలు తీరుస్తారనీ ఆశగా ఎదురుచూడడం తప్ప ఏమీచేయలేని పరిస్థితుల్లో ఉన్నాడు రైతు.

సంక్రాంతి పండుగ అనగానే ముఖ్యంగా గుర్తుకొచ్చేది గంగిరెద్దులోళ్లు. గ్రామాల్లో పండుగ శోభ తెచ్చేది వీళ్లేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. సంక్రాంతి పండుగకు మాత్రమే కనిపించే గంగిరెద్దులోళ్లు మన తెలంగాణలో 70వేల మంది ఉన్నారు. వారసత్వంగా కళారూపాన్ని నమ్ముకుని బతుకుతున్న వీరిని మన పాలకులు గుర్తించడంలేదు. సమాజంలో వీరిని బిచ్చగాళ్లలా చూస్తున్నారు. "పొట్ట నింపుకోవడం కోసం కోటి తిప్పలు" పడుతున్నారు. వీళ్లకు రేషన్ కార్డులు కూడా లేవు. కొందరు రాజకీయ నాయకులు వీరి బాధలు విని హామిలిచ్చినా అందులో ఏ ఒక్క హామీకూడా నెరవేర్చలేదు. తెలంగాణ కళలకు పుట్టినిల్లు అని చెప్పుకునే మన సర్'కారు' గంగిరెద్దుల కళను ఎందుకు గుర్తించడం లేదోమరి..? ఇకనైనా ప్రభుత్వం వీరి కళను గుర్తించి ప్రతి ఒక్కరినీ ఆదుకొని సమాజంలో గుర్తింపు ఇవ్వాలి. కనుమరుగవుతున్న వారి కళను బతికించి, సంక్రాంతి శోభను తిరిగి తీసుకురావాలి. ఈ పండుగలో పతంగులు ఎగరవేయడం కూడా ఒక భాగం. కానీ వీటి పేరుతో పర్యావరణానికి హాని కలిగించే మాంజాను ఎక్కువగా పట్టణాల్లో వినియోగిస్తున్నారు. ఈ మాంజా వల్ల పక్షులకు ఇతర జంతువులకు హాని ఉందని నిషేధం విధించినా పట్టణాల్లో యథేచ్ఛగా అమ్ముతున్నారు. దీన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం. అర్హులైనా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అంది, వ్యవసాయం పండుగ అయినప్పుడే పల్లెలు పచ్చగా మారినప్పుడే నిజమైన సంక్రాంతి.

**సెల్ : 8712344410**

## రచయితలకు సూచనలు

**ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ఏదైనా సంబంధించిన వ్యాసమైతే దానికి సంబంధించిన కటింగ్ లేదా రిఫరెన్స్ జతచేయాలి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయాలి.**

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

- ఎడిటర్

**మీ రచనలు పంపవలసిన చిరునామా :**

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

## ఇప్పుడు ఆమె సావిత్రీగణేషన్!

రంగనాయకమ్మ

- 2 -

విషాదం చూపే కంటితో రెం డు కన్నీటి చుక్కలుకూ డా కార్చాలన్నాడు. సా విత్రి అలా చెయ్యగలనని అంగీ కరించి, అలాగే చేసినట్టు ఆ ఘట్టం నడిపారు. నిజం సావిత్రి, గ్లిజరిన్ లేకుండానే విషాద ఘట్టాల్లో కన్నీళ్లు కా ర్చగలిగేది - అని వెనకటి పుస్తకాల్లో చదివాం. సినిమాలు చూసే ప్రేక్షకులు కూడా కొన్ని విషా ద ఘట్టాల్లో కన్నీళ్లు కారేంతగా బాధపడతారు. వాళ్లేమన్నా గ్లిజరిన్ పెట్టుకుంటేనే అలా అవు తారా? విషాదం కలిగితే, రెండు కళ్లూ ఒకే రక ంగా చెమర్చడంలో వింతేమీ వుండదు. నటించే సందర్భం అంత విషాదం అయితే, సావిత్రికి కళ్లు చెమర్చేవేమో! ఆమె, బిచ్చగాళ్లని చూసి ద య చూపే మనసుగల మనిషే కదా? విషా దంతో ఆమెకి గ్లిజరిన్ లేకుండానే కళ్లు చెమర్చి వుండవచ్చు. కానీ, సావిత్రి, ఒక్క కంటితో నవ్వి, ఒక్క కంటితో ఏడ్వ గలదు - అని చూపించ డమా? ఒక్క కంటితో రెం డు చుక్కలు కార్చడం, ప్రకృతి సహజత్వానికే విరుద్ధం అవుతుంది గానీ, అది ఆ నటి నేర్పరితనం అవదు. అసలు ఒక్క కంటితో ఏడ్వడం జరగదు. ఇటువంటి కల్పనలతో చిత్రణ సాగిస్తే అది, నిజ జీవిత చిత్ర ణ అవుతుందా? ఇలాగైతే, ప్రతీ ఒక్కరి జీవితా న్నీ రకరకాల కల్పనలతో చూపించవచ్చు. ఈ 'మహానటి' విషయంలో జరిగింది, ఎక్కువ కల్ప నలతో నిండినట్టే కనపడుతుంది.

సావిత్రికి మద్రాసులో, గణేషన్‌తో పరిచ యం క్రమక్రమంగా పెరుగుతూ పోయింది. అతను, సావిత్రిని తన వెంట తిప్పుకుంటూ, గుర్రపు స్వారీ, కారు డ్రైవింగూ, బ్యాట్ ఆటా - వంటి సిటీ టెక్నిక్కులు నేర్పడం ప్రారంభించా డు. అతడు చాలా ఉత్తముడనీ, ఆమె క్షేమం కోసమే ఆమెకి అవన్నీ నేర్పుతున్నాడనీ, అతణ్ణి గురించి ప్రేక్షకులు అనుకునేవిధంగానే అతని పాత్ర చిత్రణ వుంటుంది. ఆ మద్రాసు ప్రపం చంలో, సావిత్రికి, ఆ గణేషన్ సహాయకారిగా, సన్నిహితుడిగా, అయ్యాడు. అతడి ప్రవర్తన సా విత్రిని బాగా ఆకర్షించింది. అతని వీపు మీదకి చిన్న పిల్ల లాగ ఎక్కి ఆనందించే స్థాయికి కూ డా ఆమె ఆకర్షణ పెరిగిపోయింది.అంత దశ వ రకూ చేరిన తర్వాత, గణేషన్ సావిత్రిని స ముద్ర తీరంలో కూర్చోబెట్టి, కొన్ని వాస్తవ విష యాలు సుతారంగా చెప్పాడు.అప్పటికి సావిత్రి 'దేవదాసు' సినిమాలో, పార్వతిగా నటిస్తూ వు ంది. పార్వతీ దేవదాసుల ప్రేమ గురించి వీళ్ల మధ్య మాటలు జరిగాయి మొదట. "దేవదాసు ఒక పెళ్లి జరిగినవాడైనా, అతణ్ణి పార్వతి కూడా పెళ్లి చేసుకుంటుంది. ఆమెకి ప్రేమ కదా?" అంటుంది సావిత్రి. అప్పుడు గణేషన్ నిర్భయ ంగా మొదలు పెట్టాడు. "సావిత్రీ! నేను పెళ్లి అయినవాడినే. కాలేజీలో చదివే రోజుల్లో, డబ్బు అవసరం కోసం, మా మేనమామ కూతుర్నే, అలివేలు మెడలో తాళి కట్టాను. ఆ తర్వాత పుష్పవల్లితో కూడా సంబంధం జరిగింది. కానీ అవేవీ ప్రేమలు కావు. నిజం ప్రేమ నీ తోనే సావిత్రీ!" అంటూ నిధానంగా చెప్పుకొచ్చాడు. సావిత్రి నిర్ఘాంతపోతూ చూసింది. అప్పటికి మౌనం వహించింది. ఆ తర్వాత అతనితో దూ రంగా వుండటం మొదలుపెట్టింది. అతను పల కరించబోతే తిరస్కరించేది.కానీ, ఒకసారి గణే షన్ మీద స్టుడియోలో ఏదో విరిగిపడి అతనికి యాక్సిడెంట్ జరగబోతూ తప్పింది. అక్కడే వు న్న సావిత్రి, అతని దగ్గిరికి పరిగెత్తి చూసి, త ర్వాత తప్పుకుంది. కానీ, ఆ తప్పుకోడం ఎన్నాళ్లో సాగలేదు. అతనే వెంటపడి 'ప్రేమ భాషణ' సాగించాడు. "నా ప్రేమ, నీ మీదే. నాకు ప్రేమే గానీ 'పెళ్లి' నచ్చదు. 'పెళ్లి'ని ఆటవిక కాలంలో మొదలు పెట్టారు. మనుషులు ఒకరికి ఒకరు వుంటే, పెళ్లం దుకు?" లాంటి మాటలు మాట్లా డాడు. "నేను లేకుండా నువ్వు వుండగలవా?" అన్నాడు. 'ఉండలేను' అన్నట్టే చూసింది. ఆ ప క్కనే ఏదో గుడి వుంటే, అక్కడ 'పసుపు కొమ్ము'తో కట్టి వున్న తాళ్లు వున్నాయి. మొగ వాడు, ఆడదాని మెడలో ఆ తాడు కడితే, అది 'పెళ్లే!' అది దంపతుల సంబంధమే!

ఆ పసుపుకొమ్ము తాడు సావిత్రికి కట్టాడు. ఆ తాడుని సావిత్రి, జాకెట్టు లోపలికి దాచు కుంది. సావిత్రికి తెలుసు, అతనికి ఇంకో ఇద్దరు స్త్రీలతో సంబంధాలు వున్నాయి - అని. అయి తే యేం? అవి, 'ప్రేమలు కావని' అతను చెప్పా డు కదా? వాళ్లతో వుండేది ప్రేమ లేని శారీరక సంబంధాలే, అంతే! అతని ప్రేమ అంతా తనదే కదా? - ఆ తాడు కట్టించుకున్న క్షణం నించీ ఆ తడితో సావిత్రికి ఆనంద విహారం! 'ఈ క్షణాలు ఎవరివీ కావు, నావే!' అని గాఢ నమ్మకం! ఈ గణేషన్, సావిత్రికి 'అద్భుత ఉత్తమ భర్త' అయి నట్టే, సినిమా అంతా నడుస్తుంది. అతనిలో 'కపటత్వం' ఏదీ ఎక్కడా కనపడదు. అసలు సినిమా మొదట్లో సావిత్రి జబ్బుతో స్పృహ తప్పి పడి వున్నప్పుడు, ఆ భర్త, తను ఎంత నిర్దోషినో అని ఘంటాపథంగా చెప్పుకున్నాడు. 'నన్ను అం దరూ అనుమానిస్తున్నారు. నా భార్యకి ఎంత వై ద్యమో చేయించాను' అనే రకం మాటలు గర్వా తిరేకంగా చెప్పుకున్నాడు. ఆ విషయం జరిగిన తర్వాత, దాని మీద సినిమాలో వ్యాఖ్యానాలేవీ చూపించలేదు. సినిమాలో, అతడు ఉత్తమ భర్తే. "భర్త, అంత ఉత్తముడైతే, అతనితో విడి పోవడానికి సావిత్రి ఏం కారణం చెప్పుకుని వుం టుంది?" అని ఒకటే సందేహం పట్టుకుంది న న్ను, వాళ్ల ఆనంద విహారాలు చూసిన క్షణం నించీ. అయితే, సావిత్రి తన పెళ్లి కబురు ఇంటి వాళ్లకి ఆ తాడు కట్టించుకున్ననాడే చెప్పలేదు. సినిమాలో వున్న ప్రకారం అయితే, రెండు మూ డేళ్లు గడిచాకే ఆ రహస్యం ఇంటి వాళ్లకి తెలి సింది. ఎలాగంటే, సావిత్రికి ఆ రహస్య భర్త పంపిన ఉత్తరం ఒకటి పెదనాన్న చేతుల్లో పడడం వల్ల. అందులో గణేషన్ ఏం రాశాడంటే, 'సావిత్రీ! నేను మీ ఇంటి ముందుకు వచ్చి రెండు సార్లు హారన్ కొడతాను. నువ్వు బైటికి రా' అని వుంది.అంటే, తమ కూతురు ఎవడి తోనో తప్పుడు తిరుగుళ్లు తిరుగుతోందని ఇం ట్లో వాళ్లు అనుకున్నారు. తల్లి కూతుర్ని లెంప మీద కొట్టింది. పెదనాన్న తెగ అరిచా డు.అప్పుడు సావిత్రి, జాకెట్టు లోపల దాచి వుంచిన పసుపుకొమ్ము తాడుని తీసి చూపించింది. తాము భార్యాభర్తలమే- అని ప్రకటించింది.

పెదనాన్న అగ్నిహోత్రం అయిపోయాడు. "పెళ్లాం వున్నవాణ్ణి పెళ్లి చేసుకుంటావా?" అని తుపాకీ తీశాడు. "దీన్ని కొత్తగా కొన్నాను. దీని తో అవసరం అప్పుడే వస్తుందనుకోలేదు. వాణ్ణి 'పేల్చేస్తాను" అన్నాడు. సావిత్రిని అక్కడే ఒక గదిలోకి తోసేసి, త లుపులు మూసేశాడు. గదిలో పడ్డ సావిత్రి కాసేపు తలుపులు బాదుతూ ఏ డ్చి, తర్వాత గదిలోవున్న కిటి కిలో నించి బాల్క నీలోకి దిగి, అక్కడి నించి కిందకి దూకి, భోరున కురుస్తూ వున్న వర్షంలో తడుస్తూ, భర్తగారి ఇం టికి పరిగెత్తింది. సావిత్రి నిజ జీవితంలో ఇలాగే జరిగిందా - అనే సందేహం అక్కరలేదు. ఇద ంతా సినిమా కల్పన. పెదనాన్న కోపాన్ని చూపించే కల్పన. సావిత్రి ఏడుస్తూ, భర్తగారి గుమ్మం ముందు నిలబడితే, అదే భర్తగారి మొదటి భార్యే తలుపులు తీసి, ఈమెని ఆదరంగా చూసింది. అంతలో, ఆ భర్త కూడా లోపల్నించి అక్కడికి వచ్చాడు. ఆ మొదటి భా ర్యకి, భర్తగారి కొత్త ప్రేమ సంగతి మొదటి నించీ తెలి సిందే అనుకోవచ్చు. ఎందుకంటే, ఆ మొదటి భార్య, ఈ ఏడ్చే భార్యని లోపలికి రమ్మని పిల్చి, "ఇప్పుడేడ్చేం లాభం?" అంటుంది. అంటే, ఆ మెకి తెలిసి వున్నట్టే. ఏడ్చే భార్యకి, ఆమె టీ కూడా ఇస్తుంది, "టీ తాగి, మొహం కడుక్కో" అంది కూడా. ఆ భర్త, ఏడ్చే భార్య పక్కన కూర్చుని, "నేనే వచ్చి మీ వాళ్లతో చెప్పాలనుకున్నాను. నా అవసరం తీరింది. ఇ ంత అందగత్తెని ఎవరో ఎత్తుకుపోతే మీ వాళ్లకి కోపం రాదా మరి?" అన్నాడు. ఆ మాటలు మొదటి భార్య వింటూనే వుంటుందని అతడికి తెలుసు. ఆవిడ ము ందు ఇంకో ఆడదాన్ని 'అందగత్తె' అని పొగడడం! అ ంత ఉత్తముడు ఆ పురుషుడు! తర్వాత చె ప్పుకోవలిసిన విషయం, ఆ పురుషుడు, నడి రోడ్డులో ఒక వాహనం టాపు మీద ఎక్కి, "సోదర సోదరీ మణులారా! అందరూ వినండి! నేను జెమినీ గణేషన్‌ని. అదుగో, ఆ అందగత్తెని చూడండి! ఆమె సావిత్రి. ఆమెని నేను పెళ్లి చేసుకున్నాను. ఇప్పుడు ఆమె సావిత్రీ గణేషన్" అంటూ అరుపులతో ప్రకటించాడు.

తర్వాత, చక్రపాణి అనే సినిమా పెద్ద మనిషి, ఆ దంపతుల్ని వెంటబెట్టుకుని, సావిత్రి పెదనాన్న దగ్గిరికి తెచ్చాడు, అతణ్ణి శాంతపరచాలని. పెదనాన్న, "భార్యాబిడ్డలు వున్నవాణ్ణి పెళ్లి చేసుకుంటుందా?" అన్నాడు. అప్పుడు చక్రపాణి పాత్రధారి, "పెళ్లి లేకుండా రహస్య సంబంధాలతో వుండవచ్చా?" అన్నాడు, తన గొప్ప తర్కంతో. "అలా వుండవచ్చని నేను అంటున్నానా?" అనలేదు పెదనాన్న. చక్రపాణిగారి గొప్ప తర్కానికి నోరు మూసేసినట్టు మౌనం వహించాడు పెదనాన్న.అయినా, సావిత్రిని వదిలేసి, పెదనాన్నా వాళ్లు తమ వూరు వెళ్లిపోయారు. సావిత్రికి సినిమాల ఛాన్సులు పెరిగిపోతున్నాయి. ఆదాయం పెరిగిపోతోంది. ఆమె చేసే దాన ధర్మాలు కూడా పెరిగిపోతున్నాయి. గణేషన్ కూడా సినిమా హీరో అవుతున్నాడు. ఇద్దరూ ఒకే సినిమాలో వేసే సందర్భాలు కూడా వస్తున్నాయి. సావిత్రికి కూతురూ కొడుకూ కలిగారు. ఆ తల్లీ పిల్లల సంబంధాల గురించి, సినిమాలో ఎక్కడా తగిన దశ్యాలు లేవు.

(తరువాయి భాగం గురువారం సంచికలో)



షో

**పార్క్ షిన్ హై..**


**అందం, అభినయంతో అందరినీ అలరిస్తున్న దక్షిణ కొరియా స్టార్ హీరోయిన్. భిన్న పాత్రలతో వెండితెర ప్రేక్షకులను, వైవిధ్యమైన సిరీస్‌లతో బుల్లితెర ప్రేక్షకులను ఫిదా చేసిన కథానాయిక. అలాగే అత్యద్భుత గానంతో శ్రోతల్ని సైతం మెస్మరైజ్ చేసిన గాయని కూడా. గాయనిగా కెరీర్ ప్రారంభించి క్రేజీ కథానాయికగా ముఖ్యంగా భిన్న ప్రేమకథా చిత్రాల హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న పార్క్ షిన్ హై గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో..**

# భిన్న ప్రేమకథా చిత్రాల క్రేజీ కథానాయిక














## గాయనిగా ప్రస్థానం షురూ..

పార్క్ షిన్ హై.. 1990, ఫిబ్రవరి 18న సౌత్ కొరియాలోని గ్వాంజియు పట్టణంలో జన్మించినప్పటికీ సియోల్‌లో పెరిగారు. ప్రముఖ గిటారిస్ట్, కంపోజర్ పార్క్ షిన్ వాన్ తనకి సోదరుడు. యంగ్వా గర్ల్స్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేట్ చేశారు. చంగ్ అంగ్ యూనివర్సిటీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. 2016లో థియేటర్‌లో డిగ్రీ పూర్తి చేశారు. యూనివర్సిటీలో ఆర్టిస్ట్ అంబాసిడర్‌గా పనిచేసినందుకు సర్వీస్ అవార్డు అందుకున్నారు. పార్క్‌కి చిన్నప్పట్నుంచి సంగీతంపై ఆసక్తి ఉండేది. గాయనీగా రాణించాలనుకున్నారు. ప్రైవేట్ ఇనిస్టిట్యూట్ ఇంగ్లీష్ టీచర్ సలహా మేరకు పాప్ సింగ్ లీ సీయంగ్ హ్వాన్ (డ్రీమ్ ఫ్యాక్టరీ)కి గాయనిగా ఇచ్చిన ఆడిషన్‌లో ఎంపికయ్యారు. తొలి ప్రయత్నంగా మ్యూజిక్ వీడియో 'ఫ్లవర్'లో నటించారు. ఆ తర్వాత నటన, సింగింగ్, డాన్సింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. గిటార్, కీబోర్డ్ కూడా నేర్చుకుని ప్రొఫెషనల్‌గా తయారయ్యారు.

## నటిగా పదేండ్లకి దక్కిన తొలి బ్రేక్..

2003లో పార్క్ సినిమాల్లోకి అడుగుపెట్టారు. ఆ ఏడాది వచ్చిన 'స్టైర్వే టు హెవెన్' టెలివిజన్ సిరీస్‌తో నటిగా మారారు. ఇందులో హీరోయిన్‌కి యంగర్ వెర్షన్ పాత్రలో కనిపించారు. ఆ తర్వాత 'ట్రీ ఆఫ్ హెవెన్' అనే టెలివిజన్ సిరీస్‌లో పూర్తి స్థాయి నాయికగా నటించారు. ఇందులోని నటనకు విశేష ప్రశంసలు దక్కాయి. ఈ టెలివిజన్ సిరీస్ జపాన్‌లోనూ ప్రసారం కావడంతో అక్కడి ప్రేక్షకులకి కూడా బాగా దగ్గరయ్యారు. 2006లో సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తూ 'లవ్ ఫోబియా'లో చిన్న పాత్రలో కనిపించారు. పెద్దగా గుర్తింపు లేని పాత్ర కావడంతో ఆశించిన పేరు రాలేదు. పూర్తి స్థాయి కథానాయికగా 2007లో వచ్చిన సినిమా 'ఎవిల్ ట్విన్'లో నటించారు. హర్రర్ ప్రధానంగా కిమ్ జి వాన్ దర్శకతంలో రూపొందిన ఈ సినిమాలో మెయిన్ రోల్ పోషించడం ఓ విశేషమైతే. ద్విపాత్రాభినయం చేయడం మరో విశేషం. ఇందులో దెయ్యంగా భయానక పాత్రలో నటించి ప్రేక్షకుల్ని ఫిదా చేశారు. ఈ సినిమా నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అయితే అప్పటికే పలు టెలివిజన్ కమిట్‌మెంట్స్‌తో దాదాపు మూడేండ్లు సినిమాలకు దూరంగా ఉన్నారు. 2010లో లో బడ్జెట్ చిత్రం 'సైరానో ఏజెన్సీ'లో నటించారు. క్రిటికల్‌గా, కమర్షియల్‌గా విజయం సాధించింది. ఇందులోని నటనకి సైతం విశేష ప్రశంసలు దక్కాయి. అంతేకాదు బీక్సాంగ్ అవార్డు కూడా వరించింది. అదే ఏడాది యానిమేషన్ చిత్రం 'గ్రీన్ డేస్: డైనోసార్ అండ్ ఐ'లో ఓ పాత్రకి వాయిస్ అందించారు. మరో రెండేండ్ల గ్యాప్‌తో లఘు చిత్రం 'వెయిటింగ్ ఫర్ జాంగ్ జూన్ హాన్'లో నటించారు. 2013లో ఆమె నటించిన 'మిరాకిల్ ఇన్ సెల్ నెం.7'తో సినిమా కెరీర్‌లో తొలి బ్రేక్ అందుకున్నారు. పలు అవార్డులని దక్కించుకున్నారు. తను చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి పదేండ్లు అవుతున్న సందర్భంగా ఇంతటి విజయం దక్కడంతో అమితానందాన్ని పొందారు. ఆ సమయంలో తను 'ఆసియా టూర్: కిస్ ఆఫ్ ఏంజెల్' పేరుతో టూర్ నిర్వహించారు. ఆసియా మొత్తం టూర్ చేపట్టిన ఏకైక కథానాయికగా పార్క్ రికార్డు సృష్టించారు. 'వన్ పర్‌ఫెక్ట్ డే' అనే లఘు చిత్రంలోనూ నటించి తన అభిరుచిని చాటుకున్నారు. 2014లో హిస్టారికల్ చిత్రం 'ది రాయల్ ట్రైలర్'లో క్వీన్‌గా మెప్పించారు. ఇది ఘన విజయం సాధించింది. ఆ తర్వాత 'ది బ్యూటీ ఇన్‌సైడ్'లో గెస్ట్‌గా ఆకట్టుకున్నారు. 2016లో నటించిన 'మై అన్నోయింగ్ బ్రదర్', 2017లో 'హార్ట్ బ్లాకెన్డ్' చిత్రాలతో మంచి హిట్స్ అందుకుని తిరుగులేని స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ప్రస్తుతం 'కాల్' చిత్రంలో నటిస్తున్నారు.

## బుల్లితెర క్రేజీ కథానాయిక..

పార్క్ షిన్ కెరీర్ టెలివిజన్స్ నుంచే ప్రారంభమైంది. నిజం చెప్పాలంటే పార్క్ సినిమాల్లో కంటే టీవీ రంగంలోనే బాగా పాపులర్ అయ్యారు. స్టార్ ఇమేజ్ తెచ్చుకున్నారు. అత్యంత క్రేజీ స్టార్‌గా ఎదగడానికి టెలివిజన్ రంగమే ఎంతో దోహదపడింది. ఆమె నటించిన తొలి టెలివిజన్ 'స్టైర్వే టు హెవెన్'. ఆ తర్వాత 'నాన్‌స్టాప్4'లో నటించారు. 2006లో చేసిన 'సియోల్ 1945', 'ట్రీ ఆఫ్ హెవెన్' టెలివిజన్స్ సిరీస్‌లు టీవీ రంగంలో బ్రేక్‌నిచ్చాయి. బుల్లితెర ప్రేక్షకులకి దగ్గర చేశాయి. ఓ వైపు సినిమాలు చేస్తూనే సాధ్యమైనంత వరకు టెలివిజన్ సిరీస్‌లకి ప్రాధాన్యతనిచ్చారు. 2007లో ఆమె నటించిన 'ప్రిన్స్ హవర్స్' బాగా రన్ అయ్యింది. ఇందులో పార్క్ తనదైన నటనతో మంత్రముగ్ధుల్ని చేశారు. అదే ఏడాది 'కిమ్‌చీడ్ రాడిష్ క్యూబ్స్' టీవీ సిరీస్ మంచి గుర్తింపునిచ్చింది. రొమాంటిక్ కామెడీ మ్యూజిక్ డ్రామా 'యూ ఆర్ బ్యూటిఫుల్', మెలో డ్రామా 'హార్ట్ స్ట్రింగ్స్', తైవాన్‌లోకి ఎంట్రీ ఇచ్చి నటించిన 'హయేట్ ది కాంబ్యాట్ బట్లర్' వంటి సిరీస్‌లు నటిగా పార్క్‌ని టీవీ రంగంలో మంచి స్థానంలో నిలబెట్టాయి. బుల్లితెర క్రేజీ కథానాయికని చేశాయి. 2013లో నటించిన టెలివిజన్ రొమాంటిక్ కామెడీ 'మై క్యూట్ గాయ్స్' తన కెరీర్‌లో భారీ బ్రేక్‌నిచ్చింది. తర్వాత 'ది కింగ్ ఆఫ్ డ్రామాస్', 'ఫేబుల్ బాయ్స్', 'ది హెయిర్స్', 'పినోచ్చియో', 'ఎంటర్‌టైనర్', 'గాఫ్, ది స్టార్రీ నైట్', 'ది డాక్టర్స్', 'టెంపరేచర్ ఆఫ్ లవ్', 'మెమరీస్ ఆఫ్ అల్హాంబ్రా' వంటి విజయవంతమైన టెలివిజన్ సిరీస్‌లో నటించి అగ్ర స్థానానికి ఎదిగారు. ప్రస్తుతం కొరియన్ సినిమా రంగంలోనే కాదు, టెలివిజన్ లోనూ అత్యంత క్రేజీ స్టార్‌గా పార్క్ రాణిస్తున్నారు. వీటితోపాటు 'లిటిల్ క్యాబిన్ ఇన్ ది వూడ్స్' అనే టెలివిజన్ షోలోనూ నటించారు. అలాగే నాలుగు డాక్యుమెంటరీల్లో నటించారు. ఎంబీసీ ఛానెల్‌లో ప్రసారమైన 'ఫాంటాస్టిక్ పార్ట్‌నర్', 'మెలోన్ మ్యూజిక్ అవార్డు' షోలకి, ఎస్‌బీఎస్‌లో వచ్చే'గయా డీజీయాన్', 'డ్రామా అవార్డుల' షోస్‌కి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## శ్రోతల్ని మెస్మరైజ్ చేసిన గాయని..

పార్క్ క్రేజీ నటి మాత్రమే కాదు, అద్భుతమైన గాత్రంతో శ్రోతలని మెస్మరైజ్ చేసిన గాయని కూడా. తను నటించిన పలు సినిమాల్లో పాటలు ఆలపించడంతోపాటు నోటెడ్ ఆల్బమ్స్‌లోనూ పాటలు పాడి ప్రపంచ శ్రోతలని అలరించారు. 'ట్రీ ఆఫ్ హెవెన్' చిత్ర ఆల్బమ్‌లో 'లవ్ రెయిన్', 'యు ఆర్ బ్యూటిఫుల్' ఆల్బమ్‌లో 'లవ్లీ డే..', 'వితౌట్ ఏ వర్డ్..', 'సైరానో ఏజెన్సీ' ఆల్బమ్‌లో 'ఇట్ వాజ్ యు', 'హార్ట్‌స్ట్రింగ్స్'లో 'ది డే వి ఫాల్ ఇన్ లవ్..', 'ఐ విల్ ఫర్‌గెట్ యు'లో పాటలు పాడారు. 'మై క్యూట్ గాయ్స్'లో 'పిచ్ బ్లాక్', 'ది హైర్స్'లో 'స్టోరీ..' సాంగ్‌ని, 'మై డియర్'లో టైటిల్ సాంగ్‌ని, 'పినోచ్చియో'లో 'లవ్ ఈజ్ లైక్ స్నో..', 'డ్రీమింగ్ ఏ డ్రీమ్..' పాటలను ఆలపించి సింగర్‌గానూ పాపులరై శ్రోతల హృదయాల్లో చోటు సంపాదించారు. వీటితోపాటు పలు మ్యూజికల్ వీడియోస్‌లోనూ పాటలు పాడారు. అందులో 'ఫ్లవర్', 'ఐ ఆస్క్ మై సెల్ఫ్', 'ఫేక్ లవ్ సాంగ్', 'లెటర్', 'కాల్ మీ', 'సూపర్ స్టార్', 'ఎలోన్ ఇన్ లవ్', 'ఆర్ నాట్ ఫ్రెండ్స్', 'ఎరేజర్', 'ఇన్‌సెన్సిబుల్', 'విష్' వీడియో సాంగ్స్ ప్రధానంగా ఉన్నాయి. 'మై డియర్', 'యు ఆర్ సో బ్యూటిఫుల్'లో పాటలు పాడటంతోపాటు నటించారు. 2013లో నటుడు, సింగ్ సో జి సబ్‌తో కలిసి 'టూక్లాక్..ప్లేగ్రౌండ్' ఆల్బమ్ కోసం 'ఎరేజర్' మ్యూజిక్ వీడియోలో నటించారు. నటిగా, గాయనిగా అటు ప్రేక్షకుల్ని, ఇటు శ్రోతల్ని మెప్పించి ఆల్‌రౌండర్‌గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు.

## అవార్డులు..సామాజిక సేవా కార్యక్రమాలు..

'మిరాకిల్ ఇన్ సెల్ నెం.7', 'సైరానో ఏజెన్సీ', 'ది రాయల్ టైలర్' చిత్రాల్లో తన నటనకిగానూ బీక్‌సాంగ్ ఆర్ట్స్ అవార్డ్స్‌ని అందుకున్నారు. 'మిరాకిల్ ఇన్ సెల్ నెం.7'లో తన పాత్రకి కొరియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిల్మ్ క్రిటిక్స్ అవార్డుని, బుచియాన్ అంతర్జాతీయ ఫెంటాస్టిక్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు వరించింది. టెలివిజన్‌లో మొత్తంగా 24 ప్రతిష్టాత్మక అవార్డులని దక్కించుకుని రికార్డ్ క్రియేట్ చేశారు. ఓ పక్క నటిస్తూనే మరో పక్క సేవా కార్యక్రమాల్లోనూ పార్క్ చురుగ్గా పాల్గొన్నారు. 2011లో చిన్న పిల్లలని ఆదుకునేందుకు స్టార్‌లైట్ ఏంజెల్ ప్రాజెక్ట్ చేపట్టారు. 2009లో 'సిన్షైన్ సెంటర్' పేరుతో గానాలో లైబ్రరీని, ఆడియో విజువల్ హాల్‌ని ఏర్పాటు చేశారు. దీంతోపాటు 2016లో మనిలా, ఫిలిప్పిన్స్‌లోనూ లైబ్రరీ, ఆడియో విజువల్‌ని ఏర్పాటుకి కృషి చేశారు. కొరియా ఫుడ్ ఫర్ ది హంగ్రీ ఇంటర్నేషనల్ ఫిలాంత్రఫీ క్లబ్‌కి 85 వేల డాలర్లు విరాళంగా అందించారు. ఇవే కాకుండా హోప్స్, హ్యాపీ ట్రిప్ టు కొరియా వంటి ఛారిటబుల్ కార్యక్రమాలకు తన వంతు సాయం చేశారు. అలాగే గుడ్ ఫ్రెండ్స్ సేవ్ చిల్డ్రన్, లవ్లీ హ్యాండ్ క్యాంపెయిన్ వంటి వాటి ఫండ్ రైజింగ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. దీంతోపాటు గతేడాది ఫైరింగ్ డిపార్ట్‌మెంట్‌కి ఫైర్ రిటార్డాంట్ క్లాత్స్‌ని శుభ్రం చేసేందుకు 20 వాషింగ్ మిషన్స్‌ని డొనేట్ చేశారు. దీంతోపాటు పలు ఫెస్టివల్స్‌కి, ఈవెంట్స్‌కి అంబాసిడర్‌గానూ పనిచేశారు.

## ప్రేక్షకుల్ని ఫిదా చేసిన పాత్రలు

ప్రస్తుతం సౌత్ కొరియా చిత్ర పరిశ్రమలో అత్యంత క్రేజీ స్టార్‌గా, యువతరం కలల రాణిగా రాణిస్తున్న పార్క్ ఎక్కువగా రొమాంటిక్ లవ్ స్టోరీ చిత్రాల్లో నటించి మెప్పించారు. ఆమె కెరీర్ టీవీ రంగం నుంచే ప్రారంభమైనా సినిమాల్లోనూ భిన్న పాత్రలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఆమె నటిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'లవ్ ఫోబియా'. రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాలో కీలక పాత్రలో పార్క్ నటించారు. ఇక పూర్తి స్థాయి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఎవిల్ ట్విన్'. ఓ ప్రమాదం కారణంగా ఇద్దరు కవల బాలికల్లో ఒకరు చనిపోతే, మరొకరు కోమాలోకి వెళతారు. 10 ఏండ్ల తర్వాత కోమా ఆ బాలిక బయట పడుతుంది. కానీ ఈ క్రమంలో ఎంతో మంది ప్రాణాలు పోతాయి. అందుకు కారణం ఎవరు?, దెయ్యంగా మారి వెంటాడుతున్న మరో అమ్మాయి ఎవరనేది సినిమాలో ఆసక్తికరం. ఇందులో కవలల పాత్రల్లో పార్క్ నటించి ఆకట్టుకున్నారు. దెయ్యంగా ఆమె ప్రదర్శించిన నటన సినిమాకి హైలైట్‌గా నిలిచింది. తమకి నచ్చిన అమ్మాయిని, లేక అబ్బాయిని ప్రేమలో పడేసేందుకు ఇబ్బంది పడుతున్న యువతకి ప్రేమలోని మెళకువలను నేర్పేందుకు ఓ సంస్థ ఏర్పడుతుంది. వారికి టెక్నిక్స్ నేర్పించి ప్రేమని సఫలం చేసే క్రమంలో చోటు చేసుకున్న ఆసక్తికర సంఘటనల సమాహారంగా రూపొందిన రొమాంటిక్ లవ్ స్టోరీ 'సైరానో ఏజెన్సీ. ఇందులో ప్రేమికులకు ట్రైనింగ్ ఇచ్చే సంస్థ 'సైరానో ఏజెన్సీ'లో ట్రైన్ చేసే అమ్మాయిగా పార్క్ తనదైన మెచ్యూర్డ్ నటనతో ప్రేక్షకుల్ని మెప్పించారు.



ఓ మర్డర్ కేసు, రేప్ కేసుతో శిక్ష పడి జైల్లో ఉన్న మతిస్థిమితంలేని తండ్రికి, అతని కూతురికి మధ్య ఉన్న అనుబంధం నేపథ్యంలో కామెడీ డ్రామాగా రూపొందిన చిత్రం 'మిరాకిల్ ఇన్ సెల్ నెంబర్ 7'. ఇందులో మతిస్థిమితం కోల్పోయిన తండ్రికి కూతురిగా అడల్ట్ పాత్రలో, కిడ్నాప్ చెర నుంచి బయటపడ్డ ఇన్నోసెంట్ అమ్మాయిగా పార్క్ నటన కట్టిపడేస్తుంది. ఇద్దరు మోడ్రన్ టైలర్స్ రాజకుమారుడు, రాజకుమారిలకీ నవ్యమైన రాజదుస్తులు డిజైన్ చేస్తూ మన్ననలు పొందుతుంటారు. ఈ క్రమంలో ఓ యువ టైలర్ రాజకుమారి మెప్పుపొందుతాడు. కానీ దీని వెనుక ఇద్దరు మహిళల మధ్య ఓ అంతర్యుద్ధమే జరుగుతుంది. ఆ అంతర్యుద్ధమేంటి అనే ఆసక్తికర కథాంశంతో 'ది రాయల్ టైలర్' చిత్రం రూపొందింది. ఆద్యంతం నాటకీయంగా తెరకెక్కిన ఈ సినిమాలో రాణిగా పార్క్ నటన మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఓ ఫర్నీచర్ డిజైనర్ ప్రతి రోజు ఉదయం ఒక్కో శరీరాకృతితో నిద్ర లేస్తుంటాడు. ఓ రోజు యువకుడిగా, మరో రోజు అమ్మాయిగా, మరో రోజు వృద్ధుడిగా, ఇలా విభిన్న దేహాలతో అందరిని ఆశ్చర్య పరుస్తున్న అతన్ని ఓ అమ్మాయి ప్రేమిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందనే ఇతివృత్తంతో రూపొందిన రొమాంటిక్ డ్రామా 'ది బ్యూటీ ఇన్‌సైడ్'లో ఓ విభిన్న పాత్రలో అతిథిగా మెరిశారు.

వ్యక్తిగత ఘర్షణల కారణంగా అన్నదమ్ములు విడిపోతారు. తమ్ముడు జ్యూడో ప్లేయర్. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నప్పుడు గాయమై శాశ్వతంగా కంటిచూపుని కోల్పోతాడు. దీన్ని అడ్వాంటేజ్‌గా తీసుకోవాలని విడిపోయిన అన్న భావిస్తాడు. అయితే తనకి కాన్సర్ లాస్ట్ స్టేజ్‌లో ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో తమ్ముడిని రియో ఒలింపిక్స్‌లో ఛాంపియన్‌గా నిలపడం కోసం అన్న పడే స్ట్రగుల్స్ నేపథ్యంలో రూపొందిన కామెడీ డ్రామా 'మై అన్నోయింగ్ బ్రదర్'. ఇందులో అథ్లెట్‌కి ప్రియురాలిగా తనదైన అందం, అభినయంతో పార్క్ మెప్పించారు. సంపన్న వ్యాపారవేత్త కుమార్తె ఓ మర్డర్ కేసులో ఇరుక్కుంటుంది. దాన్నుంచి బయటపడేందుకు జరిగే న్యాయ పోరాటం, ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగే క్రైమ్ డ్రామా 'హార్ట్ బ్రోకెన్డ్' చిత్రంలో హత్య కేసులో ఇరుక్కున అమ్మాయిగా పార్క్ తన నట విశ్వరూపం చూపించారు. ఓ చెడ్డ అబ్బాయికి మంచి అమ్మాయి ప్రేమలో పడితే ఎలా ఉంటుందనే కథాంశంతో రొమాంటిక్ కామెడీగా తెరకెక్కిన షార్ట్ ఫిల్మ్ 'వన్ పర్‌ఫెక్ట్ డే'లో ప్రియురాలి పాత్రలో పార్క్ అలరించారు.












# యువత భుజం భుజం కలిపితేనే అభివృద్ధి

- జాగృతి అంటేనే మేలుకొలుపు : గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్
- మూడో ప్రపంచ యుద్ధమొస్తే అది నీటితోనే : రాజేంద్రసింగ్
- జాగృతి శిక్షణ ద్వారా 15వేల మందికి ఉపాధి కల్పన : కవిత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యువత భుజం భుజం కలిపితేనే అభివృద్ధి సాధ్యమని, యువ శక్తి అన్న పదంలో మహిళా శక్తి కూడా దాగి ఉందని, యువతీయువకులు ప్రపంచానికి మార్గదర్శకులుగా ఉండాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తొలిగినప్పుడే సమ్మిళిత వృద్ధి సాధ్యమన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు సభలో తెలంగాణ జాగృతి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును రాజేంద్రసింగ్‌కు, యూత్ అచీవ్‌మెంట్ అవార్డులను మాలావత్ పూర్ణ, బబితా పోగట్‌కు గవర్నర్ నరసింహన్, ఎంపీ కవిత అందజేశారు. అనంతరం సభనుద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ..జాగృతి అంటేనే మేలుకొలుపు అని, గ్లోబల్ నెట్వర్క్ ఆఫ్ యూత్ కోసం జాగృతి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. యువతలో ఓపిక, సంహనం తక్కువ అని, ఆ రెండింటినీ అలవర్చుకుంటే ఏదైనా సాధించగలని నొక్కిచెప్పారు. నాణ్యమైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. స్త్రీలకు చదువు, ఉద్యోగం, మంచి జీవితం దక్కినప్పుడే మహిళా సాధికారత సాధ్యమన్నారు. గాంధీ చూపిన అహింసా మార్గంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విపరీత మైనింగ్ వల్ల అటవీ సంపద రోజురోజుకీ తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని, జీవరాశులను కాపాడటం మన సంస్కృతిలో భాగమన్నారు. చెట్లను నాటడంతో పాటు వాటి సంరక్షణా చర్యలను యువత తీసుకోవాలని సూచించారు. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా బిరుదాంకితుడు, తెలంగాణ జాగృతి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ...మూడో ప్రపంచ యుద్ధం కనుక వస్తే అది నీటి వల్లనే వస్తుందన్నారు. ఇప్పటికే ఆఫ్రికా, సెంట్రల్ ఆసియా దేశాలు ఇప్పటికే నీటి సమస్యతో అల్లాడుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వనరులను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. నదులు కాలగర్భంలో కలిసిపోయి రాజస్థాన్ ఎడారిగా మారిందన్నారు. రాజస్థాన్ ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక చెక్‌డ్యామ్ నిర్మాణంతో భూగర్భజలాలు పెరిగాయన్నారు. నీటి వనరుల వాడకంపై ఎప్పటికప్పుడు ప్రజలనుచైతన్యం చేస్తున్నామన్నారు. ఇష్టమొచ్చినట్టు ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తూ పోతే వాతావరణ సంక్షోభం నెలకొంటుందని హెచ్చరించారు.

**మహిళల అభివృద్ధికి పురుషులు సహకరించాలి : ఎంపీ కవిత**

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఎదిగేందుకు పురుషులు సహకరించాలని ఎంపీ కవిత కోరారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో అర్థవంతంగా చర్చ జరిగిందన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి, ఉద్యోగాలు నిర్వహించే ఉద్దేశ్యంతో తెలంగాణ జాగృతి పనిచేస్తున్నదని వివరించారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ సెంటర్‌ను గతంలో గవర్నర్ నరసింహన్ ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికే తెలంగాణలోని 19,000 మందికి నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చామని, అందులో 15,000 మందికి ఉపాధి అవకాశాలను కూడా కల్పించాలని వివరించారు. 2030 వరకల్లా సుస్థిర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఇక నుంచి ప్రతి రెండేండ్లకోసారి కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, ముందే కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేలా ముందుకెళ్తామని చెప్పారు.

**రోల్‌మోడల్, స్ఫూర్తి నాన్నే : బబితా పోగట్**

ఉదయం జరిగిన సెషనల్‌లో భారత రెజ్లర్ బబితా ప్రొగట్ మాట్లాడుతూ..కరణం మల్లీశ్వరి ఒలింపిక్ పతకం తెచ్చినప్పుడే తమలో ఆలోచన మొదలైందన్నారు. తమకు రోల్‌మోడల్, స్ఫూర్తి నాన్నేనని, సినిమాలో చూపించి దానికన్నా తమ తండ్రి కఠిన శిక్షణ ఇచ్చాడని గుర్తించారు. నాన్న సంకల్పమే తమను ఈ స్థాయికి తీసుకొచ్చిందన్నారు.

**ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆటలు భాగస్వామ్యం కావాలి : మాలోత్ పూర్ణ**

పిన్నవయస్సులోనే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ఐఏఎస్ ఆర్వీఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రోత్సాహంతో ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆటలు భాగం కావాలని ఆకాంక్షించారు. ఆటలు ఆరోగ్యంతో పాటు జీవితాన్ని కూడా ఇస్తాయని, అది తన విషయంలో జరిగిందని చెప్పారు. కొండలు ఎక్కేటప్పుడు తొలి అడుగు భయంతో మొదలైందని, శిక్షణ పూర్తి అయ్యేసరికి తనలో పూర్తి ఆత్మవిశ్వాసం నెలకొన్నదని అన్నారు. నా ఎదుగుదలలో కోచ్ పాత్ర మరువలేనిదన్నారు. ఇక్కడితో తన ప్రయాణాన్ని ఆపబోనని, ప్రపంచంలోని అన్ని ఎత్తైన శిఖరాలను అధిరోహించడమేతన సంకల్పం అని అన్నారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని చెప్పారు.

**క్రీడలకు అధిక నిధులు కేటాయించాలి : పుల్లెంల గోపీచంద్**

బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెంల గోపీచంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు క్రీడలకు అధిక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పౌరులకు ఫిజికల్ లిటరసీని కల్పించాలని కోరారు. ఆట వ్యక్తికి, సమాజానికి పేరు తెచ్చిపెడుతుందన్నారు.

# 36 జెట్లకు.. 50 శాతానికి పైగా చెల్లింపులు

(మొదటిపేజీ తరువాయి)

వినియోగంలోకి వచ్చేది మాత్రం 2022 సెప్టెంబర్-అక్టోబర్ వరకల్లా. అంటే చివరి విడత జెట్లు అందిన తర్వాత ఆరు నెలలపాటు సాఫ్ట్‌వేర్ ధ్రువీకరణకు సమయం పట్టనున్నట్టు చెబుతున్నారు. 36 రాఫెల్ జెట్లకు 13రకాల ప్రత్యేక పరికరాలను అమర్చనున్నారు. భారత వై మానిక దళం(ఐఏఎఫ్) వీటిని వినియోగించనున్నది. మొద టివిడత జెట్లు అందిన తర్వాత ఐఏఎఫ్‌నకు చెందిన 10 మంది పైలట్లు, 10మంది వైమానిక ఇంజినీర్లు, 40 మంది సాంకేతిక నిపుణులు ఫ్రాన్స్‌లో శిక్షణ తీసుకోనున్నారు.

రాఫెల్ జెట్ల కోసం హర్యానాలోని అంబాలా, బెంగాల్‌లోని హసిమారా వద్ద వైమానిక స్థావరాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.450 కోట్లు ఖర్చు కానున్నట్టు అంచనా. ఒక్కో స్థావరం వద్ద రెండు స్క్వాడ్రన్ల జెట్లకు వసతి ఏర్పాటు చేస్తున్నారు. అయితే, ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేస్తున్నది రెండు స్క్వాడ్రన్లు మాత్రమే కావడంతో ఒక్కో స్థావరంలో ఒకటి చొప్పున మోహరించనున్నారు. 18 యుద్ధ విమానాలను ఒక స్క్వాడ్రన్‌గా పరిగణిస్తారన్నది గమనార్హం. ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకునే స్క్వాడ్రన్లను చైనా సరిహద్దున ఒకటి, పాకిస్థాన్ సరిహద్దున ఒకటి చొప్పున మోహరించనున్నారు. సరిహద్దులో రక్షణకు ఐఏఎఫ్ ప్రణాళిక ప్రకారం 42 స్క్వాడ్రన్లు అవసరం. కాగా, ఇప్పుడు అందుబాటులో ఉన్నది 31 స్క్వాడ్రన్లు మాత్రమే. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 126 రాఫెలు జెట్ల(7 స్క్వాడ్రన్ల) కొనుగోలుకు ఫ్రాన్స్‌తో సంప్రదింపులు జరపగా, ఇప్పుడవి 36 జెట్ల(2 స్క్వాడ్రన్ల)కు తగ్గాయి.

మరోవైపు మోడీ ప్రభుత్వం రాఫెల్ జెట్ల కోసం మూడు రెట్లు అధిక ధర చెల్లిస్తున్నట్టు ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ ఒప్పందం వల్ల దాదాపు రూ.30,000 కోట్లమేర దేశ ఖజానాకు నష్టమని వారు చెబుతున్నారు.

**రాఫెల్‌పైనే మోడీ సర్కార్‌కు మక్కువ ఎందుకు..? 20 శాతం తక్కువ ధరతో వచ్చిన యూరో ఫైటర్ ఆఫర్‌ను ఎందుకు కాదన్నారు..?**

రాఫెల్‌కు పోటీగా మెరుగైన సామర్థ్యమున్న యూరోఫైటర్ జెట్లను ఇచ్చేందుకు ఆ కంపెనీ కన్సార్టియం నుంచి భారత ప్రభుత్వానికి ఆఫర్ వచ్చింది. (యూరో ఫైటర్ జెట్ల ప్రధాన కార్యాలయం జర్మనీలో ఉన్నది).. 2009 నుంచి 2011 వరకు యూరో ఫైటర్ జెట్ల వాడకం, వాటిలో వినియోగించిన సాంకేతికతపై మూల్యాంకనాన్ని కూడా మన రక్షణశాఖకు ఇచ్చిన నివేదికలో ఆ కంపెనీ తెలిపింది. మన వైమానిక దళం కోరిన సాంకేతికాంశాలు యూరో ఫైటర్ జెట్లలో పుష్కలంగా ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు.

యూరో ఫైటర్ కన్సార్టియం ముఖ్య అధికారి డొమింగో ఉరేనా-రాసో స్వయంగా అప్పటి రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి 2014, జులై 4న లేఖ కూడా రాశారు. 126 యూరో ఫైటర్ టైఫూన్లను 20 శాతం తక్కువ ధరతో భారత్‌కు అందించనున్నట్టు ఆ లేఖలో స్పష్టం చేశారు. అనుకూల వాయిదాల్లో చెల్లింపులకూ అవకాశం కల్పిస్తామన్నారు. ఆధునీకరించిన జెట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. సాంకేతికత బదిలీకి ఆఫర్ ఇచ్చారు. ఫైటర్ జెట్లను ఉత్పత్తి చేసే పారిశ్రామిక పార్క్‌ను భారత్‌లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక్కడి మన సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇస్తామని రాసో తన లేఖలో పేర్కొన్నారు. యూరో ఫైటర్ జెట్లను బ్రిటన్‌కు చెందిన రాయల్ ఎయిర్ ఫోర్స్‌సహా జర్మనీ, ఇటలీ, స్పెయిన్ వైమానిక దళాలు వినియోగిస్తున్నాయి. మేమిచ్చిన ఈ ఆకర్షణీయమైన ఆఫర్ పట్ల భారత ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తుందని ఆశిస్తున్నట్టు జైట్లీకి రాసిన లేఖలో రాసో పేర్కొన్నారు. కానీ, ఇంత మంచి అవకాశాన్ని కూడా మోడీ సర్కార్ ఎందుకు తిరస్కరించిందన్న ప్రశ్నలకు సమాధానం లేదు.. యూరోఫైటర్ కన్సార్టియం ఇచ్చిన ఆఫర్‌ను వదులుకున్న తర్వాత మోడీ సర్కార్, ఫ్రాన్స్‌తో ప్రభుత్వాల మధ్య ఒప్పందానికి సిద్ధమైంది. అయితే, గతంలో (యూపీఏ హయాంలో) 18 రాఫెల్ జెట్లను కొనుగోలు చేసి, 108 జెట్లను భారత్‌లోనే హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ద్వారా తయారు చేయించడానికి బదులు 36 జెట్లకే మోడీ సర్కార్ బేరమాడింది.

ఈ నూతన ఒప్పందంలో ఫ్రెంచ్ కంపెనీ దస్సాల్ట్ ఏవియేషన్ వాణిజ్య భాగస్వామిగా మాత్రమే ఉండనున్నది. అలాంటప్పుడు ధర విషయంలో ఫ్రాన్స్ కంపెనీతో గట్టిగా బేరమాడే అవకాశమున్నది. ఓవేళ ధర గిట్టుబాటు కానపుడు సంప్రదింపుల దశలోనే డీల్ నుంచి బయటపడాల్సి ఉండేది. అప్పటికే యూరో ఫైటర్ ఇచ్చిన ఆఫర్ ఉన్నందున ధర విషయంలో బేరమాడేందుకు అవకాశమున్నా మోడీ సర్కార్ ఎందుకు వదులుకున్నట్టు..?

# నయా పైసా ఇవ్వలేదు





(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఆదివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి దన్యవాదాలు తెలిపే తీర్మానంలో ఆయన మాట్లాడారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు రూ 24వేల కోట్ల నిధులు ఇవ్వాలని, నిటి ఆయోగ్ సిఫారసు చేసిందని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం 24 పైసలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర సర్కారు ఇచ్చే నిధులను ఇక్కడ రాష్ట్ర బీజేపీ తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని, కానీ రాష్ట్రాల హక్కుగానే కేంద్రం నిధులు ఇస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ కిట్‌లో కేంద్ర ప్రభుత్వం వాటా ఏ మాత్రం లేదని, రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు కొన్ని చెప్పనివి కూడా టీఆర్ఎస్ సర్కారు తూచ తప్పకుండా దృష్టి సారిస్తోందని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు చెప్పారు. అందులో ఎవరికి అనుమానం అక్కర్లేదని స్పష్టం చేశారు. ఏ విషయంలోనూ ఉర్కులాడం...నిలకడగానే అన్ని అమలు చేస్తామన్నారు. గతంలో తాము ప్రారంభించిన నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని చెప్పారు. కోటి ఇరవై ఐదు లక్షల ఎకరాలకు నీరందిస్తామన్నారు. అందులో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడమే తమ లక్ష్యమని వివరించారు. ఆదివారం శాసనసభలో గవర్నర్ దన్యవాదాలు తెలిపే తీర్మానంలో ఆయన ప్రసంగించారు. ప్రాజెక్టులను పూర్తి చేస్తూనే...పాత రోడ్లను అద్దాల్లా చేస్తామని, కొత్త రోడ్లకు అనుమతి ఇవ్వబోమని స్పష్టత ఇచ్చారు. ఈ ఏడాది అవాసాలకు (తండాలు) విరివిరిగా సీసీ రోడ్లకు అనుమతి ఇస్తామన్నారు. కంటి వెలుగు పథకంలో పరీక్షలు మాత్రమే చేశామని,ఆ పథకాన్ని కొనసాగిస్తూనే చెవి,ముక్కు,గొంతు (ఈఎన్‌టీ) సమస్యలపై దృష్టి పెడతామని పునరుద్ఘాటించారు. దీంతోపాటు ప్రతిపౌరునికి రక్త పరీక్షలు చేసి, వారి ఆరోగ్య ప్రొఫైల్ సిద్ధం చేస్తామన్నారు. దీంతో ఆరోగ్య తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తామన్నారు. రెండు పడక గదుల విషయంలో రాజీపడేది లేదని, లాటరీ ద్వారా ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేస్తామని, ఆ బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. సొంత స్థలం ఉన్న వారికి రూ 5 లక్షలు ఇస్తామని చెప్పారు. భూరికార్డుల ప్రక్షాళనను మరింత పకడ్బదీగా అమలు చేస్తామని చెప్పారు. ధరణి వెబ్‌సైట్‌ను అప్‌గ్రేడ్ చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు చూస్తామని చెప్పారు. పహానీల, నకల్లు తెవాలని రైతులను ఇబ్బంది పెట్టకుండా ఈ వెబ్‌సైట్ చూసి బ్యాంకు రుణం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో భూభారతి కోసం ప్రయత్నం చేసినా దాన్ని అమలు చేయడంలో విఫలమైందని చెప్పారు. రైతు రుణమాఫీ రెండు విడతలుగా చేస్తామని, బడ్జెట్ తర్వాతనే నిరుద్యోగ భృతి, పింఛన్లు అమలు చేస్తామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐకేపీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం ద్వారా 45 వేలకు పైగా ఉన్న మహిళా సంఘాలను పాత్రధారులుగా చేస్తామని కేసీఆర్ చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రతి నియోజకవర్గంలో నెలకొల్పి నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగిస్తామన్నారు. కారం, పసుపు, నూనె ఆఖరికి పసిపిల్లలు తాగే పాలను కూడా కల్తీ చేస్తున్నారని, ఈ బెడద కూడా పోవాలంటే విజయ డైయిరీ, లిజ్జత్ పాపడ్ కంపెనీలు తరహాలో ఫుడ్ ప్రాసెసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

**కౌలు రైతుకు నిరాశే...**

కౌలు రైతుల సంక్షేమాన్ని చూనే బాధ్యత భూయజమానులే తీసుకోవాలని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కౌలు రైతులకు రైతుబంధు వర్తింపచేసి ఆ తర్వాత వచ్చే ఇబ్బందులను తాము పరిష్కరించలేమని తేల్చి చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటివరకు రూ 99వేల కోట్లు ఖర్చు పెట్టామని, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూలక్షా 17 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామని సభకు వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 1330 టీఎంసీల నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. టీఆర్ఎస్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా అమలు కావడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ అన్ని విభాగాలను సమన్వయం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని చెప్పారు.

**వచ్చే ఐదేండ్లలో రూ 10 లక్షల కోట్ల ఆదాయం, ఖర్చు**

వచ్చే ఐదేండ్లలో తెలంగాణ సమకూర్చుకునే ఆదాయం, పెట్టే ఖర్చు రూ 10 లక్షల కోట్లపైనే ఉందని సీఎం కేసీఆర్ చెప్పారు. ఈ ఐదేళ్లలో 2 లక్షల 40 వేల కోట్లు అప్పులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు నుంచి ఐదు లక్షల కోట్లు అభివద్ధి పనులకు ఉంటాయని పేర్కొన్నారు. ఆర్థికప్రగతిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని, జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్నారు.

**మేం చీకట్లో బాణం వేసే రకాలం కాదు..**

'మేం చీకట్లో బాణం వేసే రకాలం కాదు.. గతంలో మా ఎన్నికల ప్రణాళికలో చెప్పినవన్నింటికీ అమల్జేశాం. వాటితోపాటు చెప్పని 72 అంశాలను కూడా అమలు చేశాం. అందువల్ల ప్రతిపక్షాలకు ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. ఈసారి కూడా మేం చెప్పిన వాటన్నింటినీ తూ.చా. తప్పకుండా అమలు చేస్తాం...' అని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. గత నాలుగున్నరేండ్ల కాలంలో తమ ప్రభుత్వం అవలంభించిన పద్ధతులు, చేపట్టిన కార్యక్రమాలు, అమల్జేసిన పథకాల వల్ల ప్రజలు తమను రెండోసారి అఖండ మెజారిటీతో గెలిపించారని ఆయన చెప్పారు. వారందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు.

ఈ వాస్తవం తెలిసినప్పటికీ కొంతమంది ప్రతిపక్ష నేతలు కావాలనే తమపై బురదజల్లుతున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగం.. టీఆర్ఎస్ బహిరంగ సభలో స్పీచ్‌లా ఉందంటూ వారు మాట్లాడటం శోచనీయమన్నారు. 'వారి ప్రజాస్వామ్య రాజకీయ పరిజ్ఞానానికి సానుభూతిని వ్యక్తం చేస్తున్నా...' అని ప్రధాన ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్కనుద్దేశించి వ్యాఖ్యానించారు. వాస్తవానికి మన రాష్ట్రంలోనే కాదు.. ప్రతీ రాష్ట్రంలోనూ గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ కార్యక్రమాలనే ప్రతిబింబిస్తుందని అన్నారు. అంతేతప్ప ఆయన సొంత కవిత్వం ఉండబోదన్నారు. ఒకవేళ అలా ఉంటే అది అప్రజాస్వామికమవుతుందని తెలిపారు. అందువల్ల కచ్చితంగా గవర్నర్ ప్రసంగం.. టీఆర్ఎస్ మ్యానిఫెస్టోను, తమ క్యాబినెట్ ఆలోచనలనే ప్రతిబింబిస్తుందని వివరించారు.

# ధన 'పంచాయతీలు'

- కోటి వరకూ ఖర్చుచేస్తున్న అభ్యర్థులు
- సంగారెడ్డి జిల్లాలో గెలుపే లక్ష్యంగా పార్టీలు
- మొదటి విడతలోని పలు గ్రామాల్లో భారీగా తాయిలాలు

**సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో మొదటి విడత ఎన్నికలు జరిగే కొన్ని పంచాయతీల్లో రసవత్తర పోటీ నెలకొంది. కొందరు అభ్యర్థులు కోటి రూపాయలకు తగ్గకుండా ఖర్చు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఎన్నికలతో పోటీ పడుతూ గరిష్టంగా ఒక్క ఓటుకు రూ.10వేల వరకు ఇస్తున్నారంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. జిల్లాలో పారిశ్రామికవాడ, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సర్పంచ్ అభ్యర్థులను ఎంతవరకైనా వెళ్లేలా సిద్ధం చేస్తున్నాయి.**

నవతెలంగాణ-సంగారెడ్డి ప్రతినిధి

ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యంను నిరోధించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నా ఆ ఛాయలు పల్లెల్లో కనిపించడం లేదు. నగర సరిహద్దును పంచుకొని ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న సంగారెడ్డి జిల్లాలో సర్పంచ్ అభ్యర్థులు ఎమ్మెల్యే ఎన్నికలను తలపించేలా ఖర్చు చేసేందుకు ముందుకు వస్తున్నారు. కనీసం రూ. పది లక్షల్లోపు ఖర్చు చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఈ ఎన్నికల్లో లేరనే చెప్పాలి. అధికారుల నిబంధనలకు అభ్యర్థులు చేస్తున్న ఖర్చులకు పొంతన ఉండటం లేదు. ప్రధానంగా సంగారెడ్డి డివిజన్‌లో ఈ నెల 21న జరిగే ఎన్నికల పోరులో కొన్ని గ్రామాల్లో అభ్యర్థులు రూ.కోటి వరకూ ఖర్చు చేస్తుండటం గమనార్హం. మొదటి విడత ఎన్నికల ప్రచారం ఈ నెల 19తో ముగిసింది. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు నిత్యం మద్యం, డబ్బులు, విందులు సాధారణమైపోయాయి. చివరి రెండు రోజుల్లో రహస్యంగా జరగాల్సిన తంతు కోసం అభ్యర్థులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల, జిన్నారం, కంది, సంగారెడ్డి, కొండాపూర్ మండలాల్లో ఒక్కో ఓటుకు రూ.వెయ్యి నుంచి పది వేలు చెల్లించి గెలిచేందుకు అధికారులు ప్రణాళికలు పూర్తి చేశారు.

**ఎంతటి ఖర్చుకైనా సిద్ధమే..**

గ్రామ పంచాయతీని బట్టి ఒక్కో ఓటుకు గరిష్టంగా రూ.పది వేల వరకూ ఖర్చు చేసేందుకు అభ్యర్థులు ముందుగానే అంచనా వేసుకున్నారు. శనివారం సాయంత్రం నాటికే కొన్ని గ్రామాల్లో ఒక్కో ఓటుకు గరిష్టంగా రూ.5వేలు అందించినట్టు సమాచారం. ఇక ఆదివారం రాత్రి, ఎన్నికల రోజు ఉదయం పూట ఓటింగ్ వెళ్లే ముందే ఓటరుకు ఎంతో కొంత ముట్టచెప్పేందుకు అభ్యర్థులు కసరత్తు పూర్తి చేసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో 647 గ్రామ పంచాయతీలకుగాను మొదటి విడతలో 12 మండలాల్లోని 238 సర్పంచ్ స్థానాలకు నేడు ఎన్నికలు జరగనున్నాయి. చిట్కుల్, పాశమైలారం గ్రామాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యాయి. ఉపసర్పంచ్‌లకు కూడా చెక్‌పవర్ వస్తుండటంతో వార్డు సభ్యులుగా గెలిచేందుకు ఇక్కడ ఒక్కో ఓటుకు రూ.20వేలు కూడా చెల్లిస్తున్నారు. పాశమైలారంలో ఒక్కో ఇంటికి పది గ్రాముల బంగారం ఇస్తున్నట్టు సమాచారం. ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారం, భానూర్, పాటి, ఘన్‌పూర్ గ్రామాల్లో వార్డు సభ్యులుగా పోటీచేసే అభ్యర్థులు టీవీలు, ఫ్రిజ్‌లు.. ఇలా ఓటరు ఏది కోరినా ఇప్పిస్తున్నారు. జిన్నారం మండలం గడ్డపోతారం, వావిలాల, గుమ్మడిదల మండల కేంద్రంతో పాటు బొంతపల్లి, అన్నారం గ్రామ పంచాయతీల్లో గరిష్టంగా ఖర్చు చేస్తున్నారు. గడ్డపోతారంలో రూ.2 నుంచి 5వేల వరకూ, వావిలాల, బొంతపల్లిలో రూ.2-3 వేల వరకు పలుకుతోంది. గుమ్మడిదలలో రూ.1-2వేల వరకూ ఓటు రేటు పలుకుతోంది. అన్నారం, గుమ్మడిదల గ్రామ పంచాయతీల్లో టీఆర్ఎస్ రెబల్స్ అభ్యర్థులు కూడా ప్రధాన పోటీదారులకు తగ్గకుండా ఖర్చు చేస్తున్నారు. కంది మండల కేంద్రంతో పాటు కలివేముల, జుల్కల్, ఇంద్రకరణ్, సంగారెడ్డి, కొండాపూర్ మండలాల్లోని గ్రామాల్లోనూ ఎలాగైనా గెలిచే లక్ష్యంతో అభ్యర్థులు ముందుకు వెళ్తున్నారు.

**ఆర్థిక వనరులపై పట్టు సాధించేందుకే..**

భారీ డబ్బు ప్రవాహం కనిపిస్తున్న మండలాల్లో అక్కడి వనరులపై అజమాయిషీ దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో పెద్దఎత్తున్న పరిశ్రమలు, విస్తరించిన రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సర్పంచ్‌లకు ఎమ్మెల్యేలకు మించి అధికార దర్పం కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఖర్చు పెడుతున్నారు. టీఆర్ఎస్ రెబల్ అభ్యర్థులు కూడా వారితో పోటీపడుతూ ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో విస్తరించిన ఔటర్ రింగ్‌రోడ్‌ను ఆనుకొని ఉన్న మండలాల్లో పరిశ్రమలు పెద్దఎత్తున ఉండటంతో అక్కడి సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు డిమాండ్ ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రీజనల్ రింగ్ రోడ్‌తో అనుసంధానయ్యే కంది, సంగారెడ్డి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో సర్పంచ్ పదవులకు పోటీ పడుతున్న అభ్యర్థులు అర కోటికి తగ్గకుండా ఖర్చు చేస్తున్నారు.

**వెలగని పొయ్యి... ఇంటికి తులం బంగారం**

సంగారెడ్డి జిల్లాలో ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న పలు గ్రామాల్లో వారం రోజులుగా ఇంట్లో పొయ్యి వెలిగించడం లేదు. పటాన్‌చెరు మండలం పాశమైలారంలో కొందరు వార్డు సభ్యుల అభ్యర్థులు ఓట్ల కోసం ఇంటికి తులం (పది గ్రాముల) బంగారం కానుకగా ఇస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు నిలుచున్న ఓ గ్రామంలో మూడు టెంట్లు ఏర్పాటు చేసి అభ్యర్థులే భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు పూటల్లో ఎవరైనా.. ఏ అభ్యర్థి టెంటులోనైనా నేరుగా వెళ్లి భోజనం చేయవచ్చు. ఎవరూ అభ్యంతరం తెలపరు. మద్యం అలవాటు ఉన్న వాళ్లనచ్చిన బ్రాండ్ ఫ్రీగా తాగేయొచ్చు.. ఇదీ పంచాయతీ ఎన్నికల మహత్యం!

## మండుతున్న ఇంధనం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుంది. ఇంధరల పెంపు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వాహనదారుల్ని బెంబేలెత్తిస్తోంది. న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై నగరాల్లో పెట్రోల్ ధరలు 21-29 పైసల మధ్య పెరగగా, డీజిల్ ధర 29-31పైసల మధ్య పెరిగింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.70.95కు, లీటర్ డీజిల్ ధర రూ.65.45పైసలకు చేరుకుంది. ముంబయిలో ఆదివారం పెట్రోల్ ధర 23పైసలు పెరిగగా, డీజిల్ ధర 31పైసలు పెంచారు. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర 73రూపాయలు దాటింది. లీటర్ డీజిల్‌పై 30పైసలు పెరిగి రూ.67.23కు చేరుకుంది. చెన్నైలో ఆదివారం పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ.73.65, రూ.69.14గా నమోదైంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగటమే దేశీయంగా ఇంధన ధరల పెంపునకు దారితీసిందని కేంద్రం తెలుపుతోంది.

## నేడు తొలి పోరు

(మొదటిపేజీ తరువాయి)

భద్రతను మోహరించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా స్థానిక పోలీసులతో పాటు పారా మిలటరీ దళాలను కూడా రంగంలోకి దించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**పోటా పోటీ**

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో పోటా పోటీ నెలకొంది. 3,701 సర్పంచ్ పదవులకు గాను 12, 202 మంది, 28, 976 వార్డులకు 70,94 మంది బరిలో నిలిచారు. సర్పంచ్ పదవిని దక్కించుకోవడానికి అభ్యర్థులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. సర్పంచ్ పదవి కోసం సగటున ముగ్గురు పోటీ పడుతున్నారు. తొలి పోరులో అత్యంత ధనవంతులే పోటీ పడుతుండటంతో పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గెలుపు కోసం అందరూ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లకు పోటా పోటీగా మద్యం, నగదు పంపిణీ చేసినట్టు సమాచారం. ప్రధానంగా పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార పార్టీ తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. సాధ్యమైనంత వరకు సర్పంచ్ పదవులను గెలిచేలా పావులు కదుపుతున్నారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ నేతల మధ్యనే పోటీ నెలకొన్నది. పార్టీ బలపర్చిన వారికి వ్యతిరేకంగా బరిలో నిలిచిన అభ్యర్థులను ఓడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అగ్రనేతలు రంగంలోకి దిగి పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. ఓటర్లు చేజారకుండా మద్యం, డబ్బులు, చీరలు, ఇతర తాయిలాలను ఎరవేస్తూ తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు. ఈ ఎన్నికలో నోటు, మద్యందే పై చేయి ఉన్నట్టు తెలిసింది. పోటా పోటీ ఉన్న చోట ఓటుకు రూ. వెయ్యి నుంచి రూ 2వేల వరకు పంచుతున్నట్టు సమాచారం.

**ఏర్పాట్లు పూర్తి**

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల సంఘం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్లు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే విధులు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బందికి ఆదివారం ఉదయం ఎన్నికల సామగ్రిని నిర్దేశిత పంపిణీ కేంద్రాల వద్ద అందజేశారు. మొత్తం 15వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

## మోడీ వర్సెస్ ఆల్

(మొదటిపేజీ తరువాయి)

చేస్తుంటే లోక్ జనశక్తి ఆరు సీట్లకు పోటీ చేస్తోంది. ప్రతిపక్షం వైపు, ఆర్జేడీ, కాంగ్రెస్, ఎన్సీపీ, ఇంకా ఇతర పార్టీలు సీట్ల సద్దుబాటు చేసుకుంటున్నాయి. యూపీలో మొత్తంగా 80సీట్లు వుండగా అప్నాదళ్, సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీతో కలిసి బీజేపీ పోటీ చేస్తున్నది. ఇక్కడ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్పీ-బీఎస్పీ కూటమి ఏర్పడింది. రాష్ట్రీయ లోక్‌దళ్ కూడా వీటితో చేతులు కలిపేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఆ కూటమిని మోడీ ఎదుర్కొనాల్సి వస్తోంది. మహారాష్ట్రలో ద్విముఖ పోటీ వున్నది. ఎన్నికల ముందు పొత్తు కుదిరిన భాగస్వాములకు, 2014లో పోటీ చేసిన కూటమికి మధ్య పోటీ వుంది. కాంగ్రెస్, ఎన్సీపీలను ఎదుర్కొనాలంటే శివసేనతో చేతులు కలపడం బీజేపీకి తప్పదు మోడీ ఒంటరిగా పోటీని ఎదుర్కొంటున్న రాష్ట్రం అంటూ ఏదైనా వుందంటే అది పశ్చిమ బెంగాల్. ఇక్కడ కూడా మోడీ వర్సెస్ ఆల్ కాదు. వాస్తవంగా మోడీకి మమతకి మధ్య పోటీ. బీజేపీ మాదిరిగా తృణమూల్ కూడా ఒంటరిగానే పోటీ చేస్తోంది. కాంగ్రెస్ వైఖరి ఇంకా ఏదీ ఖరారు కాలేదు. బెంగాల్‌కు సంబంధించినంతవరకు ప్రతీ పార్టీ ఇతర పార్టీతో 42సీట్లకూ పోటీ పడే అవకాశం వుంది. తమిళనాడుతో పాలక అన్నాడీఎంకే బీజేపీతో చేతులు కలిపే అవకాశం వున్నది. మరోపక్క ప్రతిపక్ష డీఎంకే, కాంగ్రెస్, వామపక్షాలు, ఇంకా ఇతర పార్టీలు చేతులు కలిపాయి. ఇక్కడ రెండు కూటముల మధ్య లేదా ఒక కూటమి, అన్నాడీఎంకె, బీజేపీల మధ్య పోటీ వుంటుంది. అంతేకానీ మోడీ, ఇతర పార్టీలన్నింటి మధ్య పోటీ కాదు. కేరళలో మూడు కూటముల మధ్య పోటీ వుంది. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్, ఐయుఎంఎల్ మధ్య ప్రతీసారీ పోటీ వుంటుంది. కొత్తగా వచ్చిన బీజేపీ ఇక్కడ ఒంటరిగా పోటీ చేయనుంది. ఇక ఈశాన్యంలో అయితే బీజేపీ లేదా దాని ప్రాంతీయ భాగస్వామ్య పార్టీల్లో ఒకటి అధికారంలో వుంది. కాబట్టి ఇక్కడ ఆ సమస్యే రాదనుకుంటున్నది.. అసోంలో బీజేపీ, బోడో గణ పరిషత్ కలిసి పోటీ చేస్తున్నాయి. మణిపూర్, మేఘాలయల్లో బీజేపీతో నేషనలిస్ట్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) సీట్ల సద్దుబాటు చేసుకుంటున్నది. అయితే పౌరసత్వబిల్లును మోడీ సర్కార్ ఆమోదించజేయటంతో.. బీజేపీ పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని రాజకీయపరిశీలకులు అంటున్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది. రాజస్థాన్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌ల్లో కూడా అదే పరిస్థితి వుంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌ది ఒంటరిపోరు, బీజేపీ శిరోమణి అకాలీదళ్‌తో జత కట్టింది. ఇక్కడ ఆప్ కూడా వుంది. ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్, ఆప్‌ల మధ్యపోటీ వున్నది. హర్యానా, ఒడిషాల్లో అందరి మధ్య పోటీ వుండగా, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం బీజేపీతో తెగతెంపులు చేసుకున్నది. ఇక్కడ ప్రాంతీయ పార్టీల మధ్యే పోటీ ప్రధానంగా వుండనున్నది. తెలంగాణ పరిస్థితి అందుకు భిన్నంగా లేదు. కర్నాటకలో మాత్రం బీజేపీని అధికారానికి దూరంగా వుంచేందుకు కాంగ్రెస్, జనతాదళ్ సెక్యులర్‌తో కలిసి పోటీ చేస్తోంది.

## కాదని ప్రచారం చేస్తే.. కాళ్లూ చేతులు విరుగుతయ్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ నుంచి జోగు నర్సిములు, టీఆర్ఎస్ నుంచి శేఖర్‌నామినేషన్లు వేసి బరిలో ఉన్నారు. టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థికి పెత్తందారులు మద్దతిస్తున్నారు. దీంతో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థుల మధ్య కొందరు చిచ్చుపెడుతున్నారు. నర్సిములు గ్రామంలో ప్రచారం చేయకుండా బెదిరిస్తున్నారు. ప్రచారాన్ని అడ్డుకుంటున్నారు. 'నీవు మా కాలనీలో అడుగు పెడితే అంతు చూస్తాం' అంటూ బెదిరిస్తున్నారు. చేసేదేమీ లేక నామినేషన్ వేసిన జోగు నర్సిములు ప్రచారం చేయకుండా ఇంటికే పరిమితమయ్యాడు. మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని బాధితుడు వాపోతున్నాడు.

**వాళ్లేం చెప్పినా వినాల్సిందే..**

రావులపల్లి అనుబంధ గ్రామంగా ఉన్న తిమ్మాపూర్ ఇటీవల గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. గ్రామంలో 1550 మంది జనాభా ఉండగా, 487 ఓట్లు ఉన్నాయి. గ్రామంలో అగ్రకుల పెత్తందార్ల ఓట్లే అధికంగా ఉండటంతో వారి ఏదిచెబితే అది వినాల్సిందే. లేదంటే ఏదో రకంగా హింసిస్తారు. ఇక్కడా అదే జరిగింది. వారికి అనుకూలంగా ఉన్న శేఖర్‌ను గెలిపించుకొని పెత్తనం చెలాయించేందుకు పథకం పన్నారు. నర్సిములు వారిమాట వినకుండా నామినేషన్ వేశాడు. అతనితో పాటు వార్డు మెంబర్‌గా నామినేషన్ వేసిన చంద్రపల్లి అంతయ్య ఇంటికి వచ్చి బెదిరించారు. అతని భూములు పెత్తందార్ల పొలాలకు దగ్గరగా ఉండటంతో ప్రచారం చేసుకోకుండా ఇంటికే పరిమితమయ్యాడు.

## మిషన్ భగీరథకు లీకు

**నాగర్‌కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం మెడిపూర్ గ్రామం వద్ద నాగర్ కర్నూల్- కల్వకుర్తి ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకయింది. దీంతో ఒక్కసారిగా నీళ్లు బయటకు విరజిమ్ముతూ సుమారు 60 అడుగుల మేర పైకి ఎగిసిపడ్డాయి. నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఎల్లూరు నుంచి కల్వకుర్తికి భగీరథ నీరు తరలించే పైప్‌లైన్ లీక్ కావడంతో ప్రస్తుతానికి అధికారులు నీటి సరఫరా నిలిపివేశారు.

## పాలకుల విధానాల్లో మార్పు రావాలి

- కవులు, రచయితలపై దాడులను ఖండిస్తున్నాం: ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు

**నవతెలంగాణ-రాంనగర్**

పాలకుల విధానాల్లో మార్పు రానంతకాలం ప్రజలకు కష్టాలు తప్పవని తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సంస్కృతి ఆధ్వర్యంలో 'రాజ్యహింసకు వ్యతిరేకంగా సదస్సు' ఆదివారం నిర్వహించారు. దేశవ్యాప్తంగా కవులు, రచయితలపై కొనసాగుతున్న నిర్బంధకాండను వక్తలు ఖండించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా చేయడమే రాజకీయమన్నారు. సమాజంలో ప్రజల తరపున మాట్లాడితే వారిని నేరస్థులుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబాను అరెస్టు చేస్తే ప్రపంచదేశాలన్నీ ఖండించాయన్నారు. తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తున్న కవులు, కళాకారులపై కేసులు పెడుతూ నిర్బంధకాండను కొనసాగిస్తున్నారని విమర్శించారు. టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక మూక దాడులు పెరిగాయని విమర్శించారు. సదస్సులో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జి. రాములు, నాయకులు జి. నరేష్, మోహనకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మధుసూదన్‌రెడ్డి ఓడీని తొలగించాలి

- టీజీజేఎల్ఏ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఇంటర్ విద్యలో పనిచేస్తున్న పి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆన్‌డ్యూటీ (ఓడీ)ని దుర్వినియోగం చేశారనీ, ఆ సౌకర్యాన్ని తొలగించాలనీ తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీజీజేఎల్ఏ అధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి చిత్రం యాదగిరి నాయకులు రాంశెట్టి, ఎస్సీ,ఎస్టీ సంఘం అధ్యక్షులు వి ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘానికి అధ్యక్షునిగా ఉన్న మధుసూదన్‌రెడ్డి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నారనే అభియోగాలున్నాయని తెలిపారు. అవినీతి కార్యకలాపాల విచారణ ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

## దళిత రైతు దీక్షపై పెట్రోబాంబ్ దాడి

మొదటి పేజీ తరువాయి

దేవేంద్ర జాదవ్ నేతృత్వంలో కొన్నేండ్లుగా వారు పోరాటం చేస్తూ వచ్చారు. దళిత రైతుల డిమాండ్‌కు ఆలిండియా కిసాన్ మహాసభ (ఏఐకేఎస్), ఆలిండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్(ఏఐఏడబ్ల్యూయూ)లు కూడా మద్దతు ప్రకటించాయి. వీరి దీర్ఘకాలిక పోరాటం అనంతరం.. బ్లాక్ సర్కిల్ ఆఫీసర్ రైతులు నివసిస్తున్న ప్రాంతంలో పర్యటించారు. అనంతరం వారికి భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో దళిత రైతులంతా ఆనందంలో మునిగిపోయారు. అయితే సరిగ్గా ఇదే సమయంలో ఆ అధికారి ఆరోగ్య సమస్యల కారణంగా సెలవులపై వెళ్లారు. దీంతో ఆ బాధ్యతంతా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(బీడీఓ) సరోజ్ బైథాపై పడింది.

**బీడీఓ అండతో రెచ్చిపోయిన ల్యాండ్ మాఫియా**

అవినీతి అధికారి అయిన బీడీఓ స్థానిక ల్యాండ్ మాఫియాకు అండగా ఉండేవారు. ఈనెల 10న బీడీఓ సరోజ్.. 100 మంది పోలీసుల సహకారంతో దళిత రైతుల భూములను పరిశీలించారు. ఆసమయంలో మాఫియా కూడా అధికారితో వెళ్లింది. భూమిపై రైతులకు హక్కును కల్పించే విషయంపై మళ్లీ తనిఖీ చేస్తామని ఆ అధికారి తెలిపారు. భూ యాజమాన్య పత్రాలు తమకు అందుతాయని ఆశించిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. దీనితో ఆ దళిత రైతు కుటుంబాల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. నిరసనగా.. ఈనెల 11 నుంచి నిరవధిక నిరాహార దీక్షకు వారు దిగారు. అనంతరం ఈనెల 16న చర్చల కోసం దళిత రైతుల నుంచి కొందరుప్రతినిధులను బీడీఓ ఆహ్వానించారు. చర్చల కోసం దీక్షా స్థలిని ప్రతినిధులు విడిచి వెళ్లిన కొంతసమయానికి ఇదే అదనుగా భావించిన ల్యాండ్ మాఫియా.. దేవేంద్ర జాదవ్‌ను లక్ష్యంగా చేసుకొని దళిత రైతులపై పెట్రోబాంబుతో దాడి చేసింది. ఈ దాడిలో జాదవ్ తృటిలో తప్పించుకున్నారు. కొందరు నిరసనకారులతో పాటు బిందాసాన్వి, అనారీ దేవీలు మాత్రం తీవ్రంగా గాయపడ్డారు. ఆ ఇద్దరిని పాట్నా మెడికల్ ఆస్పత్రికి తరలించారు. కాలిన గాయాలు తీవ్రంగా ఉండటంతో బిందా పరిస్థితి విషమంగా మారింది. దీంతో నిరాహార దీక్షను నిర్వాహకులు రద్దు చేసుకున్నారు. బీడీఓను తక్షణమే అరెస్టు చేసి సస్పెండ్ చేయాలని, బాధితులకు తగిన పరిహారం అందించాలనే డిమాండ్‌తో 'చలో రున్నీ సైద్‌పూర్'పేరుతో నిరసన ర్యాలీను ఈనెల 22న నిర్వహించనున్నట్టు అవాదేశ్ కుమార్ తెలిపారు. ల్యాండ్ మాఫియా వెనుక నితీశ్ సర్కార్‌లోని కొందరు పెద్దల హస్తం ఉన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**దాడిని ఖండించిన సీపీఐ(ఎం)**

దళితరైతులపై ల్యాండ్ మాఫియా దాడిని సీపీఐ(ఎం) ఖండించింది. దీనిపై బీహార్ సీపీఐ(ఎం) రాష్ట్ర సెక్రెటరీ అవాదేశ్ కుమార్ స్పందిస్తూ.. ' స్థానిక సామాజిక కార్యకర్త దేవేంద్రను వారు చంపాలనుకున్నారు. ఆయన తృటిలో తప్పించుకున్నారు. బీడీఓ అవినీతిపరుడని ఈ ఘటనతో రుజువైంది. ఆయనకు స్థానిక ల్యాండ్ మాఫియాతో సంబంధాలున్నాయి. భూమి యాజమాన్య పత్రాలు స్థానికులు పొందడం ఆ అధికారికి ఇష్టం లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భారత్‌లో 'అండర్ ఎంప్లాయ్‌మెంట్' సమస్య

**లండన్ :** ఉన్నత విద్యార్హతలు, నైపుణ్యాలు ఉన్నప్పటికీ సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవటమనేది 'నిరుద్యోగం'కన్నా ప్రమాదకరమని కొద్ది నెలల క్రితం 'నిటి ఆయోగ్' మోడీ సర్కార్ దృష్టికి తీసుకెళ్లింది. 'అండర్ ఎంప్లామెంట్' అనేది భారత్‌కు పెద్ద సమస్యగా మారిందని 'నిటి ఆయోగ్' డిప్యూటీ చైర్మెన్ రాజీవ్‌కుమార్ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. భారత్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. 'ఆర్థిక సహాకారం, అభివృద్ధి మండలి'(ఓఈసీడీ) లోని 15 దేశాల్లో జరిగిన అధ్యయనంలో 'అండర్ ఎంప్లాయిమెంట్'కు సంబంధించి పలు విషయాలు బయటపడ్డాయి.

## ప్రాజెక్టులపై అర్థవంత చర్చ జరగాలి

- కేసీఆర్ నిపుణుడైతే ఇంజినీర్లు ఎందుకు?
- ప్రభుత్వంపై నిర్మాణాత్మకంగా పోరాడుతాం: భట్టి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

నీటిపారుదల ప్రాజెక్టులపై శాసనసభలో అర్థవంత చర్చలు జరగాల్సి ఉందని ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రీడిజైన్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం రాష్ట్రానికి భారంగా మారబోతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు నిపుణుడైతే ఇంజినీర్లు ఎందుకని ప్రశ్నించారు. ఆదివారం అసెంబ్లీ సమావేశానంతరం సీఎల్పీ కార్యాలయంలో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. సభలో ప్రతి అంశంపై అర్థవంత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం సభా కార్యక్రమాలకు అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. సభలో మాట్లాడేందుకు తమ సభ్యులందరికీ అవకాశం ఉంటుందని, సబ్జెక్టుపై ఆసక్తి ఉన్న వారికి తప్పకుండా అవకాశం ఇస్తాని చెప్పారు. కేవలం సాగునీటి ప్రాజెక్టుల మీద రెండు లక్షల ఇరవై ఐదువేల కోట్లు ఖర్చు చేయడం దేశంలో ఎక్కడా చూడలేదని చెప్పారు. ఇప్పటి వరకు ప్రాజెక్టులపై లక్ష కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వం చెబుతున్నదని, కానీ ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. ప్రాజెక్టులపై చేసిన ఖర్చుపై ప్రభుత్వాన్ని కచ్చితంగా నిలదీస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన భూ ప్రక్షాళనతో ఉన్న సమస్యలకు తోడు కొత్తసమస్యలు వచ్చిపడ్డాయని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో తనకు సన్నిహిత సంబంధాలే ఉన్నాయని, సీనియర్లతోనూ తనకు విభేదాలు లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ప్రభుత్వంలో సీఎల్పీ నాయకుడిగా ఉన్న జానారెడ్డిని కలిశానన్నారు. రెండేళ్లుగా ప్రజా సమస్యలపై చర్చలు జరగకపోవడం విచారకరమన్నారు. ప్రతి 15 లేదా 20 రోజులకోసారి సీఎల్పీ సమావేశం నిర్వహిస్తామన్నారు. హుందాగా సభను నడుపుకుందామని చెప్పిన సీఎం ఫిరాయింపులకు పాల్పడతారనుకోవడం లేదన్నారు. ప్రజల డబ్బు వృథా కావద్దని, ప్రతి పైసా జాగ్రత్తగా ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పనికి కాపలాగా ఉండాలనే ప్రజలు మమ్ములను గెలిపించారని ఆయన కోరారు.

# నరసింహయ్య ఆదర్శ కమ్యూనిస్టు

### అంతిమ యాత్రలో అశేష జనవాహిని

### కొనియాడిన బివి.రాఘవులు


మాట్లాడుతున్న రాఘవులు



విజయవాడలో


ఫైల్

**కర్నూలు:** ఎన్ని ఒడుదొడుకులొచ్చినా.. ఆత్మవిశ్వాసంతో, నిబ్బరంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన టి.నరసింహయ్య తుది శ్వాస దాకా సమాజం కోసం పరితపించారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. శుక్రవారం తుదిశ్వాస విడిచిన నరసింహయ్య అంతిమయాత్ర ఆదివారం కర్నూలులో భారీ జనసందోహం మధ్య సాగింది. ముందుగా స్థానిక సుందరయ్య భవన్ నుంచి ఈద్గా, శ్రీరామ టాకీస్, రాజ్‌విహార్, పెద్ద పార్కు, వన్‌టౌన్ మీదుగా పాతబస్తీలోని జమ్మిచెట్టు శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం, మహబూబ్‌నగర్, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద హిందూ శ్మశానవాటికలో నరసింహయ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సుందరయ్య భవన్‌లో పలువురు నివాళులర్పించారు.

సీపీఐ(ఎం) కర్నూలు జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో రాఘవులు మాట్లాడుతూ నరసింహయ్య జీవితాంతం ప్రజల కోసం పాటుపడ్డారని తెలిపారు. ఆయన అర్థశాస్త్ర బోధన ఎంతో మందిని ప్రజా ఉద్యమంలోకి తీసుకొచ్చిందని, ఉన్నతమైన న్యాయకత్వాన్ని తయారు చేసిందని చెప్పారు. ఓ వైపు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో చురుకుగా ఉంటూనే... కుటుంబాన్ని ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయలేదని తెలిపారు. కుటుంబం కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమయ్యేలా చేసి ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి నాయకుడూ, కార్యకర్తా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నరసింహయ్య నిరంతరం ప్రజల సమస్యలను ఆలోచించే వ్యక్తి అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో రెండు పర్యాయాలు చీలికవచ్చి నాయకత్వ లోపం ఉన్న రోజుల్లో ఒంటరిగా ఉద్యమాన్ని నిర్మించి, అగ్ర పార్టీల సరసన నిలిపారని కొనియాడారు. మరో కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్ మాట్లాడుతూ... ఆదర్శ కమ్యూనిస్టు, మానవతా వాది, అందరూ గౌరవించే నిరాడంబరుడు నరసింహయ్య అని, ఆయనలో ఎప్పుడూ నిరాశ చూడలేదని తెలిపారు. నిస్వార్థం, ప్రేమ, అనురాగం పంచిన ఆదర్శ దంపతులుగా నరసింహయ్య, లక్ష్మమ్మ పార్టీకు కేరాఫ్‌గా నిలిచారని తెలిపారు. పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ... నరసింహయ్య రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, గిట్టుబాటు ధరల కోసం ఎన్నో పోరాటాలు నిర్మించారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర నాయకులు టి.రామచంద్రయ్య, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న మాట్లాడుతూ... నరసింహయ్య తమలాంటి వారికి కుటుంబ పెద్దగా వెన్నుతట్టి ప్రోత్సహించేవారన్నారు. ఆయన మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో నరసింహయ్య పని చేశారన్నారు. తన తండ్రి అయ్యపురెడ్డి కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందేందుకు అహర్నిశలూ కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కపిలేశ్వరయ్య మాట్లాడుతూ నరసింహయ్య నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధతతో చివరి వరకూ పని చేశారన్నారు. సిపిఎం తెలంగాణ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బి.వెంకట్, బాబురావు, రాయలసీమ సబ్ కమిటీ సభ్యులు జి.ఓబులు మాట్లాడారు. ప్రముఖ గేయ రచయిత, గాయకులు గోరటి వెంకన్న తదితరులు నరసింహయ్యకు నివాళులు అర్పించారు.

# ఎమ్మెల్యేలను భయపెట్టి చేర్చుకోవడం లేదు

### ఇష్టంతోనే పార్టీ మారుతున్నారు

- చేరికలపై చట్టపరంగా చర్యలు
- గాడితప్పి మాట్లాడితే సభలో అవకాశం ఉండదు
- ప్రతి సభ్యునికీ మాట్లాడే అవకాశమిస్తాం : పోచారం



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ఎమ్మెల్యేలు వస్తువులు కాదు...గౌరవం కోసం వారి ఇష్టంతోనే పార్టీ మారుతున్నారు. బలవంత పెట్టో, భయపెట్టో, తిట్టో వారిని చేర్చుకోవడం లేదు. ఎమ్మెల్యేల చేరికలపై చట్టంలోని నియమ, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజలు నమ్మకంతో అసెంబ్లీకి పంపిచారని, ప్రతి సభ్యునికీ మాట్లాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదే సభ్యులు గాడితప్పి మాట్లాడితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సీఎం కేసీఆర్‌తోపాటు అన్ని పక్షాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవులు వారసత్వంగా వచ్చేవి కాదన్నారు. రెండోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత అహంకారంలేదని, మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. ప్రజలకు న్యాయం చేసేందుకు అన్ని రంగాలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో శాసన సభను కూడా హుందాగా నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలచేలా ప్రణాళికలతో ముందుకు వెళతానని చెప్పారు. ప్రస్తుతం దేశంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ రంగంలో ఎలాగైతే మొదటి స్థానంలో ఉందో అలాగే శాసనసభ వ్యవహారాల్లోనూ మొదటి స్థానంలో ఉండేలా సభ్యులంతా సహకరించాలని కోరారు. గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ పాలనకు దర్పణం పట్టే విధంగా ఉందని చెప్పారు. ప్రతి సభ్యుడు సభను వినియోగించుకోవాలనీ, త్వరలో సభ నియమాలు, నిబంధనలపై కొత్త సభ్యులకు, యువ జర్నలిస్టులకు అవగాహన తరగతులు నిర్వహిస్తామని అన్నారు. ప్రతి శాసనసభ సమావేశాల్లో అవసరాన్ని బట్టి పని దినాలను నిర్వహిస్తామని చెప్పారు.

## కేంద్ర నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మోడీ సర్కారుపై కేసీఆర్ వ్యాఖ్యలు సరిగాదు : లక్ష్మణ్



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

కేంద్రంలోని ఎన్డీయే సర్కారు రాష్ట్రానికి సహకరించట్లేదని సీఎం కేసీఆర్ చెప్పినదాంట్లో వాస్తవం లేదని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన నిధుల పైన వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖర్చుపెట్టకపోవటంతో కేంద్ర నిధులు వెనక్కి వెళ్లిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆయుష్మాన్ భవ పథకాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేయట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీబీనగర్‌లో ఏయిమ్స్, గిరిజన యూనివర్సిటీలను కేంద్రం ఏర్పాటు చేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అడగ్గానే అనుమతులు ఇచ్చిన విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదు? సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇచ్చిన విషయం మరిచిపోయారా? అని అడిగారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షాల చెందిన నాయకులు ఇచ్చిన వినతి పత్రాలకు ఎన్ని పరిష్కరించారో చెప్పాలి. కనీసం వాటిని పరిశీలించారా చెప్పాలి?10 సంవత్సరాల యూపీఏ హయాంలో దాదాపు 16 వేల కోట్లు తెలంగాణ ప్రాంతానికి 13వ ఆర్థిక సంఘం నిధులను ఇచ్చిందని, అదే మోడీ సర్కారు లక్షా 15 వేల కోట్ల రూపాయలను రాష్ట్రానికి కేటాయించిందని గుర్తుచేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే కూడా తెలంగాణకు మోడీ సర్కారు ఎక్కువ నిధులు ఇచ్చిన విషయాన్ని కేసీఆర్ కప్పిపెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మోడీ సర్కారు ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తే మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

# ఈ ఛాలెంజ్ వెనుక?

### "10 ఇయర్ ఛాలెంజ్"తో వ్యక్తిగత ఫోటోలు దుర్వినియోగం అయ్యే అవకాశం?

- ఏఐకు మెరుగైన శిక్షణ.. వ్యాపార సంస్థలకు టార్గెట్ : నిపుణులు
- ఛాలెంజ్ మొదలైన మొదటి మూడు రోజుల్లోనే అరవై లక్షలమంది..
- సైబర్ నేరగాళ్ళకు ఫోటోల మార్ఫింగ్ సులువే!
- ఫేస్‌బుక్ అంత నమ్మదగ్గ సంస్థ కాదంటున్న సర్వేలు..

**ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం, స్మార్ట్ ఫోన్ల వినియోగం ఎక్కువకావడంతో సోషల్ మీడియాను వాడే వాళ్ళ సంఖ్య అమాంతం పెరిగిపోతున్నది. సామాజిక మాధ్యమాల్లో కొత్తగా ప్రవేశించిన సవాళ్ళ సంస్కృతి ప్రపంచం మొత్తాన్నే ఊపేస్తోంది. ఈ మధ్య కాలంలో "10 ఇయర్ ఛాలెంజ్" ('10 year challenge) పేరిట జరుగుతున్న ట్రెండ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సినిమా, స్పోర్ట్స్ సెలబ్రిటీలు మొదలు సాధారణ పౌరుల వరకూ అందరినీ ఆకర్షిస్తోన్న ఈ 'నయా ఛాలెంజ్'పై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' స్పెషల్ ఫోకస్..**




జై

2009లో ఎలా ఉన్నారు.. ఇప్పుడు 2019లో ఎలా ఉన్నారు. ఆ రెండు ఫోటోలను జతకలిపి సోషల్ మీడియాలో షేర్ చేసి 10 ఇయర్ ఛాలెంజ్ హ్యాష్‌టాగ్‌ను జతచేయడమే "10 ఇయర్ ఛాలెంజ్" అసలు కాన్సెప్ట్. ఇందులో భాగంగా పదేండ్ల క్రితం దిగిన ఫొటోను, ఇప్పటి ఫొటోను జత చేయాలి. ఇప్పటికే సినీతారలు, నెటిజన్లు తమ ఫోటోలను షేర్ చేస్తూ, పదేండ్లలో తమ జీవితంలో జరిగిన మార్పులను ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా తమ సన్నిహితులకు, స్నేహితులకు ఛాలెంజ్ విసురుతున్నారు. ఐతే, '10 ఇయర్ ఛాలెంజ్' పేరుతో నిర్వహించబడుతోన్న ఈ ట్రెండ్ మూలంగా వ్యక్తిగత ఫోటోలు, వివరాలు దుర్వినియోగం అయ్యే అవకాశాలు ఉన్నాయని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూజర్ల డేటాను విక్రయిస్తోందన్న ఆరోపణలు ఎదురుకుంటున్న ఫేస్‌బుక్ లాంటి ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ వ్యవస్థ కలిగిన సంస్థలు ఇలాంటి డేటాను మరింత లోతుగా కృత్రిమ మేధా(ఏఐ)కు మెరుగైన శిక్షణను ఇచ్చేందుకు ఉపయోగించే అవకాశాలున్నాయన్నది వారి వాదన. ఆయా మాధ్యమాల్లో ఇప్పటివరకూ ప్రొఫైల్ ఫోటోలను పోస్ట్ చేయని వాళ్ళు కూడా ఛాలెంజ్ మోజులో పడి తమ గత, ప్రస్తుత ఫోటోలను పెడుతుండటం ఆలోచించాల్సిన విషయం. ఇక, ఈ ఛాలెంజ్ లో పాల్గొనే యూజర్లు బ్యూటీ, వైద్య తదితర వ్యాపార సంస్థలకు, ప్రకటనకర్తలకు కూడా టార్గెట్‌గా మారే అవకాశం ఉన్నట్టు, ఫొటోల మార్ఫింగ్ చేసే దుండగులకు ఒక అవకాశాన్ని స్వతహాగా ఇచ్చినట్టేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈ ఛాలెంజ్ ఆరంభమైన మొదటి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు అరవై లక్షలమంది తమ ఫోటోలను వెనుకా ముందు ఆలోచించకుండా షేర్ చేయడం గమనార్హం.

**నమ్మదగ్గ సంస్థ కాదు**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 8.7కోట్ల మంది యూజర్ల డేటాను ఫేస్‌బుక్ విక్రయిస్తోందనే ఆరోపణల నేపథ్యంలో ఫేస్‌బుక్‌పై సుమారు 16వేల కోట్ల రూపాయల (22.5మిలియన్‌డాలర్ల)కు మించి పెనాల్టీ విధించేందుకు ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) యోచిస్తోన్నట్టు వార్తలు వస్తున్నాయి. కాగా, ఫేస్‌బుక్ యూజర్ల డేటా లీకైందనే విషయాన్ని స్వయంగా ఫేస్‌బుక్ సీఈఓ జుకర్ బర్గ్ అమెరికన్ పార్లమెంటరీ కమిటీ ముందే ఒప్పుకోవడం తెలిసిందే! ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఏ ప్రముఖ యాప్‌ను ఓపెన్ చేసినా వారి సమాచారం అంతా ఆటోమేటిక్‌గా ఫేస్‌బుక్‌కు చేరిపోతున్నదని.. ఫేస్‌బుక్ సాఫ్ట్ వేర్ డెవలప్మెంట్ కిట్(ఎస్‌డీకే) ద్వారా ఈ యాప్ డెవలపర్లు యూజర్ల సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకుంటున్నట్టు ఇటీవల ప్రైవసీ ఇంటర్నేషనల్ అనే స్వచ్ఛంద సంస్థ చేసిన పరిశీలనలో తేలింది. యూజర్ల సమాచారం బహిర్గతం అవుతోన్న నేపథ్యంలో.. రీసెర్చ్ కంపెనీ టోలూనా ఓ సర్వేను నిర్వహించింది. సర్వేలో పాల్గొన్న 40 శాతం మంది ఫేస్‌బుక్ అంత నమ్మదగ్గ సంస్థ కాదని పేర్కొనడం గమనార్హం.

**ఎన్నెన్ని 'ఛాలెంజ్'లో**

ఈమధ్య కాలంలో స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అంశాల నేపథ్యంలో పలు సవాళ్లు నెట్టింట్లో హల్‌చల్ చేశాయి. క్యాన్సర్ బాధితులకు సహాయపడేందుకు సష్టించిన 'లెమన్ ఫేస్ ఛాలెంజ్', ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి ఆరోగ్యకర వాతావరణానికి కృషి చేయాలన్న లక్ష్యంతో తెలంగాణలో పుట్టుకొచ్చిన 'గ్రీన్ ఛాలెంజ్', భారతీయులు ఫిట్‌నెస్‌గా ఉండాలనే ఉద్దేశంతో తెరపైకి వచ్చిన 'హమ్ ఫిట్‌తో ఫిట్ ఇండియా ఫిట్' ఛాలెంజ్ లు సమాజానికి మేలు చేసే ఛాలెంజ్‌లగా నిలువగా.. భయానక రౌండ్స్ తో ప్రాణాలతో ఆడుకొన్న బ్లూవేల్ ఛాలెంజ్, మోమో ఛాలెంజ్ లు అందర్నీ హడలెత్తించాయి. వీటితో పాటు లిప్ సింక్ బాటిల్ ఛాలెంజ్, వ్యాట్ ది ఫ్లఫ్ ఛాలెంజ్, ఇన్‌విజిబుల్ ఛాలెంజ్, ది డెలె అలీ హ్యాండ్ ఛాలెంజ్, ది నెయ్‌మార్ ఛాలెంజ్, స్నూట్ ఛాలెంజ్, వాటర్ బకెట్ ఛాలెంజ్ తదితరాలు అందరి మన్ననల్ని అందుకున్నాయి.

# తెరపైకి కొత్త 'ప్రవాసీ' బిల్లు!

### 35 ఏండ్ల తరాత్వ మారనున్న 1983 యాక్ట్

- వారణాసిలో నేటి నుంచి 'ప్రవాసీ భారతీయ దివస్'

**నవతెలంగాణ-హైదరాబాద్**

అనేక వ్యయప్రయాసలకోర్చి విదేశాలకు వలసెళ్తున్న వారి సంక్షేమం కోసం ప్రవాసీ బిల్లు మళ్లీ తెరపైకి వచ్చింది. 1983-ఇమిగ్రేషన్ యాక్ట్ 35 ఏండ్ల తర్వాత ఇమిగ్రేషన్ (విదేశీ వలసల) ముసాయిదా బిల్లు-2019గా రూపుదిద్దుకోనున్నది. సరిగ్గా ఎన్నికలకు ముందు ముసాయిదా బిల్లు తీసుకురావడం గమనార్హం. నేటి నుంచి మంగళవారం వరకు వారణాసిలో జరగనున్న 'ప్రవాసీ భారతీయ దివస్' నేపథ్యంలో కువైట్‌లోని స్వచ్ఛంద సేవకుడు మురళీధర్‌రెడ్డి గంగులతో 'నవతెలంగాణ' ప్రతినిధి రవితేజ ఫోన్‌లో మాట్లాడిన విశేషాలు... ప్రతియేటా దేశానికి రూ.5 లక్షల 70 వేల కోట్లు, ప్రతినెలా రాష్ట్రానికి దాదాపు రూ.1500 కోట్లు ఆదాయం సమకూరుతున్నా.. కార్మికుల కష్టాలు సమసిపోవడం లేదు. గత నాలుగేండ్లలో 27,500 మంది మృతిచెందారు. అప్పులు, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఏ ఒక్క కార్మికుడి కుటుంబానికీ ఎక్స్‌గ్రేషియా అందలేదు. అయితే రాబోయే చట్టంలో నకిలీ ఏజెంట్లపై, ప్రధానంగా గ్రామాల్లో మాయమాటలు చెప్తున్నవారిపై కఠిన చర్యలుండాలి.

**వాగ్దానాల అమలు ఏదీ..**

2017 మే 13న జరిగిన ప్రవాసీ సంపర్క్ కార్యక్రమంలో కేంద్రం ఇచ్చిన వాగ్దానాల్లో ఏ మేరకు అమలయ్యాయో తెలీని పరిస్థితి. సౌదీ కౌన్సిలేట్, విదేశీ భవనం, 800 పోస్ట్ ఆఫీసులను పాస్‌పోర్ట్ కేంద్రాలుగా మార్చడం, నకిలీ ఏజెంట్లను అరికట్టడం, సురక్షిత వలసల గురించి ప్రచార సాధనాల్లో ప్రసారం చేయడం వాటిల్లో ముఖ్యమైనవి. 2014 మ్యానిఫెస్టోతో పాటు 27 జూలై, 2016 సమావేశం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు కార్యరూపం దాల్చాలి. కేంద్ర ముసాయిదా బిల్లులో బడ్జెట్ కూడా పెట్టాలి. గల్ఫ్ కార్మికుల కోసం 500 కోట్ల రూపాయల నిధి, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, అనారోగ్యంతో తిరిగొచ్చిన కార్మికులకు పునరావాసం, ఉపాధికి రుణాలు, ఇండ్లు, సామాజిక భద్రత కోసం సరికొత్త ఎన్నారై పాలసీని వెంటనే అమలు చేయాలి. కార్మిక కుటుంబాలకు ఆంక్షల్లేకుండా రేషన్, రైతుబంధు చెక్కులను ఇవ్వాలి.



**అప్పుడే ఇండియా ఈజ్ యంగ్ : మురళీధర్‌రెడ్డి గంగుల, కువైట్**



డబ్బు ఖర్చు చేసి విదేశాలకు వెళ్లేకంటే స్వగ్రామంలోనే ఉపాధి కల్పించేలా కౌన్సెలింగ్ ఇవ్వాలి. అందుకు సహకారాలందించి ప్రోత్సహించినప్పుడే ఇండియా ఈజ్ యంగ్ అవుతుంది. మృతదేహాలను ఇంటికి చేర్చేందుకు రేషన్ కార్డు లింక్ పెట్టొద్దు. దహన సంస్కారాలకు నగదు సాయం అందించాలి. ఎన్నారై, గల్ఫ్ కార్మికుల వెల్ఫేర్ కోసం అసెంబ్లీ ద్వారా చట్టాన్ని ప్రవేశపెట్టాలి. భాషా సంస్కృతులు, న్యాయవ్యవస్థ, అరబిక్, ఆంగ్ల భాషల్లో అవగాహన కల్పించేలా శిక్షణనివ్వాలి. జైళ్లలో మగ్గుతున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయసహాయం అందించాలి. గల్ఫ్ వెళ్తున్నవారి వివరాలు నమోదుచేసి, వారి బాగోగులు పర్యవేక్షించాలి. 'మదద్' వెబ్‌సైట్‌ను మొబైల్ ఫ్రెండ్లీగా సవరించాలి. జరిమానాతో ఏజెంట్లు బయటపడకుండా వారికి జైలుశిక్షా విధించాలి.

**వసతులు, సౌకర్యాలపై ఆరా..**

విదేశాలకు వెళ్లే ప్రతి భారతీయ కార్మికుడి చేతిలోనే వారి పాస్‌పోర్ట్ ఉండేలా కృషి చేయాలి. కంపెనీలో వసతులు, సౌకర్యాలున్నాయో లేవోనన్న విషయాన్ని కేంద్రానికి తెలియజేసే అవకాశం ఉండాలి. ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించడం, వారి కేసుల పరిష్కారానికి అరబీ వచ్చిన సహాయకులు ఉండాలి. యజమానుల వద్ద కష్టాలు పడుతున్నవారికి ఆశ్రయం ఇచ్చి, కేసుల్లో వెంట ఉండి సహకరించాలి. అక్రమ రవాణా అరికట్టాలంటే పీసీసీ (పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్) ఇచ్చేముందే కంపెనీ సౌకర్యాలపై ఆరాతీయాలి.

### కొత్త బిల్లులోని ముఖ్యాంశాలు..

- విదేశీ వలసలను సమర్థవంతంగా నిర్వహించడం, సంస్థాగత, శాసన వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఒక పనివ్యవస్థ (ఫ్రేమ్ వర్క్) ఏర్పాటు ఆవశ్యకతతో కొత్త బిల్లును ప్రతిపాదిస్తున్నారు.
- ఇమిగ్రేషన్ మేనేజ్మెంట్ అథారిటీ (ఈమా)ను ఏర్పాటు చేసి వలసదారుల సంక్షేమం, రక్షణకు భరోసా కల్పిస్తారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దిక్సూచిగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వాలు, రిక్రూట్మెంట్ సంఘాల ప్రతినిధులను కలిగి ఉంటుంది. సమస్యల పరిష్కారానికి బ్యూరో ఆఫ్ ఎమిగ్రేషన్ పాలసీ, బ్యూరో ఆఫ్ ఎమిగ్రేషన్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలను నెలకొల్పి, రాష్ట్రాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు.
- విదేశాలకు ఉన్నత విద్యకోసం వెళ్లే వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ ప్రక్రియ సులభతరం చేయడానికి డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తారు.
- రిక్రూట్ ఏజెన్సీలు, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలను ఈ బిల్లు పరిధిలోకి తెచ్చారు.
- ఏజెన్సీలు విధిగా చేయాల్సిన పనుల జాబితా, ప్రయాణ పత్రాలు, బీమా పాలసీలు, డాక్యుమెంట్ రెన్యూవల్, నైపుణ్య పెంపుదల, బయలుదేరడానికి ముందు తగిన శిక్షణ.
- అక్రమ వ్యవహారాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో నిందితులకు కఠిన శిక్షలుంటాయి.



# మంత్రాలకు చింతకాయలు రాలుతాయా?

గ్రామాల్లో జోస్యం అంటూ వివిధ రూపాల్లో, వివిధ వేష అలంకారాలతో వీధుల వెంట తిరుగుతూ, జరిగినది, జరుగుతుంది, జరగబోయేది చెబుతాం అంటూ సంచరిస్తూ, సామాన్య ప్రజానీకానికి సాధారణంగా వుండే సమస్యలు చెబుతూ, మానసికంగా నమ్మకం కల్గించి, వివిధ దోషాలున్నాయనీ, వాటిని రూపుమాపేందుకు కొంత ఖర్చు అవుతుందనీ, అవి జరిపించుకుంటే మీకు శుభఫలితాలొచ్చి మంచి జరుగుతుందనీ చెబుతుంటారు. అందులో భాగంగా రంగురంగుల ఉంగరాల రాళ్లను ఎక్కడెక్కడో తెచ్చామనీ అధిక ధరతో ఇవ్వడం, పంచవర్ణాల తాయత్తు ఇవ్వడం, వివిధ రకాల పూజలు చేయించడానికి కావలసిన సరకులు తెప్పించి తతంగం నిర్వహిరస్తుంటారు. ఇలాంటివన్నీ సామాన్య ప్రజానీకంపై, పేదలపైననే, కష్టాలలో వున్న ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకొని జరుగుతున్నాయి. ఇంకొంతమంది ఇంకొంచెం అతి తెలివితో, నిమ్మకాయలను కోసి రక్తం కారుతుందని చెప్పడం, కొబ్బరికాయతో విభిన్న రకాల భయాందోళనలకు గురిచేస్తూ, ఇంకా వివిధ రకాల మ్యాజిక్‌లతో సామాన్య ప్రజానీకం జీవితాలతో ఆడుకొని వారి శ్రమ ఫలితాలను లాక్కుంటారు.

డా॥పోలం సైదులు

అనారోగ్యానికి గురైనప్పుడు బాగు చేయడం, మరీ అతిక్రమిస్తే అవయవాన్నీ మార్చివేయగల పరిజ్ఞానాన్ని కలిగిన ఈ రోజుల్లో ఇంకా మూఢనమ్మకాలను విశ్వసించడం అవివేకం. అయినా 'కుక్క తోక వంకర' అన్నట్టు మూఢనమ్మకాలను ఇంకా ఆచరిస్తున్నారంటే మనం సాధిస్తున్న ప్రగతికి ఫలితం ఇదేనా? అని పునరాలోచించాల్సిన అవసరం ఉన్నది. నిజంగానే నిమ్మకాయలు, అగరుబత్తీలు, సాంబ్రాను, కొబ్బరికాయలు, ఎండు మిర్చి, జీడి గింజలు, పసుపు, కుంకుమ, నల్లటి దారం, తాయిత్తులకు అంతటి మహిమ (శక్తి) వుంటుందా? చేతబడి చేస్తున్నారనే నెపంతో ఇలాంటి వారిపై దాడిచేసి, తనను నమ్ముకున్న కుటుంబాన్ని ఇరకాటంలో పెట్టి కష్టాలపాలు చేయడమనేది ఎంత వరకు మంచిది. నిజంగానే వాటికి అంత శక్తి ఉంటే ఆ మంత్ర శక్తులు వున్నవారు రాజులై పాలితులయ్యేవారు కానీ వాళ్ళు అలా బీదరికంతో బాధపడేవారు కారుకదా? మంత్రాలకు అంతటి అతీత శక్తులే ఉంటే పొరుగునవున్న శత్రు దేశాల నుండి మనల్ని కాపాడటానికి భారతమాత ముద్దుబిడ్డలైన వీర జవానులు సరిహద్దులలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆహర్నిశలు కష్టపడాల్సిన అవసరం ఉండేదా? లంచగొండులు, అవినీతిపరులు హాయిగా ఉండగలిగేవారా? అంటే అక్షరాస్యత కలిగిన వారు, మేధావులు, ధనవంతులపై ఇలాంటి మంత్రశక్తులు పనిచేయవా? ఎందుకు మన గ్రామీణ ప్రాంతంలోని నిమ్న వర్గానికి చెందిన పేదలే వీటి మూలంగా తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు? నిజంగానే మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? గతంలో అక్షరాస్యత అంతగా లేని కాలంలో, శాస్త్ర, సాంకేతిక, పరిజ్ఞానం అంతంత మాత్రంగానే ఉన్నప్పుడు మంత్రాల భ్రమలు ఉండేవి. నేటి ఆధునిక పరిస్థితులలో కూడా మంత్రాలున్నాయనడం ఒక్కెత్తైతే, ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానాలలో వున్నవారు కొంతమంది వాటిని నమ్మి, ఊతమివ్వడం ఒకెత్తు. మనిషి వ్యక్తిగత శైలి, అభిరుచి, అలవాట్లు అనేవి మరొక వ్యక్తి నుండి అనుకరణ ద్వారా అలవాటు అవుతాయి. శాస్త్రీయంగా నిరూపణలేని అంశాలకు ( మూఢ నమ్మకాలకు ) ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. నేటి గ్రామీణ సమాజంలో అవలంభిస్తున్న కొన్ని నమ్మకాలను పరిశీలించిస్తే... చేతబడి పేరుతో మనుషులను చంపుతున్నారన్న నెపంతో గతంలో తెలంగాణలోని వివిధ జిల్లాలలో చంపడం, జైలుకు వెళ్లడం చూశాం. చేతబడిని చిల్లంగి, బాణామతి, మంత్రం అని వివిధ పేర్లతో పిలవడం, విదేశాలల్లో బ్లాక్ మేజిక్, విచ్ క్రాఫ్ట్ అని రక రకాల పేర్లతో పిలిచినా ప్రపంచవ్యాప్తంగా వీటి వెనుక దాగివున్న అసలు విషయం ఒక్కటే. చిత్ర విచిత్ర చిత్త భ్రమలే! గ్రామాలలోని ఇంట్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే, నేరుగా వారి కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లకుండా మంత్రగాలతో మంత్రించడం, తాయితలు కట్టించడం అప్పటికీ తగ్గకపోతే ఎరుక చెప్పించడం చూస్తున్నాం. కొందరు పూనకంతో ఊగి వారికేమైందో చెప్పడం, వాటిని బాధితులు పూర్తిగా నమ్మడం వారేమో అంత తెలిసినట్టుగా మీరు ఫలాన దేవతలకు మొక్కు తీర్చలేదనో, బంధువులో, పాలోళ్లు, ఇంటికి అవతలి, ఇవతలి వారో చేతబడి చేశారనీ సెలవిచ్చి, వీరిని నమ్మించడం జరుగుతుంది. అంతటితో ఊరుకోక నేను తగ్గిస్తానని, చేయవలిసిన కొన్ని పనులను కూడా చెబుతారు. చేతబడి నుండి బయట పడాలంటే, మంత్రగాడిని ఊరి నడిబొడ్డున కట్టేసి గ్రామస్తులందరు కొట్టడం, నగ్నన్గా ఊరేగించడం, అతని ముందరి పళ్లను విరగొట్టడంలాంటి ఎన్నో తతంగాలను చేయిస్తూ, బాధితుల నుండి డబ్బులు లాగుతూ కాలయాపన చేస్తూ, అసలు రోగం ముదిరే వరకు ఆలస్యం చేసి వారి మరణాలకు కారకులవుతున్నారు. నిండుగా అలంకరించుకున్నారంటే చాలు రాత్రి వేళలో దిష్టి తీయించుకోవాల్సిందే, నూతన దుస్తులు ధరించినా, అందంగా ఉన్నా, తినే సమయంలో ఎవరైనా చూసినా, చలాకీగా మాట్లాడినా దిష్టియే. రోజంతా పనులు చేసి అలసిపోయి మెల్లగా నిద్రలోకి జారుకుంటే ఏమైనా కలలు వచ్చాయా? అంతే సంగతులు పొద్దున లేవగానే ఇంట్లో వారంతగా ఉమ్మడిగా చర్చలు కొనసాగించి, విశ్లేషణ చేస్తుంటారు. కలలో చిన్న పిల్లలు కనిపిస్తే బాలమ్మ దేవతని, ముత్తైదలు కనిపిస్తే పోశమ్మని వివిధ రకాల వాహనాలు, మేకలు కనిపిస్తే మైసమ్మ దేవతని, తెల్లచీర కట్టుకుని కలలోకి వస్తే ఇదమ్మని, ఫకీరులు, (ముస్లింలు)గానీ, గుర్రాలు గానీ కనిపిస్తే దర్గా దేవుడ్లని నమ్మడం, ఏవో మొక్కులుండి తీర్చకపోయినందుకే ఇలా వచ్చాయని నమ్మి వెంటనే వివిధ రకాల కార్యకలాపాలకు పాల్పడుతుంటారు. అంటే మన చదువులలో శాస్త్రీయత లోపించింది. వీటన్నిటినీ నమ్మడం మూలంగా సమయాన్ని, ధనాన్ని వధాగా ఖర్చు చేయవలసి వచ్చి, ఆర్థిక లేమితో బాధపడాల్సిరావడం సాధారణమైంది.



మంత్రాల నెపంతో తనయుడి చేతిలో హత్యకు గురైన తల్లి (ఫైల్)

గ్రామాల్లో జోస్యం అంటూ వివిధ రూపాల్లో, వివిధ వేష అలంకారాలతో వీధుల వెంట తిరుగుతూ, జరిగినది, జరుగుతుంది, జరగబోయేది చెబుతాం అంటూ సంచరిస్తూ, సామాన్య ప్రజానీకానికి సాధారణంగా వుండే సమస్యలు చెబుతూ, మానసికంగా నమ్మకం కల్గించి, వివిధ దోషాలున్నాయనీ, వాటిని రూపుమాపేందుకు కొంత ఖర్చు అవుతుందనీ, అవి జరిపించుకుంటే మీకు శుభఫలితాలొచ్చి మంచి జరుగుతుందనీ చెబుతుంటారు. అందులో భాగంగా రంగురంగుల ఉంగరాల రాళ్లను ఎక్కడెక్కడో తెచ్చామనీ అధిక ధరతో ఇవ్వడం, పంచవర్ణాల తాయత్తు ఇవ్వడం, వివిధ రకాల పూజలు చేయించడానికి కావలసిన సరకులు తెప్పించి తతంగం నిర్వహిరస్తుంటారు. ఇలాంటివన్నీ సామాన్య ప్రజానీకంపై, పేదలపైననే, కష్టాలలో వున్న ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకొని జరుగుతున్నాయి .ఇంకొంతమంది ఇంకొంచెం అతి తెలివితో, నిమ్మకాయలను కోసి రక్తం కారుతుందని చెప్పడం, కొబ్బరికాయతో విభిన్న రకాల భయాందోళనలకు గురిచేస్తూ, ఇంకా వివిధ రకాల మ్యాజిక్‌లతో సామాన్య ప్రజానీకం జీవితాలతో ఆడుకొని వారి శ్రమ ఫలితాలను లాక్కుంటారు.

మూఢనమ్మకాలను నమ్మవద్దని, ప్రజలలో చైతన్యం తేవడానికి స్వచ్ఛంద సంస్థలు మరెన్నో పుట్టుక రావాల్సిన తరుణమిది. నేడు గ్రామాల్లో, పల్లెల్లో నుంచి మేధావులు పుట్టుకొస్తున్న ఈ సందర్భంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దేనికి ఆదర్శమో ఆలోచించాల్సిన అవసరమున్నది. ప్రభుత్వాలు సైతం శాస్త్రీయ ఆలోచనలతో మూఢనమ్మకాల నిర్మూలనలో బాధ్యత వహించవల్సిన అవసరం వున్నది.నిరక్షరాస్యత, పేదరికం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేకపోవడం వలన గతంలో మూఢనమ్మకాల ప్రభావం అధికంగా ఉండేది. నేడు ఎంతో పురోభివద్ధి జరిగింది. అయినా ఇంకా పలుచోట్ల మూఢనమ్మకాల బారిన పడుతున్నాం. చేతబడి అనే మూఢనమ్మకం వలన దేశంలో 2008-12 మధ్య 770 మంది మహిళల ప్రాణాలు తీసారని జాతీయ మహిళా కమిషన్ వెల్లడించింది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలలోనూ చేతబడి నెపంతో కలిగే ఘోరపరిస్థితిని జాతీయ స్థాయి నేర నమోదు సంస్థ గణాంకాలు కలవరపరుస్తున్నాయి. ఇంకా ఇవి ఇలాగే కొనసాగితే మనం సాధిస్తున్న ప్రగతికి విలువ లేకుండా పోతుంది. వీటిని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా కంకణం కట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. విద్యార్థి దశలోనే ప్రపంచ స్థాయి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనా కల్గించాల్సిన అవసరం ఉన్నది.

సెల్ : 944193036

# భూమి కోసం గ్రామ బహిష్కరణ

ఏసురత్నం

మీకు ఉన్న భూమిని వీరికి పట్టా చేయాలని ఒత్తిడి చేస్తూ చివరకు కుల బహిష్కరణకు పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. 30 సంవత్సరాల క్రితం రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన రామేశ్వర్‌రెడ్డి నుంచి బండలింగాపూర్ గ్రామానికి చెందిన కందరి గంగారెడ్డి కొనుగోలు చేశాడు. సర్వే నెంబర్ 80లో ఎకరం 32 గుంటలను కొనుగోలు చేయగా ఈ భూమి నుంచి బండలింగాపూర్ గ్రామానికి చెందిన బద్ధం కోటేశ్, సామ వెంకట్ నర్సయ్యలకు పక్కపక్కనే వ్యవసాయ హద్దులు ఉంటాయి. అయితే ఎకరం 32 గుంటల భూమిలో 9 గుంటల భూమిని కోటేశ్, వెంకట్‌నర్సయ్యలపై పట్టా చేయాలని కులపెద్దలు నిర్ణయించి గంగారెడ్డి కుటుంబ సభ్యులకు వారం రోజుల గడువును ఇచ్చారు. మా భూమిని వారికి ఎందుకు పట్టా చేస్తామని కుల పెద్దలను బాధితులు ప్రశ్నించారు. అయినా కుల పెద్దలు పట్టా చేయాల్సిందేనని తెగేసి చెప్పారు. కానీ ఎందుకు చేయాలో సరైన సమాధానం చెప్పకుండా ఇబ్బందులకు గురి చేశారు. ఇలా గడిచినా వారికి పట్టా చేయకపోవడంతో కుల పెద్దల మాట వినలేదని 'నిన్ను ఊరి నుంచి వెలివేస్తున్నామని' కుల పెద్దలు ఆయనను బహిష్కరించారు. దీంతో చేసేది ఏమి లేక గంగారెడ్డి కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇలా నెల రోజులుగా మానసికంగా కృంగిపోయి ఆవేదన చెందినట్లు గంగారెడ్డి, వెంకట్‌రెడ్డిలు తెలిపారు. కులపెద్దల మాట వినక ధిక్కరించినందుకు మొదట రూ.50వేల జరిమానా విధించి మళ్లీ రూ.1లక్ష50వేల జరిమానా కట్టాలని ఒత్తిడి చేశారని చెప్పారు. అంతటితో ఆగకుండా అప్పటి నుంచి ఇప్పటి వరకు సంఘం చేసిన ఖర్చులు తానే భరించాలని హుకుం జారీచేశారు. ఇవి చెల్లిస్తేనే కుల బహిష్కరణ ఎత్తివేస్తామని గంగారెడ్డి కుటుంబ సభ్యులకు కుల పెద్దలు తెలిపారు.



## ఇదీ పంచాయతీ

సుమారు 5 నెలల క్రితం సరిహద్దు భూ విషయంలో విభేదాలు ఏర్పడ్డాయి. అదే గ్రామానికి చెందిన కందరి గంగారెడ్డి భూమి విషయంలో పక్కనే ఉన్న మిగతా వారికి గొడవలు తలెత్తగా బద్ధం కోటేశ్, సామ వెంకట నర్సయ్య, కందరి గంగారెడ్డి గుడేటి కాపు సంఘం పెద్దల వద్దకు వెళ్లారు. అక్కడ కుల సంఘ సభ్యులకు కందరి గంగారెడ్డి భూమి పట్టాను చూపించారు. అయితే మీ పట్టా భూమిలో వీరికి చెందిన భూమి ఉన్నది, ఆ భూమిని వీరిపేర రిజిస్ట్రేషన్ చేయాలని గుడేటి కాపు సంఘ సభ్యులు గంగారెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో నేను నా భూమిని వారికెందుకు రిజిస్ట్రే షన్ చేయాలని ప్రశ్నించడంతో ఆ కుటుంబాన్ని కుల బహి ష్కరణ చేశారు. వారితో ఎవరు మాట్లాడిన జరిమానా విధి స్తామని హెచ్చరించారు. బహిష్కరణ చేయడంతో పాటు రూ.ఒక లక్ష యాభై వేలు జరిమానా విధించారు. అలాగే గంగారెడ్డి కూతురు గంగారెడ్డితో మాట్లాడినందుకు రూ. 30వేలు జరిమానా విధించారు. చేసేదేమి లేక వారు ఆ జరిమానాను గుడేటి కాపు సంఘ సభ్యులకు చెల్లించారు. దీంతో ఎక్కడ న్యాయం జరగకపోవడంతో ఆగష్టు 10న జిల్లా కేంద్రంలోని అప్పటి ఎస్పీ సునీల్ దత్‌కు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. తిరిగి తన గ్రామానికి రావడానికి భయ పడ్డ గంగారెడ్డి అప్పటి నుంచి ఇప్పటి వరకు మెట్‌పల్లిలో ఓ ఇంటిని కిరాయికి తీసుకొని తలదాచుకుంటున్నాడు.

## సొంత కూతురు మాట్లాడినా జరిమానా

గ్రామంలో వీరితో ఎవరు మాట్లాడిన జరిమానాలు విధిస్తామని హుకుం జారీ చేశారు. ఇంతటితో ఆగకుండా గంగారెడ్డి కూతురు ఏనుగు సత్తమ్మ, అల్లుడు రామానుజం వీరితో మాట్లాడినందుకు సత్తమ్మకు రూ.30వేలు జరిమానా విధించినట్లు వివరించారు. అంతటితో ఆగకుండా పిడుగు అమృత్‌లబ్ మాట్లాడినందుకు రూ.10వేల జరిమానా విధించారు. చేసేదేమి లేక వీరు కులపెద్దలకు జరిమానాలు కట్టారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు చేసినా తగిన న్యాయం జరగలేదని, జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు.

సెల్ : 9948163703




జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం

# తండాల్లో ఆడపిల్లలపై వివక్ష

శ్రీపతిరావు

కండ్లు తెరవకముందే తెగుతోంది పేగుబంధం. పున్నామరకం నుండి తప్పించువాడు పుత్రుడనే నానుడి దేవరకొండ నియోజకవర్గ ప్రాంతంలో ప్రజలకు నరనరాల్లో జీర్ణించుకుపోయింది. దాని ప్రభావం ఆడపిల్లలపై చూపుతుంది. పుట్టిన ఆడపిల్లలు అంటరాని వస్తువునైట్టుగా వదిలించుకుంటున్నారు. పేదరికానికి నిలువుటద్దంగా కనిపించే గిరిజన ప్రాంతమైన దేవరకొండ పరిసర ప్రాంతాల్లో ఈ పరిస్థితి అధికం. ప్రేమ, పేగుబంధాలు పంచుకుని పుట్టిన ఆడశిశువులకు ఆర్థిక ఇబ్బందులను బూచిగా చూపించి 'ఆడపిల్ల' అనే సాకుతో వదిలించుకుంటున్నారు. వారసుడు కావాలనే ఆశతో ఆడపిల్లలకు అన్యాయం చేస్తూ వివక్ష చూపుతున్నారు. ఎన్ని కాన్పులైనా మగసంతానం కోసం ఎదురుచూడడం చివరికి ఆడపిల్ల జన్మిస్తే వదిలించుకోవడం, విక్రయించుకోవడం, దత్తత పేరుతో ఇతరులకు అప్పగించడం వంటి అటవిక చర్య అక్షరాస్యతలేని గిరిజనుల్లో పెనవేసుకుపోవడం గమనార్హం. ఆడపిల్ల పుట్టిందంటే ఇంటికి లక్ష్మీదేవి వచ్చిందని సంబురపడే వాళ్లు. కానీ గిరిజనులు మాత్రం వామ్మో..ఆడపిల్ల ..పాడుపిల్ల అని భయపడుతున్నారు. పేదరికం, అధిక సంతానం, కొడుకు కావాలనే కోరిక, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత పుట్టిన ఆడపిల్లలను వదులుకోవడానికి దారులు వెతుకుతున్నారు. ఆడపిల్లలను అమ్మి వదిలించుకోవడానికి, శిశు గృహానికి అప్పగించడానికి పురిగొల్పుతుంది.

దేవరకొండ నియోజకవర్గంలో అత్యధికంగా ఆడశిశువుల పట్ల వివక్ష అవలంభిస్తున్న వారిలో చందంపేట, డిండి, దేవరకొండ మండలాల్లో, గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాలు, దేవరకొండ ఐసీడీఎస్ పరిధిలో 2008 ఆగస్టు నుండి ఇప్పటివరకు సాకలేమని 253 మంది ఆడశిశువులను తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. మరో 80 మందికి పైగా అమ్మకాలు, మరో 60 మంది ఇతరులకు దత్తత పేరుతో అప్పగించడం వంటివి చోటు చేసుకున్నాయి. వందలాది మంది తల్లిదండ్రులకు ఆడశిశువులను అప్పగించొద్దని, వదిలించుకోవద్దని, అమ్ముకోవడం, దత్తత ఇవ్వడం నేరమని, కుటుంబనియంత్రణ చేయించుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా కొంతమంది తల్లిదండ్రులు తమ శిశువులు ఏడుస్తుండగానే శిశుగృహానికి అప్పగించిన సంఘటనలు వందలాది ఉన్నాయి.

## అధిక సంతానం.. ఉపాధి చూపండి

కుటుంబ నియంత్రణపై అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత, అధిక సంతానం పైగా ఆడపిల్లలు నిరుపేద కుటుంబాన్ని పోషించలేక తన కుటుంబానికి ఉపాధి అవకాశాలు చూపించాలని ఆడపిల్లపై వివక్ష చూపిన సంఘటన దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. దేవరకొండ డివిజన్‌లోని చందంపేట మండలం మోత్యాతండాకు చెందిన ఆంబోతు రాజు, సావిత్రి దంపతులకు ఈ నెల 8న 9వ కాన్పులో ఆడశిశువుకు జన్మనిచ్చారు. రాజు, సావిత్రి దంపతులకు 2002లో వివాహమైంది. రాజుకు మూడెకరాల భూమి మాత్రమే ఉంది. నీటి వసతిలేక వర్షాధార పంటలపైనే ఆధారపడి బతుకుతున్నారు. ఈదంపతులకు వరుసగా ఐదు కాన్పులలో ఆడపిల్లలు పుట్టారు. ఆరో కాన్పులో కుమారుడు, ఏడవ కాన్పులో ఇద్దరు కవల మగపిల్లలకు జన్మనిచ్చారు. వారిలో ఒక కుమారుడు రెండు నెలల తర్వాత మరణించాడు. 8వ కాన్పులో మరో మగపిల్లవాడు జన్మించాడు. ఈ నెల 8న 9వ కాన్పులో ఆడశిశువు జన్మించింది. మొదటి కాన్పు నుండి 8 కాన్పుల వరకు ఇంటి వద్దే డెలివరీ అయ్యింది. 9వ కాన్పు మాత్రం దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో సీజరింగ్ చేసి బిడ్డను బయటకు తీశారు. అయితే సావిత్రి డెలివరీ అయిన అనంతరం రక్తం కావాల్సి ఉండగా రాజు నల్లగొండకు వెళ్లాడు. ఆపరేషన్ చేసిన వైద్యుడు బిడ్డను ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు. బిడ్డను వారు శుభ్రం చేసి తల్లి సావిత్రికి అందజేశారు. ఈపని చేసినందుకు తమకు డబ్బులు కావాలని ఆస్పత్రిలో సిబ్బందిలో ఒకరు రాజు అత్తను అడిగారు. తమ వద్ద డబ్బుల్లేవని, పైగా ఆడపిల్ల పుట్టింది. కావాలంటే ఈ పిల్లను తీసుకెళ్లమని చెప్పింది. దీంతో అమ్మకానికి పెట్టినట్టు ప్రచారం చేశారని బాధితుడు రాజు పేర్కొన్నారు.



తొమ్మిదో కాన్పులో ఆడపిల్ల పుట్టడంతో అమ్మకానికి పెట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కుటుంబం

## దత్తత పేరుతో ఇద్దరు శిశువులు

గిరిజనుల అమాయకత్వాన్ని, అధికసంతానాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది దళారులు దత్తత పేరుతో గిరిజనులను మభ్యపెట్టి ఇద్దరు శిశువులను తీసుకెళ్లిన సంఘటన ఇటీవల చందంపేట మండలంలో చోటుచేసుకుంది. చందంపేట మండలం ఉస్మాన్‌కుంటకు చెందిన జటావత్ జయ, బద్యా దంపతులకు చెందిన రెండో సంతానంలో ఆడశిశువును, అదే మండలంలోని మోత్యాతండాకు చెందిన బానోత్ సోన్యా, బాలు దంపతులకు చెందిన ఇద్దరు ఆడశిశువులను విజన్ వాలంటరీ ఆర్గనైజర్ హైదరాబాద్ వారు దత్తత పేరుతో తీసుకెళ్లారు. 2018 నవంబర్ 10న కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఈ నెల 9న ఉస్మాన్‌కుంట, మోత్యాతండాకు వెళ్లి శిశువులను చూడగా అక్కడ కన్పించకపోవడంతో తల్లిదండ్రులను ఐసీడీఎస్ అధికారులు ప్రశ్నించారు. దీంతో తాము సాకలేక హైదరాబాద్‌కు చెందిన రజితకు అప్పగించామని తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు ఫోన్ ద్వారా రజితను సంప్రదించగా తాను విజన్ వాలంటరీ ఆర్గనైజర్ పేరుతో రిజిస్ట్రేషన్ ద్వారా దత్తత తీసుకున్నానని భయపెట్టింది. ఐసీడీఎస్ సీడీపీఓ సువర్ణ ఈనెల 10న చందంపేట ఎస్సైకి ఫిర్యాదు చేసింది. శిశువుల రక్షణ కోసం ఐసీడీఎస్ సిబ్బందితోపాటు నల్లగొండలోని ఐసీపీఎస్ రమాదేవి, సీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజరు వెంకటమ్మ శిశువులను తీసుకొచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

సెల్ : 9440424060

### తండాల్లో అవగాహన కల్పిస్తున్నాం



శిశువిక్రయాలు, బాల్యవివాహాలు, శిశువులను వదిలించుకోవడం వంటి వాటిపై డివిజన్ లోని గ్రామాలు, తండాల్లో అవగాహన కల్పిస్తు న్నాం. ప్రభుత్వ పథకాలతోపాటు "మాఇంటి మహాలక్ష్మి" పథకాన్ని కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ ప్రవేశపెట్టడంతో శిశువిక్రయాల సంఖ్య తగ్గి ంది. మాఇంటి మహాలక్ష్మి పేరుతో రూ.3 లక్ష లు కేటాయించి ఆడశిశువుల తల్లిదండ్రులను గ్రామాల్లోనే సన్మానించడంతోపాటు సత్కరించాం. ఆడపిల్లలు పుట్టిన ఇంట్లో సందడి చేస్తున్నాం. డెలివరీ అయిన ప్రతిశిశువునూ కాపాడేందుకు స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం పరిశీలిస్తున్నారు.

**- సువర్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ -దేవరకొండ**

### కన్నపేగును అమ్ముకునేంత నీచుణ్ని కాదు



నేను కన్నపేగును అమ్ముకునేంత నీచుణ్ని కాదు. కుటుంబ నియంత్రణపై అవగాహన లేక అధికసంతానం కలిగింది. ఉపాధి లేక ఇబ్బందిగా ఉంది. అమ్ముకునే వాడినైతే వరుసగా ఐదు మంది ఆడపిల్లలను ఎలా పెంచుతా. కావాలనే ప్రచారం చేస్తున్నారు. నా పిల్లను నేనే పెంచుకుంటా. ఉపాధి చూపండి. కాలం లేదు...పంటలు పండడం లేదు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన ఓ కుటుంబం వచ్చి "పెంచుకుంటా నీ బిడ్డను ఇస్తావా?" అని అడిగారు. వారిని తిట్టి పంపినా. కానీ నాకు సహాయం చేసి పని కల్పించండి. ఇట్లాగైనా అధికారులు పని కల్పిస్తారనే సాకలేనని చెప్పా. కానీ వేరే ఉద్దేశం నాకు లేదు.

**అంబోతు రాజు, పసిపాప తండ్రి**

‘ నా కొడుకుపై గెలిచినట్టుంది’.. పెర్త్‌లో 20 ఏండ్ల గ్రీస్ కుర్రాడిపై మూడు సెట్ల విజయానంతరం రోజర్ ఫెడరర్ వ్యాఖ్యలు. నిజమే ఫెడరర్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల సంఖ్యంత వయసున్న ఆ కుర్రాడు.. ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో స్విస్ యోధుడుతో తలపడటమే పెద్ద ఘనత. కానీ ఆ కుర్రాడు దిగ్గజంతో ఆడితే చాలు అనుకోలేదు, దిగ్గజంపై గెలిస్తే గొప్ప అనుకున్నాడు!. మెల్‌బోర్న్ పార్క్ కిక్కిరిసిన రాడ్ లావెర్ ఎరినాలో టెన్నిస్ దిగ్గజాన్ని జయించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతి పెద్ద సంచలనాన్ని నమోదు చేశాడు. డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్‌పై గెలుపొందాడు. అతడే గ్రీస్ సంచలనం స్టెఫానొస్ సిట్సిపస్. గ్రీస్ కుర్రాడి కండ్లుచెదిరే పోరాటంతో, 18 ఏండ్లలో క్వార్టర్స్‌కు చేరకుండానే ఫెడరర్ మెల్‌బోర్న్‌ను వీడటం ఇది రెండోసారి మాత్రమే.



# ఫెడరర్ నిష్క్రమణ

- గ్రీస్ కుర్రాడి పెను సంచలనం
- స్విస్ యోధుడిపై మెరుపు విజయం
- ప్రీ క్వార్టర్స్‌లో కంగుతిన్న కెర్బర్
- క్వార్టర్స్‌లో నడాల్, క్విటోవా, స్టిఫెన్స్



‘ ఈ భూమ్మీద ఇప్పుడు అత్యంత సంతోషంగా ఉన్న వ్యక్తిని నేనే. ఫెడరర్ టెన్నిస్ దిగ్గజం. ఎంతో గౌరవం. ఏండ్లుగా స్ఫూర్తిదాయక టెన్నిస్ ఆడుతున్నాడు. ఆరేండ్ల ప్రాయం నుంచే ఫెడరర్ ఆటను విశ్లేషించటం మొదలెట్టాను. రాడ్ లావర్ ఎరినాలో ఫెడరర్‌తో ముఖాముఖి ఆడాలనే కల నిజమైంది. ఇది విజయం సాధించటం అంటారా.. మాటల్లో వర్ణించలేను’

**- స్టెఫానొస్ సిట్సిపస్**



మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతి పెద్ద సంచలనం. 20 గ్రాండ్‌స్లామ్ టోర్నీల విజేత, టెన్నిస్ యోధుడు రోజర్ ఫెడరర్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరకుండానే నిష్క్రమించాడు. హోప్‌మన్ కప్‌లో తొలిసారి ఫెడరర్‌తో తలపడి, పెర్త్‌లో గట్టి పోటీనిచ్చిన 20 ఏండ్ల కుర్రాడు స్టెఫానొస్ సిట్సిపస్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం సృష్టించాడు. రికార్డు ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ సహా హ్యాట్రిక్ టైటిల్స్ వేటలో నిలిచిన ఫెడరర్‌ను 225 నిమిషాల మారథాన్ మ్యాచ్‌లో జయించి, టెన్నిస్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేశాడు. 6-7(11-13), 7-6(7-3), 7-5, 7-6(7-5)తో ఫెడరర్‌పై సిట్సిపస్ సంచలన విజయాన్ని నమోదు చేశాడు. మహిళల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ) సైతం కంగుతిన్నది. అమెరికా అమ్మాయి డానిలీ రోస్ కొలిన్స్ చేతిలో వరుస సెట్లలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మారిన్ సిలిచ్, స్లొనె స్టిఫెన్స్, మరియా షరపోవాలు ఓటమిపాలయ్యారు.

**యంగ్ వర్సెస్ ఓల్డ్! :** పురుషుల సింగిల్స్ సర్క్యూట్‌లో ప్రీ క్వార్టర్స్ బరిలో నిలిచిన పిన్న వయస్కుడు, అనుభవజ్ఞుడు తలపడిన మ్యాచ్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కే హైలైట్‌గా నిలిచింది. 37 ఏండ్ల రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్)కు 20 ఏండ్ల సిట్సిపస్‌పై విజయం నల్లేరు మీద నడకే అనుకున్నారు. కానీ ఏ కొలమానంతో అంచనాలు వేశారో సరిచూసుకోండని తొలి గేమ్‌లోనే సిట్సిపస్ చెప్పకనే చెప్పాడు. తొలి సెట్‌లో తొలుత సర్వ్ చేసిన స్టెఫానొస్ పాయింట్ కోసం చివరి వరకూ పోరాడాడు. 30-40తో వెనుకంజలో నిలిచినా.. పుంజుకుని 1-0 ఆధిక్యం సాధించాడు. సర్వ్‌తో సులువుగా పాయింట్ సాధించిన ఫెడరర్ 1-1తో సమం చేశాడు. ఇలా ఫెడరర్, స్టెఫానొస్‌లు తమ సర్వ్‌లు నిలుపుకోవటంతో స్కోరు 6-6 వరకూ సమంగానే సాగింది. కానీ టైబ్రేకర్‌లో పైచేయి సాధించిన ఫెడరర్ తొలి సెట్‌ను గెల్చుకున్నాడు. 2, 3వ సెట్లలోనూ ఇదే విధంగా జరిగింది. ఏ ఒక్కరూ సర్వ్‌ను కోల్పోలేదు. కానీ తర్వాతి రెండు టైబ్రేకర్లలో పైచేయి సాధించిన స్టెఫానొస్ 2-1తో క్వార్టర్స్ బెర్త్ ముందు నిలిచాడు. ఈ తరుణంలో అమీతుమీ తేల్చుకోవాల్సిన స్థితిలో నాల్గో సెట్ ఫెడరర్‌కు కీలకమైంది. కానీ ఆ సెట్లోనూ ఆట మారలేదు, ఫలితం మారలేదు. 6-6తో స్కోరు సమమైన వేళ టైబ్రేకర్‌లో ఫెడరర్ 5-7తో వెనుకంజ వేశాడు. క్వార్టర్స్‌కు చేరకుండానే ఇంటిముఖం పట్టాడు. తొలి మూడు సెట్లలో ఒక్క సర్వ్‌నూ కోల్పోకుండా, నాల్గో సెట్ ఆడాల్సి రావటం ఫెడరర్ బహుశా ఇదే ప్రథమం!. రిటర్న్, వ్యాలీలతో గొప్పగా ఆడినా యువ వేగం ముందు ఫెడరర్ నిలువలేదు. 55 అనవసర తప్పిదాలు ఫెడరర్‌ను దెబ్బతీశాయి. స్టెఫానొస్ 36 అనవసర తప్పిదాలే చేశాడు. స్టెఫానొస్ 20 ఏస్‌లు సంధించగా, ఫెడరర్ 12కే పరిమితమయ్యాడు. సిట్సిపస్ 62 విన్నర్లు సాధించగా, రోజర్ 61 విన్నర్లు సాధించాడు. ఓవరాల్‌గా గ్రీస్ కుర్రాడు 178 పాయింట్లు సాధించగా, ఫెడరర్ 166 పాయింట్లతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.



పురుషుల సింగిల్స్ మరో ప్రీ క్వార్టర్స్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ వరుస సెట్లలో గెలుపొంది క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. చెక్ రిపబ్లిక్ ఆటగాడు థామస్ బెర్డిచ్‌పై 6-0, 6-1, 7-6(7-4)తో గెలుపొందాడు. గతేడాది రన్నరప్ సైతం క్వార్టర్స్‌కు చేరలేదు. మారిన్ సిలిచ్ (క్రోయేషియా) ఐదు సెట్ల పోరులో రాబర్టో చేతిలో ఓటమిపాలయ్యాడు. 6-7(6-8), 6-3, 6-2, 4-6,6-4తో బటిస్టా ఆగట్ (స్పెయిన్) క్వార్టర్స్‌కు చేరాడు. అమెరికా కుర్రాడు ఫ్రాన్సెస్ 7-5, 7-6(8-6),6-7(1-7), 7-5తో గ్రిగర్ దిమిత్రొవ్ (బల్గేరియా)పై గెలుపొంది క్వార్టర్స్‌లో కాలుమోపాడు.

**షరపోవా, కెర్బర్ అవుట్ :** మహిళల సింగిల్స్‌లోనూ ఆదివారం సంచలన ఫలితాలే నమోదయ్యాయి. రెండో సీడ్, టైటిల్ ఫేవరెట్ ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ) సహా మాజీ వరల్డ్ నం.1, రష్యా స్టార్ మరియా షరపోవాలు ఇంటిముఖం పట్టారు. అమెరికా అమ్మాయి డానిలీ రోస్ కొలిన్స్ చేతిలో 0-6, 2-6తో కెర్బర్ దారుణ పరాభవం చెందింది. లోకల్ స్టార్ ఆష్లె బార్టీ (ఆస్ట్రేలియా)తో మూడు సెట్ల సమరంలో 6-1, 1-6, 4-6తో షరపోవా పోరాడి ఓడింది. యూ.ఎస్ ఓపెన్ విజేత స్లొనె స్టిఫెన్స్ సైతం మెల్‌బోర్న్‌ను వీడింది. రష్యా ప్లేయర్ అనస్తాసియా చేతిలో 7-6(7-3), 3-6, 3-6తో పరాజయం పాలైంది. మరో మ్యాచ్‌లో పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-1తో అనిసిమోవ (అమెరికా)పై వరుస సెట్లలో నెగ్గి క్వార్టర్‌ఫైనల్లోకి చేరింది.

# ముగింపు మొనగాడు అతడే!

- ధోనికి ఇయాన్ చాపెల్ కితాబు



**న్యూఢిల్లీ :** వన్డే క్రికెట్‌లో మహేంద్రసింగ్ ధోనీనే ఇప్పటికీ ముగింపు మొనగాడని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ కితాబిచ్చాడు. కొంతకాలంగా ఎం.ఎస్ ధోని ముగింపు సత్తా క్షీణిస్తోందని, అతడిలో మునుపటి వేడి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో హ్యాట్రిక్ అర్థ సెంచరీలతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ధోనిపై చాపెల్ ప్రశంసల జల్లు కురిపించాడు. ‘ ధోని మాదిరి మరెవ్వరూ మ్యాచులను ముగించలేదు. ధోని మరీ ఆలస్యం చేశాడని ఎన్నోసార్లు అనుకున్నాను. కండ్లుచెదిరే పవర్‌ఫుల్ షాట్లతో అన్నిసార్లు ఉత్కంఠ విజయాల్ని అందించాడు. వ్యూహాత్మకంగా ఇప్పటికీ మహి బుర్ర చురుగ్గా పనిచేస్తోంది’ అని చాపెల్ అన్నాడు. వన్డే క్రికెట్ మరో దిగ్గజ ఫినీషర్ మైకెల్ బెవాన్‌తో ధోనిని పోల్చిన చాపెల్.. మిస్టర్ కూల్‌కే ఓటేశాడు. ‘ బెవాన్ ఫోర్లతో మ్యాచులను ముగించగా, ధోని సిక్సర్లతో ఆ పని చేశాడు. వికెట్ల మధ్య పరుగు తీయటంలో బెవాన్ చురుకుదనంతో ధోనీకి పోటీ పెట్టవచ్చు కానీ, 37 ఏండ్ల వయసులోనూ అంతే వేగంగా మహి పరుగులు తీస్తున్నాడు. టీ20 ఫార్మాట్ అనుకూలత ధోనికి ఉన్నప్పటికీ, బెవాన్ కంటే ధోనియే అత్యుత్తమ ఫినీషర్. అందులో ఎటువంటి చర్చకు తావులేదు. వన్డే క్రికెట్ బెస్ట్ ఫినీషర్ ధోని’ అని తాను రాసిన ఓ కాలమ్‌లో చాపెల్ పేర్కొన్నాడు.

# వన్డే క్రికెట్‌లో గొప్పోడు!

- కోహ్లిపై మైకెల్ క్లార్క్ ప్రశంస



మెల్‌బోర్న్ : పరుగుల యంత్రం, భారత క్రికెట్ సూపర్‌స్టార్ విరాట్ కోహ్లికి ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ గొప్ప కితాబిచ్చాడు. వన్డే క్రికెట్ ఆడిన వారిలో విరాట్ కోహ్లియే గొప్పోడని తేల్చేశాడు!. ‘ నా వరకూ, వన్డే క్రికెట్ ఆడిన వారిలో విరాటే గొప్ప క్రికెటర్. భారత్ తరఫున కోహ్లి ప్రదర్శన, సాధించిన ఘనతలు చూశాక అతడే గొప్పోడని చెప్పేందుకు ఎటువంటి సందేహం అక్కర్లేదు’ అని క్లార్క్ అన్నాడు. కోహ్లి 219 వన్డేల్లో 10,385 పరుగులు చేశాడు. 59 బ్యాటింగ్ సగటుతో ఏకంగా 39 శతకాలు బాదాడు. క్రికెట్ మ్యాచులు నెగ్గటం పట్ల కోహ్లి ఫ్యాషన్‌కు గౌరవం ఇవ్వాలి. నిజమే, అతడికి దూకుడు ఎక్కువ. కానీ అతడి అంకితభావాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరు. ఎంతో సాధించాడు. అందుకే వన్డేల్లో అతడే గొప్పోడు’ అని క్లార్క్ కితాబిచ్చాడు.

# ప్రయివేటు ఆస్పత్రుల్లో నో సేఫ్టీ

## అగ్ని ప్రమాదం జరిగితే అంతే సంగతులు

- కనిపించని ప్రమాద నివారణ చర్యలు
- వేల ఆస్పత్రుల్లో అనుమతి పొందినవి కొన్నే..
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు


(ఫైల్)

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రయివేటు ఆస్పత్రుల్లో హఠాత్తుగా అగ్నిప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎంతమంది రోగులు, వారి సహాయకులు ప్రాణాలతో బయటపడతారు? దీనికి సమాధానం చెప్పడం కష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆదాయం పరమావధిగా యజమాన్యాలు వ్యవహరిస్తూ, ప్రమాద నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయి. ఇటీవల అగ్నిప్రమాద నివారణ చర్యలపై జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. ఆరు బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లను సీజ్ చేసింది. ప్రయివేటు ఆస్పత్రులపైనా ఇలాంటి తనిఖీలు చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది. ఖర్చు పేరుతో భద్రత నిబంధనలను పాటించకపోగా.. కనీస జాగ్రత్తలను కూడా ఆస్పత్రులు పాటించట్లేదు. చివరికి ఇది రోగుల ప్రాణాల మీదకు వస్తున్నది. గతేడాది హన్మకొండ రోహిణి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆస్పత్రిలో 190 మందికి పైగా రోగులు, వారి సహాయకులు ఉండగా.. ఇద్దరు మృతి చెందారు. రెండేండ్ల క్రితం భువనేశ్వర్‌లోని ఓ ఆస్పత్రిలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోగా, వందకుపైగా క్షతగాత్రులయ్యారు. ఆ సంఘటనలు జరిగినప్పుడు అధికారుల హడావుడి అంతా ఇంతకాదు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో మచ్చుకైనా తనిఖీలు జరపడం లేదు. రాష్ట్రంలో సుమారు 5 వేల ఆస్పత్రులు ఉన్నట్టు అంచనా. వీటిలో సర్కారువి 2,500 ఉంటే.. మిగిలినవి నాలుగైదు అంతస్తులున్న ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులే. వీటిలో ఫైర్‌సేఫ్టీ అనుమతి పొందినవి 500 లోపే ఉన్నాయని అధికారులు చెప్పడం విశేషం.

### నిబంధనలు బేఖాతర్

ప్రభుత్వాస్పత్రులు ఫైర్‌సేఫ్టీపై పట్టనట్టే వ్యవహరిస్తున్నాయి. ప్రతిష్టాత్మక ఉస్మానియా, నిమ్స్, కోఠి ప్రసూతి ఆస్పత్రి, నిలోఫర్, కింగ్‌కోఠి ఆస్పత్రుల్లో ఫైర్‌సేఫ్టీ ఇసుమంతైనా కనిపించదు. కనీసం సీఓ-2 ఫైర్ సిలిండర్లను కూడా సమయానికి మార్చలేకపోతున్నారు. ఏదో మొక్కుబడిగా చేశామన్నట్టు చేసేస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి అగ్నిప్రమాద నివారణ చర్యలు పాటించేవి వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఇందులో ఎక్కువగా ఇరుకిరుకు భవనాల్లో చికిత్స అందించేవే ఉండటం విశేషం. ఎయిర్ కండీషన్డ్ మిషన్ల లోపల విద్యుత్ తీగలను అమరుస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు పరిశీలించకపోతే ఏ క్షణాన అగ్నిప్రమాదం సంభవిస్తుందో ఊహించడం కష్టమే. నిజానికి ఏడాదికోసారి ఇవి అనుమతులను పునరుద్ధరించుకోవాలి. కానీ, నిబంధనలు పాటిస్తున్నాయో.. లేదో పరిశీలించకుండానే ముడుపులు తీసుకొని ఆస్పత్రులకు అనుమతులిచ్చేస్తున్నారు. ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదం జరిగితే చాలా వరకు ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో చాలా ఆస్పత్రుల్లో ఫైర్ ఎగ్జిట్‌లు లేకపోవడం, అగ్నిప్రమాదంపై కనీస ముందస్తు ఆలోచన లేకపోవడంతో ఏదైన ప్రమాదం సంభవిస్తే పెద్దఎత్తున ప్రాణాపాయం జరిగే అవకాశాలున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఫైర్‌సేఫ్టీ, వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

### 1999 చట్టం ప్రకారం

1999 ఫైర్‌సేఫ్టీ చట్టంలోని సెక్షన్ 121 పలు నిబంధనలు పేర్కొంటున్నది. 15 మీటర్లకు పైగా ఎత్తున్న వ్యాపార సంబంధ భవనాలు విధిగా ఫైర్‌సేఫ్టీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. గృహ సంబంధ నిర్మాణాలకు సంబంధించి 18 మీటర్లపైగా ఎత్తున్న బహుళ అంతస్తులకు ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ తప్పనిసరి. కానీ, బహుళ అంతస్తుల భవనాల్లో చాలా వరకు ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రులకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు, నిబంధనలను పాటించకుండా ఏర్పాటు చేస్తున్నారు. ఇరు శాఖల అధికారులు పెద్దఎత్తున ముడుపులు తీసుకొని అనుమతుల ఇచ్చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అనుమతుల విషయంలో అగ్నిమాపక శాఖ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ఏయే భవనాలకు ఫైర్‌సేఫ్టీ అనుమతి ఉంది. వేటికి లేదో ఖచ్చితంగా నిర్ధారించాలి. ఆ తరువాతే భవన నిర్మాణం చేయాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. జీ ప్లస్ టూ భవనాలకు ఖచ్చితంగా ఫైర్‌సేఫ్టీని పాటించాల్సి ఉంటుంది. ఆ మేరకు 30 ఫీట్ల రోడ్డుండాలి. ఆ తరువాత అగ్నిమాపక శకటం తిరిగేందుకు ఖాళీ స్థలం వదలాలి. కానీ చాలా వాటిలో కనీసం వాహనాలకు కూడా పార్కింగ్ సదుపాయం లేదు. నిబంధనలు పాటించే వాటిని వేళ్లమీద లెక్కపెట్టవచ్చుంటే అతిశయోక్తి కాదు.

## ఇవీ నిబంధనలు

అగ్నిప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. కాబట్టి ప్రత్యేకంగా జనరేటర్ ఉండాలి. భవనంపైన నీటి తెరను ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగినప్పుడు పక్కనున్న భవనాలకు వ్యాపించకుండా నీళ్ల నిరంతరాయంగా పడుతుండాలి. ప్రతి అంతస్తుకు నీటిని అందించే పైపును ఏర్పాటు చేయాలి. ఆస్పత్రి బయట కూడా పొడవైన పైపులను ఏర్పాటు చేయాలి. వీటి ద్వారా వెలుపలి నుంచి భవనంపైకి నీళ్లను చిమ్మడం వీలవుతుంది. ప్రమాదం జరగ్గానే హెచ్చరికను మోగించే పరికరాన్ని అమర్చాలి. భవనం కింది భాగంలో 70 వేల లీటర్ల నీటిని నిల్వచేసే ట్యాంకును, 30 వేల లీటర్ల సామర్థ్యమున్న మరొక దాన్ని భవనం పైభాగానా ఏర్పాటు చేయాలి. ఈ నీటిని వేటికీ వాడకూడదు. ఈ నీళ్లను పైపుల్లో నిరంతరం సరఫరా చేస్తుండాలి. ఆరు నెలలకోసారి అగ్నిప్రమాద నివారణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తుండాలి. భవనానికి రెండు వైపులా మెట్లను ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగినప్పుడు రోగులు, సిబ్బంది వీటి ద్వారా బయటకు వచ్చే వీలుంటుంది. వీటి గురించి పెద్దక్షరాలతో గోడలపై రాసి ఉంచాలి. నిబంధనల ప్రకారం 15 మీటర్ల ఎత్తు దాటిన భవనాలపైనే చర్యలు తీసుకునే అధికారం అగ్నిమాపక శాఖకు ఉంటుందని సంబంధిత అధికా రులు పేర్కొంటున్నారు. అంతకన్న తక్కువ ఎత్తున్న భవనాలపై చర్యలు తీసుకొనే అధికారం లేదని.. అలాంటి భవనాల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే.. సమయానికి వెళ్లి ప్రమాదాలు అదుపుచేస్తామని తెలిపారు.

## రాష్ట్రంలో జరిగిన అగ్నిప్రమాద వివరాలు

| ఏడాది | ప్రమాదాలు | మరణాలు | నష్టం |
|---|---|---|---|
| 2014-15 | 8715 | 150 | రూ.122 కోట్లు |
| 2015-16 | 9530 | 158 | రూ.143 కోట్లు |
| 2016-17 | 8660 | 25 | రూ.189 కోట్లు |
| 2017-18 | 5500 | 12 | రూ.102 కోట్లు |

# జడ్జీల అరెస్టు సరికాదు

- ఆ పని చేసేది హైకోర్టులోని విజిలెన్స్ రిజిస్ట్రార్ విభాగం
- ఆరోపణలు వస్తే ఏసీబీ అత్యుత్సాహం సరికాదు : అఖిల భారత జడ్జెస్ అసోసియేషన్ ఘాటు విమర్శ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి న్యాయమూర్తులపై ఆరోపణలు వస్తే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నదని అఖిల భారత జడ్జెస్ అసోసియేషన్ ఘాటుగా విమర్శించింది. అలాంటి అవినీతి ఆరోపణలు వస్తే హైకోర్టులో విజిలెన్స్ రిజిస్ట్రార్ విభాగానికి ఫిర్యాదు చేయాలని, విచారణలో నిజమని తేలితే సదరు న్యాయమూర్తిని సస్పెండ్ చేసే అధికారం హైకోర్టు ఉన్నదని తెలిపింది. అయితే, ఈ విషయంలో ఏసీబీ అధికారులకు సంబంధం లేకున్నా.. సరైన ఆధారాలు లేకున్నా న్యాయమూర్తులను అరెస్టు చేస్తున్నారని మండిపడింది. ఇలాంటి ఘటనలు న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని దూరం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు హోటల్‌లో పలువురు న్యాయమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా జడ్జెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏకే సింగ్ మాట్లాడుతూ ఇటీవల అవినీతి ఆరోపణల పేరుతో ఏసీబీ అధికారులు పలువురు న్యాయమూర్తులను అరెస్టు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. రెండు నెలల క్రితం రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న వరప్రసాద్ అనే న్యాయమూర్తిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారని గుర్తుచేశారు. అయితే, సదరు న్యాయమూర్తి అవినీతికి పాల్పడలేదని తమ విచారణలో వెల్లడైందని వివరించారు. సరైన ఆధారాలు లేకుండానే ఏసీబీ అరెస్టు చేసిందని విమర్శించారు. ఏసీబీ తీరుతో ఆ న్యాయమూర్తి సమాజంలో తలెత్తుకోని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయని.. ఇప్పుడికైనా ఆరోపణలు వస్తే ఏసీబీ అధికారులు హైకోర్టులోని విజిలెన్స్ రిజిస్ట్రార్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయమూర్తి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ అన్ని రాష్ట్రాల్లోని జడ్జీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. న్యాయవ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలే నేటికి కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు పేదరికం, అవగాహన లేకపోవడంతో కిందిస్థాయి కోర్టుల తీర్పుపైనే ఆధారపడుతున్నారని.. న్యాయం కోసం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని అన్నారు. జిల్లా కోర్టులలో కూడా ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. హైకోర్టు జడ్జీల నియామకంలో కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టుకు వివాదం ఉన్నదని తెలిపారు. తెలంగాణ న్యాయశాఖ అధికారులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు వస్తే సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ న్యాయమూర్తి షా తదితరులు పాల్గొన్నారు.

# గనుల తవ్వకాల్లో కార్మికుల భద్రత తప్పనిసరి

- పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మైనింగ్‌లో పనిచేసే కార్మికుల భద్రతను పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. కేవలం తవ్వకాలు, ఆదాయంపైనే కాకుండా భద్రతపై కూడా దృష్టి సారించాలని గనుల సంస్థలకు సూచించారు. ‘గనుల తవ్వకాల్లో భద్రత’ అనే అంశంపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఒక రోజు జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఖనిజాల ఉత్పత్తి దేశ అభివృద్ధికి వెన్నుముఖ అని తెలిపారు. అదే సమయంలో తవ్వకాలు జరిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా కార్మికుల భద్రతపై ఆయా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్ని సంస్థలు ఆదాయమే పరమావధిగా భావిస్తున్నాయని విమర్శించారు. అలాంటి సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. గనుల శాఖ డైరెక్టర్ ప్రీతుల్ కుమార్, జాతీయ గనుల డైరెక్టర్ సుశీల్ కుమార్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మైనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.మల్సూర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బాంబుల తయారీకి ఆరెస్సెస్ ట్రెయినింగ్

- మధ్యప్రదేశ్ మంత్రి ఆరోపణ





**భోపాల్:** ఆరెస్సెస్.. ఆయుధాలు, బాంబులను తయారు చేసే శిక్షణనిస్తోందని మధ్యప్రదేశ్ రాష్ట్ర క్యాబినెట్ మంత్రి డాక్టర్ గోవింద్ సింగ్ ఆరోపించారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గోవింద్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో కలకలం రేపాయి. ఆరెస్సెస్... ఆయుధాలు, బాంబులు, గ్రెనేడ్లు, పేలుడు పదార్థాల తయారీకి శిక్షణనిస్తోందని, పేలుళ్లకు పరోక్షంగా కారణమవుతోందని ఆయన ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలపై రాష్ట్ర మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ వెంటనే స్పందించారు. ఇది కాంగ్రెస్ మేధో దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై కాంగ్రెస్ సర్కారును బీజేపీ విమర్శించగా.. ప్రతిగా మంత్రి గోవింద్ సింగ్ పై విధంగా స్పందించారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.